

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 213 పేజీలు: 10+4 వెల: 6.50


నేడు ఢిల్లీలో జాతీయ జలశక్తి సదస్సు

అమెరికాలో ఇద్దరు కేరళం మహిళల హత్య 3



3

## వైభవంగా తీజ్ వేడుకలు

వాగు నుంచి నల్లమట్టి సేకరించి గోధుమ నాట్లు వేసిన మహిళలు



5

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు



5

## ఇక పార్కులు, నైట్ క్లబ్స్‌లోనూ మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు!

చైనా సంచలన నిర్ణయం

# ఇక చాలు ముగించండి

యుద్ధం మానవాళిని వెనక్కి నెడుతోంది

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోడీ

షాంఘై సహకార సదస్సు వేదికగా భేటీ

భారత్ శాంతివైపు ఉంటుందని స్పష్టీకరణ

మరోమారు ఒకే కారులో మోడీ-పుతిన్ ప్రయాణం



బిష్కెక్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోడీ

**బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్), ఆగస్టు 31:** కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న వార్షిక 'షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు వేదికగా సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలు, ఉక్రెయిన్‌లోని సంఘర్షణపై చర్చలు జరిపారు. "అంతులేని యుద్ధం నుండి యుద్ధ ముగింపు దిశగా పయనించాలని" రష్యా నాయకుడిని కోరారు. వార్షిక బ్రిక్స్ సదస్సు కోసం రష్యా అధ్యక్షుడు భారతదేశానికి రానున్న కొద్ది రోజుల ముందు ఈ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు తొలుత ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం భారత్, రష్యా సంబంధాలు, ఉక్రెయిన్ సంక్షోభం సహా పలు అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలోనే పుతిన్‌తో భేటీలో ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి భారత్ వైఖరిని వివరించారు మోడీ. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి శాంతి వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. "యుద్ధంలో గడిపే ప్రతి రోజూ మానవాళిని వెనక్కి నెడుతోంది. అదే శాంతి దిశగా వేసే ప్రతి అడుగు మానవాళిలో కొత్త ఆశ, ఉత్సాహాన్ని నింపుతుంది. అంతులేని యుద్ధం నుంచి >>2

# తేల్చుకుందామా?

పదేళ్లలో కెసిఆర్, వెయ్యి రోజుల్లో నేను ఏం చేశామో అసెంబ్లీలో చర్చిద్దాం

విపక్షనేతగా ఆయనపై చేసిన ఖర్చు రూ. 21 కోట్లు

కెసిఆర్ రాజీనామా కోరుతూ నేటి నుంచి ఆందోళనలు

అసెంబ్లీ సమావేశాల్లో అన్నీ చెబుతా

మూసారాంబాగ్ హైలెవెల్‌బ్రిడ్జిని ప్రారంభించిన సిఎం రేవంత్



సోమవారం మూసారాంబాగ్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 31:** '1000 రోజుల్లో కోటి ఇరవై నాలుగు లక్షల నలభై వేల జీతం కేసీఆర్ తీసుకున్నాడు, ప్రభుత్వ ఉద్యోగి ఏడాది పాటు విధులకు రాకపోతే డిస్మిస్ చేస్తారు, మరి కేసీఆర్‌ను ఏం చేయాలి? ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ భద్రత, వసతుల కోసం 21 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది. 1000 రోజుల్లో పేదలు, ఆడబిడ్డలు, విద్యార్థులు, రైతులు, దళితులు, ఆదివాసీల కోసం ఒక్క రోజైనా పనిచేశావా? మనమడు ఆస్పత్రికి వెళ్తే, బంధువులు ఎవరైనా చనిపోతే తప్ప బయటకు రాలేదు' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు.'1000 రోజుల్లో ఒక్కరోజైనా పనిచేశావా.. నీకు, నాకు పోలికనా? 1000 రోజులు ప్రభుత్వ సొమ్ము మెక్కి గంట కూడా పనిచేయని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని అన్ని చోట్ల నిరసనలు తెలపాలి అని పిలుపునిచ్చారు. ఇరవై రెండు కోట్ల నాలుగు లక్షల నలభై వేల జీతం తీసుకున్న ప్రతిపక్ష నాయకుడు వెంటనే రాజీనామా చేయాలని నిరసనలు తెలపాలి, 6న ఇందిరా పార్క్‌లో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలి, 7నుంచిజరిగే అసెంబ్లీ సమావేశాల్లో వాళ్ల ఎదురుగానే అన్ని విషయాలు చెప్తా, >>2



## ఢిల్లీలో మరో 'నిర్భయ' ఘోరం

కదులుతున్న బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్

లిఫ్ట్ ఇచ్చి బస్సులోనే అఘాయిత్యం

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2012 నిర్భ య ఘటనను గుర్తుచేసేలా మరో దారుణం గ్రేటర్ నోయిడాలో చోటు చేసుకుంది. కదులుతున్న బస్సులో 16 యేళ్ల బాలికపై >>2

# రైతుల కోసం జైలుకైనా రెడీ!

22ఎతో 50 లక్షల మందికి సమస్య

ధరణికంటే భూ భారతి మరింత దరిద్రం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ధ్వజం




సిద్దిపేటలో సోమవారం ధర్నా చేస్తున్న రాంచంద్రరావు, అర్వింద్, రఘునందన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** 22ఏ రద్దు చేయకపోతే అసెంబ్లీనడవనివ్వం... రైతులకోసం జైలుకు వెళ్లాడినికి.. లాఠీ దెబ్బలు తినడానికి సిద్దంగా ఉన్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 22ఏ సమస్య చాల తీవ్రమైన సమస్య అన్నారు. 22ఏతో రాష్ట్రంలో 50 లక్షల మంది బాధపడుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వం తీసుకవచ్చిన ధరణికంటే ప్రస్తుత కాంగ్రెస్ తీసుకవచ్చిన భూ భారతి దరిద్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ సర్కార్ భూ భారతి తీసుకవచ్చి ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కార్‌కు రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. పేదప్రజల భూములను సర్కార్ లాక్కుటుందన్నారు. పేద ప్రజలను, రైతులను వేధించడానికి 22ఏ తెచ్చారని మండిపడ్డారు.అవినీతిని పెంచడానికి రేవంత్‌రెడ్డి సర్కార్ భూ భారతి తీసువచ్చిందన్నారు. బిఆర్ఎస్ సర్కార్ హయంలో కుటుంబం బాగుపడితే కాంగ్రెస్ సర్కార్‌లో రేవంత్‌రెడ్డి బ్రదర్స్ బాగుపడుతున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు.కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. 22ఏలో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి ఇండ్లు ఉన్నాయని తీరా ఏలాంటి దరఖాస్తు చేయకుండనే నిషేధ జాబిత నుంచి తొలిగించారని ఇది ఎక్కడ న్యాయమని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనపై అనుభవం లేదు కానీ రియల్ వ్యాపారంపై అనుభవం ఉందన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పాడానికి రైతులు ఏకంగా కావాలన్నారు. 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చడం పొరపాటే అని ఒప్పుకున్న సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు పొరపాటును సరిద్దిద్దే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. 22ఏలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ఎకరాల భూములు తీసుకొచ్చారో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. 22ఏ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు.
మెదక్ ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ 22ఏ ను రద్దు చేసే వరకు సిద్దిపేట ఉద్యమ గడ్డ నుంచి అసెంబ్లీ వరకు పోరాటం చేస్తాం : మెదక్ ఎంపి రఘునందన్‌రావు
మెదక్ ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ 22ఏ ను రద్దు చేసే వరకు సిద్దిపేట ఉద్యమ గడ్డ నుంచి అసెంబ్లీ వరకు పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి పేనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా మారిందన్నారు. కడుపు కాలుతున్న >>2

# అభివృద్ధికొండ 'వెలిగొండ'

మూడు దశాబ్దాల కల సాకారం

నల్లమల కొండలను చీల్చుకొని కృష్ణమ్మ పరుగులు

మొదటి దశలో లక్షా 19వేల ఎకరాలకు సాగునీరు..

వెలిగొండను ప్రారంభించిన ఏపి సిఎం చంద్రబాబు



వెలిగొండలో కృష్ణానదికి సారె సమర్పిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

**మార్కాపురం, ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు దశాబ్దాల సంకల్పం నెరవేరింది.. కరువు నేలపై కృష్ణమ్మను పారించాలన్న ఆకాంక్ష నెరవేరడం నా అదృష్టంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా గంటవానిపల్లె వద్ద కృష్ణమ్మకు హారతి ఇచ్చి ప్రజల హర్షధ్వానాల మధ్య వెలుగొండ ప్రాజెక్టు జలాలను నలుమల సాగరకు విడుదల చేసి జాతికి అంకితం చేశారు. అనంతం జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. పనుల 1996 మార్చి 5వ తేదీన వెలుగొండ ప్రాజెక్టుకు పునాది వేసి పునాది వేసిన నేను తిరిగి మూడు దశాబ్దాల తర్వాత ప్రారంభోత్సవం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. వెలుగొండ ప్రాజెక్టు బంగారు కొండగా ప్రజల జీవితాలను మార్చేస్తుందన్నారు. 30 ఏళ్ల కల సాకారం కావడానికి ఎన్నో సవాళ్లను సమస్యలను ఎదుర్కోవడం జరిగిందన్నారు. >>2



నేపాల్ విషాదం:

# 900పైనే మృతులు

ఇంకా ఆచూకీ దొరకని 4,200 మంది

**కాఠ్మండు, ఆగస్టు 31:** నేపాల్ జల ప్రళయంలో మృతుల సంఖ్య 900 దాటింది. నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఆర్ఆర్ఎంఎ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకు 903 మృతదేహాలను వెలికితీశారు. నదీ తీరాల్లో కొట్టుకొచ్చిన మృతదేహాలతో విపత్తు తీవ్రత స్పష్టమవుతోంది. ఈ విపత్తులో అత్యధికంగా దక్షిణ చిత్వాన్ జిల్లాలో 272 మృతదేహాలు లభ్యమయ్యాయి. పెద్ద సంఖ్యలో లభిస్తున్న మృతదేహాలను నిర్వహించడం అధికారులకు పెను సవాలుగా మారింది. వ్యాధులు ప్రబలకుండా >>2

## పుట్టింటి నుంచే బయటకు పంపారు

బిఆర్ఎస్ సస్పెన్షన్‌పై కవిత భావోద్వేగం 2

నిజామాబాద్ సభలో కన్నీటి పర్యంతమైన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి



# జోరుజోరుగా ప్రాజెక్టులు

దేవాదుల నుంచి 10 టిఎంసిల ఎత్తిపోత

'సీతారామ' ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరు

యాతాలకుంట సొరంగం 16 నెలల్లోనే పూర్తి

సరళా సాగర్ ఆధునీకరణ చర్యలు

పూర్తికానున్న మరికొన్ని ప్రాజెక్టులు



**హైదరాబాద్, ఆగస్టు 31,ప్రభాతవార్త:** రైతు పొలానికి నీరందితేనే వ్యవసాయం బలోపేతమవుతుందనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు వెయ్యి రోజుల పాలనలో కదలిక తీసుకురావడంతో పాటు, కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతూ తెలంగాణ సాగునీటి ముఖచిత్రాన్ని మార్చే దిశగా అడుగులు వేస్తోంది. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి దక్కాల్సిన హక్కుల సాధనపై దృష్టి సారిస్తూనే.. భూసేకరణ, నిధులు, పునరావాసం, సాంకేతిక అనుమతులు వంటి అడ్డంకులను అధిగమిస్తూ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తోంది. కరువు పరిస్థితుల్లోనూ దేవాదుల నుంచి సుమారు 10 టిఎంసి నీటిని ఎత్తిపోసి 22 జలాశయాలను నింపడంతో పాటు, సుమారు 3.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఉత్తరతెలంగాణకు వరప్రదాయినిగా భావించే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే బ్యారేజీ ఎత్తు పెంపుపై మహారాష్ట్రతో మరోసారి చర్చలు ప్రారంభించింది. 2016లో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర అంగీకరించినప్పటికీ, అది ఉత్తర తెలంగాణ అవసరాలకు సరిపోదని నిపుణులు సూచించడంతో బ్యారేజీ ఎత్తు పెంపు అవసరమని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఎత్తు పెరిగితే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీం నగర్, మెదక్ జిల్లాలకు గ్రావిటీ ద్వారా సాగు, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూసుగూడెంలో 2024 ఆగస్టు 15న సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి >>2


బిష్కెక్‌లో ఒకే కారులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోడీ

# ముగించండి

>> బయటపడి, యుద్ధానికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. మానవాళి సంక్షేమానికి ఇదెంతో అవసరం. అన్ని సమస్యలకు వీలైనంత త్వరగా శాంతియుత పరిష్కారం కనుగొనాలన్నది మానవాళి పిలుపు, ఇదే భారతదేశ సందేశ్ణం అని ఆయన అన్నారు. "గాంధీ గడ్డ, బుద్ధుని గడ్డ ఒకే సందేశాన్ని పంచుకుంటున్నాయి. అదే శాంతి మార్గ్ణం అని పుతిన్‌కు ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అనంతరం బ్రిక్స్ సదస్సు కోసం పుతిన్ త్వరలో జరగనున్న భారత పర్యటన గురించి కూడా ఇద్దరు నేతలు చర్చించారు. "కొన్ని రోజుల్లో భారతదేశం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వబోతోంది. మీకు, మీ ప్రతినిధి బృందానికి స్వాగతం పలకడానికి భారతీయులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మీ పర్యటన మన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, బ్రిక్స్ చట్రంలో చర్చలు, సహకారాన్ని మరింత పటిష్టం చేస్తుంద్ణి అని మోడీ అన్నారు. భారత్– రష్యా సంబంధాలు నిరంతరం విస్తరిస్తుండటాన్ని కూడా ఆయన ప్రశంసించారు. "గత సంవత్సరం మీ భారత పర్యటన అత్యంత విజయవంతమైంది. నిజంగా చిరస్మరణీయమైనది... మన సహకారం కొత్త శిఖరాలను అధిరోహిస్తూ ఉండటం, ఇరు దేశాల ప్రజల సంక్షేమం కోసం మనం కలిసి పనిచేయడం మాకు ఎంతో సంతృప్తినిస్తోంది," అని మోడీ అన్నారు. "జాతీయ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడమే మన ఉమ్మడి విధానం, భవిష్యత్తులో కూడా ఇదే మన మార్గదర్శక సూత్రంగా ఉంటుంద్ణి అని ఆయన పునరుద్ఘాటించారు. "ప్రత్యేక, విశేషాధికార భాగస్వామ్య్ణం ఆధారంగా ఇరు దేశాల సంబంధాలు బలపడుతూనే ఉన్నాయని పుతిన్ అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, ఇరు దేశాల మధ్య బంధాలపై మోడీ చూపిస్తున్న శ్రద్ధ దీనికి తోడ్పడిందని ఆయన అన్నారు. భారత్, రష్యాల మధ్య పెరుగుతున్న విద్యా, సాంస్కృతిక, పర్యాటక సంబంధాలను కూడా పుతిన్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఇటీవలి సంవత్సరాలలో రష్యాలో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏడు రెట్లు పెరిగి 40,000కు చేరిందని ఆయన తెలిపారు. ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, జీ20, ఎస్‌సిఒ వేదికలపైనా ఇరు దేశాలు సన్నిహితంగా సమన్వయం చేసుకున్నాయని ఆయన అన్నారు.

**మరోసారి ఒకే కారులో మోడీ, పుతిన్ ప్రయాణం**

కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ద్వైపాక్షిక చర్చలు ముగించుకున్న వెంటనే, ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బిష్కెక్ అరేనాలో జరిగే 'వరల్డ్ నోమాడ్ గేమ్స్ణ ప్రారంభోత్సవానికి ఒకే కారులో ప్రయాణించి తమ మధ్య ఉన్న గాఢమైన సాన్నిహిత్యాన్ని మరోసారి చాటిచెప్పారు. గత యేడాది సెప్టెంబరులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన ఎస్‌సిఒ నాయకుల శిఖరాగ్ర సమావేశం సమయంలో కూడా, తమ ద్వైపాక్షిక సమావేశ వేదికకు ఒకే కారులో ప్రయాణించడం ద్వారా ఈ ఇద్దరు నాయకులు ఇలాంటి సాన్నిహిత్యాన్నే ప్రదర్శించారు. విశ్లేషకులు దీనిని ప్రధాని మోడీ "కార్ డిప్లొమసీ" (కారు దౌత్యం)గా అభివర్ణించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా వివిధ సోషల్ మీడియా వేదికలపై పెద్ద చర్చనీయాంశంగా మారింది.

## అన్నా హజారే ఆరోగ్యం విషమం

### ముంబైలోని ఆస్పత్రికి తరలింపు

### ఐసియులో ప్రత్యేక వైద్య చికిత్స

**ముంబై, ఆగస్టు 31:** ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆరోగ్యం క్షీణించింది. స్వస్థలం రాలేగావ్ సిద్ధి గ్రామానికి సమీపంలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అన్నా హజారే ఆరోగ్యం విషమించ దంతో, ఆయనను హుటాహుటిన ముంబైకి తరలించి, బాంబే ఆసుపత్రిలోని ఐసియులో చేర్చారు. తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్, తీవ్రమైన డీహైడ్రేషన్‌కు గురైన సీనియర్ గాంధేయ కార్యకర్తను తదుపరి వైద్య సంరక్షణ కోసం ముంబైకి తరలించారు. ఆయన ప్రస్తుతం డాక్టర్ గౌతమ్ భన్సాలీ పర్యవేక్షణలో ఉన్నారు. తదుపరి చికిత్సను నిర్ణయించడానికి బాంబే ఆసుపత్రి వైద్యులు హజారే పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అన్నాహజారే ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

## అభివృద్ధికొండ 'వెలిగొండ'

>> డ్యాములు పూర్తి చేయడంతో పాటు సొరంగ మార్గాల పనులను పూర్తి చేసి 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నీళ్లు ఇవ్వడం జరిగిందన్నారు. నల్లమల కొండలను చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు తీస్తుంటే ఆనందంగా ఉందన్నారు. తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు.4 లక్షల మందికి తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. 2028లో రెండోదశ పూర్తి నాలుగు జిల్లాల్లోని నాలుగు లక్షల 37,ఎకరాలకు సాగునీరు 23 లక్షల మందికి తాగునీరు అందిస్తామన్నారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలు కూడా మార్కాపురం జిల్లాలో నల్లమల సాగర్ రిజర్వాయర్‌లో ఆనందోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైందన్నారు కరువు కాటకాలతో పాటు ఫ్లోరైడ్ సమస్యతో సతమతమవుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు.ఆ రోజు చేసిన సంకల్పం.ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారిందన్నారు. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చామన్నారు. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోందని ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగిందని, వెలిగొండ బంగారు కొండగా మారి ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు.

## 900పైనే మృతులు

>> నివారించేందుకు, కాళీ గండకి, త్రిశూలి నదుల సంగమ స్థలమైన దేవఘాట్‌లో చాలా మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు. భవిష్యత్తులో గుర్తింపు ప్రక్రియ కోసం, ఖననం చేయడానికి ముందు మృతదేహాల నుంచి డిఎన్ఏ నమూనాలను సేకరించినట్లు చిత్వాన్ జిల్లా యంత్రాంగం తెలిపింది. మరో 21 గుర్తుతెలియని మృతదేహాలను వివిధ ఆసుపత్రుల్లో ఉంచామని, బంధువులు వచ్చి గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ వరద విపత్తులో సుమారు 4,247 మంది ఆచూకీ గల్లంతైందని ఎన్‌డిఆర్‌ఆర్‌ఎంఏ వెల్లడించింది. వీరిలో 592 మంది విదేశీయులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. భోటేకోశి, త్రిశూలి నదీ తీరాల్లోని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 933 మంది కార్మికుల ఆచూకీ కూడా తెలియరాలేదు. నేపాల్– చైనా సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న నేపాల్ ఆర్మీ, పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 252 మంది విదేశీయులు సహా మొత్తం 10,451 మందిని సురక్షితంగా కాపాడారు. నేపాల్ ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా 3,344 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు భారత, చైనా సాంకేతిక బృందాల సహాయం తీసుకుంటున్నారు. మొత్తం 20,819 మంది సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఈ విపత్తులో 267 మంది గాయపడగా, వారిలో 156 మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు.

## జైలుకైనా రెడీ!

>> రైతులు, బాధితులు 22ఏను రద్దు చేయాలని కోరుతున్నారని తెలిపారు.ఒక యేడాది తర్వాత కాంగ్రెస్ ఖాళీ కావడం ఖాయమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు సంబంధించి 22ఏలో చేర్చిన భూములు ఏలా తీసేశారో అలాగే రైతుల భూములను దరఖాస్తుతో సంబంధం లేకుండా 22ఏ నుంచి తీసేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న 22ఏ తొలగించని పక్షంలో సెప్టెంబర్ 7 నుంచి రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, రైతులు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, విద్యాసాగర్,దూరి శ్రీకాంత్‌రెడ్డి, రామచందర్‌రావు, విభీషణ్‌రెడ్డి బాసంగారి వెంకట్, వెంకట్, సంతోష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**01-09-2026, మంగళవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**శ్రావణం మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె**
తి.చవితి ఉ.7.41 న.అశ్వని రా.2.41
వ.రా.10.48–రా.12.21
దు.ఉ.8.22–ఉ.9.12
2)రా.11.19–రా.12.09
రాహు. మ.3.00–సా.4.30
శుభ ఉ.9.30–ఉ.10.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక వ్యవహారాలలో ఆటుపోట్లు, వివాదాలకు దూరంగా ఉండండి. దూరపు బంధువులతో మాట పట్టింపులు తప్పవు.

**వృషభం :** స్థిరాస్తి విషయాలలో చికాకులు తప్పవు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు.

**మిథునం :** పనులు నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు, స్వల్ప ధన లాభం.

**కర్కాటకం :** బంధువులు, మిత్రుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**సింహం :** ముఖ్యమైన పనులు అనుకున్న ప్రకారంగా పూర్తిచేస్తారు. ప్రేమ విషయాలలో పురోగతి సాధిస్తారు.

**కన్య :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**తుల :** వాహనాలు స్థలాల కొనుగోలు యత్నాలు కలిసి వస్తాయి. పెట్టుబడులకు అనుకూల సమయము. నూతన వస్తు లాభం.

**వృశ్చికం :** చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక వ్యవహారాలు లాభసాటిగా కొనసాగుతాయి.

**ధనుస్సు :** మిత్రుల ద్వారా ఆసక్తికరమైన సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పమార్పులు.

**మకరం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు. ఉద్యోగులకు స్థానమార్పులు వుంటాయి.

**కుంభం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**మీనం :** సంఘ సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. ఒక ముఖ్య వ్యవహారంలో అనుకూల ఫలితాలు ఉంటాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జోరుజోరుగా ప్రాజెక్టులు

>> ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్టులో కీలకమైన 1.781 కిలోమీటర్ల యాతాలకుంట సొరంగాన్ని కేవలం 16 నెలల్లో పూర్తి చేయడం విశేషం. దీంతో సుమారు 1.31 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మార్గం సుగమమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.40,600 కోట్లుగా ఉండగా, 2026 బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు కేటాయించారు. భూసేకరణ, పునరావాసం, మౌలిక సదుపాయాల కోసం రూ.587 కోట్లు మంజూరు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ప్రాజెక్టులు వేగవంతం..ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, భీమా, జూరాల ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నారాయణపేట జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటి అవసరాల కోసం రూపొందించిన నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రూ.4,700 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీల్లో పనులు కొనసాగుతున్నాయి. 4,200 ఎకరాల భూసేకరణతో పాటు పంప్‌హౌస్‌లు, ప్రెషర్ మెయిన్లు, కాలువల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వడివడిగా ఎస్ ఎల్ బిసి 2025లో సొరంగ ప్రమాదంతో నిలిచిపోయిన శ్రీశైలం ఎడమగట్టు కాలువ పనులను ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రమాద ప్రాంతాన్ని తప్పించి కొత్త డైవర్షన్ మార్గంలో రెండు వైపుల నుంచి తవ్వకాలు కొనసాగుతున్నాయి. 43.93 కిలోమీటర్ల పొడవైన ఈ సొరంగంలో ఇప్పటికే 35 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన 9 కిలోమీటర్ల పనులను ఆధునిక సాంకేతికతతో చేపడుతున్నారు. 2027లో టన్నెల్ బ్రేక్‌త్రూ, 2028లో పూర్తి స్థాయి కమిషనింగ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు అందనుంది. ఆధునికీకరణ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏఎంఆర్‌పీ, ఎస్‌ఎల్‌బిసి పరిధిలో ఎగువ కాలువ లైనింగ్ పనులు 25 ఏళ్ల తర్వాత ప్రారంభమయ్యాయి. రూ.349 కోట్లతో అక్కంపల్లి నుంచి కేతేపల్లి వరకు 102 కిలోమీటర్ల మేర పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఏడు నియోజకవర్గాల్లోని 2.85 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా మెరుగుపడనుంది. వనపర్తి జిల్లాలోని చారిత్రాత్మక సరళాసాగర్ ప్రాజెక్టును ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.1.94 కోట్లతో మరమ్మతులు, డీసిల్టింగ్, కాలువల అభివృద్ధి, నీటి పంపిణీ వ్యవస్థ ఆధునికీకరణ పనులు చేపట్టింది. ఆసియాలో అరుదైన సైఫన్ సాంకేతికతతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు ద్వారా 4,182 ఎకరాలకు సాగునీరు అందుతోంది. హైదరాబాద్‌కు గోదావరి జలాలుహైదరాబాద్ భవిష్యత్ తాగునీటి అవసరాలు, మూసీ నది పునరుజ్జీవనం కోసం గోదావరి ఫేజ్2, ఫేజ్3 ప్రాజెక్టులకు ప్రభుత్వం రూ.7,360 కోట్లతో శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు ద్వారా నగరానికి అదనంగా 20 టీఎంసీల గోదావరి నీటిని తరలించనున్నారు. కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి 2025 జూన్ 6న ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.574.56 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ జలాశయం, బస్వాపూర్ రిజర్వాయర్‌తో కలిసి సుమారు 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూపకల్పన చేశారు. బాధితులకు పరిహారం రూ. 17 కోట్లు మొదటి విడతలో అందింది. రెండో విడతలో రూ. 88.84 కోట్లు పంపిణీ అవుతుంది. మూడో విడతలో ప్రపోజల్స్ పంపారు. రూ. 32.75 కోట్లు త్వరలో అందనుంది. ఆదిలాబాద్ జిల్లాలో పిప్రి, తేజాపూర్ ఎత్తిపోతల పథకాలు, ముత్నూర్ చిన్న లిఫ్ట్ ఇరిగేషన్, లాండసాంగి చెక్‌డ్యాం, చిక్మన్ వాగు ప్రాజెక్టు, అమ్మనమడుగు వాగు మరమ్మతు పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కొమురం భీం ఎత్తిపోతల ప్రాజెక్టుకు అదనంగా రూ.176 కోట్లు మంజూరు చేసి, ఆయకట్టును మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీరామ్‌సాగర్ రెండో దశ కాల్వకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ.1,043 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి 97,349 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టింది. పత్తిపాక ప్రాజెక్టుకు లైన్ క్లియర్ చేసి త్వరలోనే డిపిఆర్ సిద్ధం చేయనుండగా, రూ.50 కోట్లతో మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సామర్థ్యం పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నీటి హక్కులపై ప్రత్యేక దృష్టికేంద్ర జల సంఘం ప్రకారం గోదావరి నదిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 1,435టిఎంసిలలో తెలంగాణకు 968 టిఎంసిల నీటి హక్కు ఉంది. ఈ హక్కులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా కొత్త ప్రాజెక్టులు, పెండింగ్ పథకాల పూర్తి, అంతర్రాష్ట్ర సమన్వయం, ఆధునిక సాంకేతికత వినియోగంతో సాగునీటి రంగాన్ని బలోపేతం చేయడంపై ప్రజా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. తుంగభద్ర జలాల వినియోగం, ఆర్డీఎస్‌లో తెలంగాణ వాటా సాధన కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేవాదుల పది మోటార్లు ఆన్ చేసి దిగువన 22 జలాశయాలకు నీరు వసతి కల్పించే అవకాశం ఉన్నప్పటికి తొమ్మిది పంపులు ఆన్ చేసి భీమ్ ఘన పూర్ రిజర్వాయర్ లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. నీటిని దిగువకు పంపింగ్ చేస్తున్నారు. ఎల్ నినో ప్రభావంతో ఎదురైన గడ్డుకాలాన్ని దేవాదుల నీటితో కొరతను తీరుస్తుంది ప్రజా ప్రభుత్వం. గోదావరి నది నుంచి నెల రోజులుగా ఎత్తిపోతల కొనసాగుతున్నది. ఇప్పటివరకు టిఎంసి నీళ్లు ఎత్తిపోశారు. దీంతో 22 రిజర్వాయర్లకు జలకళను సంతరించుకున్నాయి. 3.16 లక్షల ఎకరాలకు నీళ్లు అందాయి. ఈ నీటిని అక్టోబర్ వరకూ పంపింగ్ చేసే అవకాశం ఉంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసింది. నిర్మాణ నాణ్యత, డిజైన్, వ్యయాలు, పరిపాలనా లోపాలు ఆర్థిక అవకతవకల నిర్ణయాలపై కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందించారు


కఠ్మాండులో జరిగిన 'ఇన్ సాలిడారిటీ విత్ నేపాల్' కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్, సినీనటి మనీషా కొయిరాల

## చేయూత పెన్షన్ దరఖాస్తులకు 15 రోజుల గడువు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు31:** చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం మరో 15 రోజుల పాటు పొడిగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరి ముఖ్యంగా హైదరాబాదులో కొనసాగుతున్న సర్ ప్రత్యేక ప్రక్రియ కారణంగా పలువురు అర్హులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించలేకపోతున్నారని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా దివ్యాంగులు తమకు మరికొంత సమయం ఇవ్వాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ విజ్ఞప్తులను సానుకూలంగా పరిగణించిన మంత్రి సీతక్క, అర్హులైన ప్రతి ఒక్కరూ కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 15 రోజుల పాటు పెంచుతూ సెర్ప్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన పేద కుటుంబాల వారు సెప్టెంబర్ 15 వరకు తమ దరఖాస్తులను సమర్పించుకునే అవకాశం లభించింది.

# తేల్చుకుందామా!

>> తెలంగాణకు న్యాయం చేయాలని అనుకుంటే, నమ్మకం ఉంటే అసెంబ్లీకి కేసీఆర్ రావాలి అని సవాల్ చేశారు. పదేళ్లలో కేసీఆర్ ఏం చేశాడో, 1000 రోజుల్లో నేను ఏం చేశానో అసెంబ్లీలో చర్చకు సిద్ధం అని సవాల్ చేశారు. మూసీ నదిపై అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో కొత్తగా నిర్మించిన ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని సోమవారం సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందికొక్కుల్లా తిని ఫామ్‌హౌస్ నుంచి బయటకు రారా? అని సవాల్ చేశారు. దేశంలో ఎవరైనా ప్రతిపక్ష నాయకుడు 1000 రోజులు బయటకు రాకుండా ఉన్నారా..? ప్రధాన ప్రతిపక్షం వైఫల్యం చెందిన రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో నేను, నా ముసల్ది అని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత మొత్తం తన కుటుంబాన్ని దించాడు,గుంపు మందలా జమై మంది సొమ్ము తిన్నారు,రేపటి(మంగళవారం) నుంచి ఆరు రోజుల పాటు ప్రతిపక్ష నాయకుడు రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనలు తెలపాలి అని పిలుపునిచ్చారు. '1000 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాను, 1931లో బ్రిటిష్ వాళ్లు కులగణన చేస్తే, మళ్లీ 100 ఏళ్ల తర్వాత తెలంగాణలో బీసీ కులగణన చేసి మోదీకి సవాల్ విసిరాం. గిగ్ వర్కర్ల కోసం పాలసీ తెచ్చాం..స్పోర్ట్స్, ఐటీ, టూరిజం, ఎండోమెంట్ పాలసీ తీసుకువచ్చాం అని చెప్పారు. సెక్రటేరియట్ ముందు రాజీవ్ విగ్రహం తీస్తామంటున్నారు.. ముట్టుకోండి చూస్తాం అని సవాల్ విసిరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలన్న ఆలోచన కూడా రాలేదు.. సెక్రటేరియట్ ముందు మేం పెట్టాం, మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహాన్ని నెక్లెస్ రోడ్డులో పెట్టాం.. ఇది మా పరిపాలన వైఫల్యమా? అని ప్రశ్నించారు.చాకలి ఐలమ్మ మనవరాలిని మహిళా కమిషన్ సభ్యురాలిని చేశాను అని చెప్పారు..నాకు, మీకు పోలికనా..? అని ప్రశ్నించారు.ఇందిరమ్మ ఇళ్లను ఆడబిడ్డల పేరుతో ఇస్తున్నాం. అడిగిన వాళ్లందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నాం, 15 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.మూడు కోట్ల నలభై ఎనిమిది లక్షల మందికి ఆరు కిలోల సన్న బియ్యం ఇస్తున్నాం, మూడు కోట్ల నలభై ఎనిమిది లక్షల మందిలో బీఆర్ఎస్ వాళ్లు కూడా ఉన్నారు.. సన్నబియ్యం తింటూ విమర్శలు చేస్తున్నారు, కేసీఆర్ ఏనాడైనా ఆలోచించాడా..? అని ప్రశ్నించారు.7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం, హైదరాబాద్‌లో పేదల కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం.ఆడబిడ్డలకు ప్రభుత్వ భూములు ఇచ్చి పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయిస్తున్నాం, హైటెక్ సిటీ పక్కన మహిళా సంఘాలకు 1,000 కోట్ల విలువైన మూడున్నర ఎకరాల్లో వాళ్ల ఉత్పత్తుల విక్రయాల కోసం ఇందిరా మహిళా శక్తి స్టాల్స్ ఏర్పాటు చేశాం,మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను అమెజాన్‌లో అమ్ముతున్నారు అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 1000 రోజులు పూర్తి చేసుకున్నాం, ప్రజా పాలన వచ్చి ఇప్పటికి 1000 రోజులైంది,1000 రోజుల ప్రజా పాలనపై మేం కార్యాచరణ తీసుకున్నాం,నిరసన తెలుపుతామని కొందరు బయలుదేరారు, పదేళ్లు తెలంగాణను నడిపించిన వాళ్లు, కబళించిన వాళ్లు ఇప్పుడు నిరసనలు తెలుపుతామంటున్నారని బిఆర్ఎస్‌ను దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సమస్యలను నేను అర్థం చేసుకుంటా అని చెప్పారు.32 నెలల్లో ఎప్పుడైనా 1వ తేదీన జీతాలు ఇవ్వకుండా ఆపామా..? ఉద్యోగులు ఆలోచించాలి,తుఫాన్ వచ్చినా, కరువు వచ్చినా ఒకటో తేదీనే జీతాలు వేశాం, ఏ బ్యాంకులు నమ్మడం లేదని ఉద్యోగులు నా దగ్గరకు వచ్చారు, ఆనాడు ఎలా ఉంది, ఈనాడు ఎలా ఉందో ఉద్యోగులు ఆలోచించాలి అని సూచించారు. ఐదున్నర లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఐదో తేదీనే జీతాలు ఇస్తున్నాం, గతంలో ఆరు నెలలకొకసారి జీతాలు ఇచ్చేవాళ్లం.. కానీ ఐదో తేదీనే జీతాలు ఇస్తున్నాం అని చెప్పారు. 61 ఏళ్లకు ఉద్యోగ వయోపరిమితి పెంచడంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ మా ప్రభుత్వంపై పడ్డాయి. 8 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు కేసీఆర్ పెట్టిపోయాడు, రెండు నెలల్లో 6 వేల కోట్ల రిటైర్మెంట్ బకాయిలు విడుదల చేశాం. ఉద్యోగులు, వాళ్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని చెప్పారు.

## ఢిల్లీలో మరో 'నిర్భయ' ఘోరం

>> సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగస్టు 4న జరిగిన ఈ అమానవీయ ఘటనకు సంబంధించిన వివరాలు తాజాగా వెలుగు చూశాయి. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి ప్రాంతానికి చెందిన 16యేళ్ల బాలిక, చదువు విషయంలో తల్లి మందలించడంతో ఇంట్లో చెప్పకుండా నోయిడాలోని తన బంధువుల ఇంటికి బయలుదేరింది. అయితే, చీకటి పడటం, భారీ వర్షం కురుస్తుండటంతో నోయిడాలోని ప్యారి చౌక్ వద్ద బస్సు దిగింది. అప్పటికే రాత్రి 9 గంటలు కావొచ్చింది. తాను చేరాల్సిన గమ్యం ఇంకా 25 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలుసుకుని, వర్షంలో తడుస్తూ ఒంటరిగా నిల్చుంది. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆమె దగ్గర ఆగింది. అది లాంగ్ డిస్టెన్స్ ప్రయాణాల కోసం ఉపయోగించే స్లీపర్ బస్సు కావడం, అందులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం గమనార్హం. తాము కూడా నోయిడా సెక్టార్ 63 వైపే వెళుతున్నామని కండక్టర్ చెప్పడంతో బాలిక బస్సు ఎక్కింది. వాస్తవానికి ఆ బస్సు గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లోని ఓ వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదలడం ప్రారంభించిన కొద్దిసేపటికే కండక్టర్ అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అనంతరం ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే చంపేస్తామని డ్రైవర్, కండక్టర్ ఆమెను బెదిరించారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణం తర్వాత, బాధితురాలిని ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వద్ద రింగ్ రోడ్ సమీపంలో వదిలేసి పరారయ్యారు. ధైర్యం కూడగట్టుకున్న బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)లను ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో అరెస్ట్ చేశారు. విశ్వనాథ్ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## పుట్టింటి నుంచే బయటకు పంపారు

### బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌పై కవిత భావోద్వేగం

### నిజామాబాద్ సభలో కన్నీటి పర్యంతమైన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు31:** బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నాతో ఎందుకు ఇలా చేయాలి?' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు 'కవిత సీఎం.. సీఎం' అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు.



## ప్రమాదాల్లో మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల కుటుంబాలకు బీమా సొమ్ము అందజేత

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో వుంటూ రోడ్డు ప్రమాదాలలో మరణించిన ముగ్గురు పోలీసు కానిస్టేబుల్స్ కుటుంబ స భ్యులకు బీమా సొమ్ము తలా కోటి రూపాయలను డిజిపి సివి ఆనంద్ సోమవారం అందజేశారు. మొదటి ఘటనలో 2025 ఫిబ్రవరి మూడవ తేదీన శంకర్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎఆర్ కాని స్టేబుల్ ముత్యంగి శ్రీనివాస్ మరణించాడు. అతని తండ్రి ముత్యంగి యాదయ్యకు డిజిపి కోటి రూపాయల చెక్కును సోమవారం డిజిపి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు.

మరో ఘటనలో 2025 జూన్ మూడవ తేదీన నల్లగొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ బి. సైదులు మరణించాడు. నల్లగొండ జిల్లాలోనే 2026 మార్చి పదవ తేదీన మరో రోడ్డు ప్రమాదంలో వెంకట్‌రెడ్డి అనే కానిస్టేబుల్ మరణించాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఇద్దరు కానిస్టేబుళ్ల కుటుంబీ కులకు డిజిపి తలా కోటి రూపాయల బీమా సొమ్మును చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో వుంటూ ప్రమాదాలకు లోనై మరణిం చిన కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## పదోతరగతి విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), ఆగస్టు 31, ప్రభాతవార్త:** చదువు సరిగా రావడంలేదని మనస్తాపానికి గురై పదోతరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబాష్ చంద్ర బోస్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ సుబాష్ చంద్రబోస్‌నగర్‌లో నివాసముంటున్న పేయింటింగ్ కార్మికుడు కుమారుడు మల్లికార్జున్(16) స్థానికంగా పదవ తరగతి చదువుతున్నాడు. కొద్దిరోజులుగా మల్లికార్జున్ చదువులో వెనకబడ్డానని, పరీక్షలు సరిగా రాయలేకపోతున్నాననే ఆందోళనతో మాన సిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆనాలోచిత నిర్ణయం తీసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబసభ్యులు వెం టనే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమి త్తం గాంధీఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## వైభవంగా తీజ్ వేడుకలు ఆరంభం

### వాగు నుంచి నల్లమట్టి సేకరించి

### గోధుమ నాట్లు వేసిన మథుర లభాన్ మహిళలు

**ఉట్నూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండలంలోని ఉమ్రి గ్రామంలో మథుర (లభాన్) సమాజానికి చెందిన మహిళలు పవిత్రమైన తీజ్ వేడుకలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. పండుగలో భాగంగా గ్రామానికి చెందిన వివాహితలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా స్థానిక వాగు వద్దకు తరలివెళ్లారు. సహజసిద్ధమైన పద్ధతిలో వాగు తీరంలో పూజలు నిర్వహించి నల్లమట్టిని సేకరించి గ్రామానికి తీసుకవచ్చారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వెదురు బుట్టల్లో ఆ మట్టిని నింపి, అందులో గోధుమ విత్తనాలను నాటారు. రాబోయే తొమ్మిది రోజుల పాటు ఈ గోధుమ మొలకలకు రోజూ నీరు పోస్తూ ఎంతో భక్తిశ్రద్ధలతో సంరక్షిస్తారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లా డుతూ... ప్రకృతిని పూజిస్తూ, తమ కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే తొమ్మిది రోజుల పాటు గ్రామంలో జానపద పాటలు, సాంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకుంటామని పేర్కొన్నారు.

## నేడు, రేపు ఢిల్లీలో జాతీయ జలశక్తి సదస్సు

### జాతీయ జలశక్తి సదస్సులో తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనా

### కేంద్రం-రాష్ట్రాల సమన్వయంతో సుస్థిర జల భద్రతకు ఉమ్మడి కార్యాచరణ

### జియోట్యాగింగ్‌తో నిధుల వినియోగంలో పారదర్శకత: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సులో తెలంగాణ తన.. సమగ్ర జలభద్రత నమూనా ను దేశం ముందుం చనుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న ఈ జాతీయ సదస్సు నేపథ్యంలో సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ సదస్సులో తెలంగాణ తరఫున సమర్పించనున్న ప్రజెంటేషన్‌లో పొందు పరచాల్సి న అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతో పాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.దేశ జలభద్రతకు సంబం ధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా వరకు వివిధ అంశాల్లోన్ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధిస్తూ, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు

### విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** కాంట్రాక్టర్ హరికృష్ణపై దాడికేసులో నిందితుడుగా వున్న మంత్రి కొండా సురేఖ ఓఎస్‌డి సుమంత్ దా ఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం వాదనలు జరిగాయి. ఈ కేసులో సుమంత్ తరపున న్యాయవాది వంశీధర్ రెడ్డి వాదనలు విని పించారు. సుమంత్‌పై నమోదైన కేసు రాజకీయ కుట్రలో భాగంగానే జరిగిందని, బాధితుడుగా వున్న హరికృష్ణపై ఇప్పటికే ఐదు కేసులు వునా న్నయని, ఇవన్నీ బలవంతపు వసూళ్లకు సంబంధించినవేనని ఆయన వాదించారు. సుమంత్‌పై హత్యాయత్నం సెక్షన్ వర్తించదని ఆయన వాదిం చారు. రాష్ట్రంలో మంత్రి కొండా సురేఖపై రాజకీయ దుమారం నడుస్తోందని, ఈ తరుణంలో ఆలస్యంగా సుమంత్‌పై హరికృష్ణ ఫిర్యాదు చేశా దని, ఇదంతా కావాలని జరిగిన కుట్రగా వుందని న్యాయవాది తెలిపారు. ఈ కేసును వెంటనే కొట్టివేయాలని, అలాకాకుంటే ముందస్తు బెయిల్ అయినా మంజూరు చేయాలని, పోలీసుల విచారణకు తన క్లయింట్ సహకరిస్తాడని ఆయన తెలిపారు. కాగా బాధితుడు హరికృష్ణ తరపున వా దించిన న్యాయవాది నాగేశ్వరరావు ప్రత్యర్థి వాదనలను ఖండించారు. సుమంత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు మొదట కేసు నమోదు చేయలేదని, దీంతో బాధితుడు మేడిపల్లిలో జీరో ఎఫ్‌ఐఆర్ చేయించాడని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్ అయ్యాడని న్యాయవాది నాగేశ్వరరావు హైకోర్టుకు తెలిపారు. హరికృష్ణపై సుమంత్ తన అనుచరులతో కలిసి ఇనుపరాడ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచా దని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే నిందితులపై హత్యాయత్నం సెక్షన్ నమోదయ్యిందని ఆయన తెలిపారు. కాగా ఈ కేసులో రాష్ట్ర ప్ర భుత్వం తరపున వాదనలు వినిపించేందుకు పిపి సమయం కోరారు. కాగా ఈ కేసులో సుమంత్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారా నికి వాయిదా వేసింది.

## చంచల్‌గూడ జైలులో ఖైదీ ఆత్మహత్య

**హైదరాబాద్ (సైదాబాద్), ఆగస్టు 31, ప్రభాతవార్త :** చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఖైదీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రోడ్డు ప్రమాదం కేసులో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న కందికంటి సాగర్(31)ను జూలై 25న కంటి వైద్య చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా జైలు నుండి చంచల్‌గూడ జైలుకు తరలించారు. సోమవారం జైలులోని టెలిఫోన్ బూత్ నుండి భార్యతో మా ట్లాడిన అనంతరం టాయిలెట్‌లోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. దీన్ని గమనించిన తోటి ఖైదీలు జైలు అధికారులకు తెలియజేయడంతో వారు వెంటనే సాగర్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి మార్గమధ్యంలో మృతి చెందాడు.

## రాజీనామాకు ససేమిరా అంటున్న మీర్జా రహమత్ బేగ్

## లైంగిక దాడి అభియోగాల కేసు.. మజ్లిస్ ఎమ్మెల్సీ అదృశ్యం

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడి చేసినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న మజ్లిస్ పార్టీ ఎంఎల్‌సి మీర్జా రహమత్ బేగ్ వ్యవహారం అటు ఎంఐఎం పార్టీ ఇటు పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. వారం రోజుల క్రితం మేగ్ అత్తాపూర్‌లో మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు, ఈ సందర్భంగా స్థాని కులు ఆయనను పట్టుకుని దేహ శుద్ధి చేసినట్లు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం తెలిసిందే. దీనిపై ఇప్పటి వరకు పోలీ సులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు. అయితే మజ్లిస్ పార్టీ దీనిపై తీవ్రంగా స్పందించడంతో పాటు బేగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. బేగ్‌ను వెంటనే ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయాలని ఆదేశిం చింది. ఈ సమయంలో బేగ్ ఉమ్రా యాత్రలో ఉండడంతో ఆయన తిరిగివచ్చాక రాజీనామా చేస్తారని మజ్లిస్ పార్టీ ఆశించింది. ఉమ్రా యాత్ర నుంచి బేగ్ తిరిగి వచ్చి మూడు రోజులు అవుతున్నా ఎంఎల్‌సి పదవికి ఇప్పటి వరకు రాజీనామా చేయక పోవడంతో మజ్లిస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ వి షయంలో ఆయన వివరణ కోరేందుకు పార్టీ నేతలు ప్రయత్నించగా బేగ్ అందు బాటు లోకి రానట్లు సమాచారం. మరోవైపు తన రాజీనామా విష యంలో బేగ్ కూడా పట్టుదలగా వున్నట్లు తెలిసింది.

తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని ఆయన కొట్టివేశారు. తాను మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు, ఈ సందర్భంగా కొందరు తనను కొట్టినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు డీప్‌ఫేక్‌తో కొందరు కుట్రచేసి తయారు చేసినవిగా బేగ్ తెలిపారు. దీనిపై పూర్తి నిజాలు వెలికి తీయాలని సైబర్ క్రైం పోలీసులకు తాను ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. కాగా బేగ్ విషయమై వ్యాఖ్యా నించేందుకు పోలీసులు నిరాకరించారు. బేగ్‌పై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఇదే సమయంలో ఆయన కూడా తమకు వ్యక్తి గతంగా ఎటువంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈ విషయంలో బాలల సంరక్షణ కేంద్రం రంగంలో దిగినట్లు వచ్చిన వార్తలు కూడా ఇంతవరకు రూఢీ కాలేదు. నిబంధనల మేరకు మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు సోషల్ మీ డియాలో వీడియోలు వైరల్ అయితే దీనిపై పోలీసులతో పాటు బాలల సంరక్షణ కేంద్రం వెంటనే స్పందించి, ఇది నిజమో? కాదో? అనేది నిర్ధారిం చాల్సి వుండగా ఇప్పటి వరకు రెండు విభాగాలు స్పందించక పోవడం గమనార్హం.

## ప్రేమ పేరుతో బాలిక కిడ్నాప్, లైంగికదాడి

### పోక్సో కేసులో నిందితుడికి 20 యేళ్ల కఠిన శిక్ష

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, తన ఇంట్లో బంధించి పలుమార్లు లైంగిక దాడికి పాల్ప డ్డ కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా, బాధితు రాలికి మరో లక్ష రూపాయల జరిమానా చెల్లించే విధింగా సోమవారం సంచలన తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా వున్నాయి. శివార్లలోని బాలాపూ ర్‌లోని ఎర్రకుంటలో గల సొహైల్ కాలనికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ అస్లాం (26) 2023 డి సెంబరు 16వ తేదీన ప్రేమ పేరిట కిడ్నాప్ చేశాడు. అనంతరం ఆ బాలికను తన ఇంట్లో బంధించి పలుమార్లు అత్యాచారం చేశాడు. దీనిపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహాడిషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించగా రెండు రోజుల తరువాత పట్టుబ డ్డాడు. అనంతరం బాలికకు వైద్య పరీక్షలు చేయించి, అత్యాచారం జరిగిందని నిర్ధారణ అయ్యాక నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రి మాండుకు తరలించారు. ఈ కేసులో నిందితుడిపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా ఇరు వర్గాల తరపున దాదాపు మూడేళ్ల పాటు వాదనలు జరిగాయి. దీనిపై పోక్సో కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెబుతూ నిందితుడు సయ్యద్ అస్లాంను దోషిగా తేల్చారు. ఇందుకుగానూ అ తనికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధించారు. దీంతో పాటు బాధితురాలికి లక్ష రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారులుగా అప్పటి మహేశ్వరం ఎసిపి శ్రీనివాస్ (ప్రస్తుతం నాగర్ కర్నూల్ డిఎస్‌పిగా వున్నారు), పహాడిషరీఫ్ ఎసిపి లక్ష్మీకాంత్ రెడ్డి (ప్రస్తుతం ఎసిబి డిఎస్‌పిగా వున్నారు) కీలకంగా వ్యవహరి ంచారు. వీరితో పాటు అదనపు పిపిలుగా కృష్ణ ప్రసన్న, సత్యనారాయణలు వ్యవహరించారు.



పోక్సో కేసులో నిందితుడు సయ్యద్ అస్లాం

## అమెరికాలో ఇద్దరు కేరళ మహిళలు హత్య

**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికా కాలిఫోర్నియాలో కేరళకు చెందిన ఇద్దరు మహిళలను వారి స్నేహితురాలే అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. బాధితులను అంజనా హరి(35), ఆన్ మేరీ(40)గా గుర్తించగా, నిందితురాలు అనిల(32)ను పోలీసులు అరెస్టు చేశారు. ఒకరోజు ముందే వీరంతా కలిసి ఓనం పండుగ జరుపుకున్నారు. మరుసటి రోజు ఆన్‌ను అపార్ట్‌మెంట్‌లో కత్తితో పొడిచి చంపిన నిందితురాలు, ఆ తర్వాత అంజనను కారుతో ఢీకొట్టి హతమార్చింది. అక్కడి పోలీసులు సంఘటానా స్థలానికి చేరుకుని మృత దేహాలను పరిశీలించి హత్యగానిర్ధారించారు. ఓ మహిళను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ హత్యలు ఆగస్టు 28న కాలిఫోర్నియాలోని మిల్పిటాస్ నగరంలో జరిగాయి. తిరువనంత పురంలోని కేశవదాసపురానికి చెందిన 40యేళ్ల యాన్ మేరీ మాథ్యూ కత్తిపోట్లతో, త్రిసూర్‌లోని ముడిక్కోడ్‌కు చెందిన 35యేళ్ల అంజన హరి కారు ఢీకొట్టడంతో మరణించారు. మిల్పిటాస్ పోలీసుల ప్రకారం మిల్‌క్రీక్ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని డిక్సన్ ల్యాండింగ్ రోడ్డు వద్ద జరిగిన హిట్ అండ్ రన్ ఘటనపై ముందుగా సమాచారం అందింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి ఒక బ్లూ ఎస్‌యూవీ కారు అక్కడి నుంచి వెళ్లిపోయిందని చూసినవారు పోలీసులకు తెలిపారు. అలాంటి కారే సమీపంలోని పార్కింగ్ ప్రాంతంలో ఉండగా, ఆ కారు నడిపిన మిల్పిటాస్‌కు చెందిన 32యేళ్ల మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె కొట్టాయంలోని మూన్నిలావుకు చెందిన అనిల అని, ఆమె మరణించిన ఇద్దరు మహిళలకు స్నేహితురాలు అని బంధువులు తెలిపారు. హత్యలకు గల కారణాలు ఇంకా తెలియలేదని పోలీసులు తెలిపారు.



## పంజాబ్ పిసిసి చీఫ్‌ను అరెస్టు చేయండి

### షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ ఆదేశాలు

**చండీగఢ్, ఆగస్టు 31:** పంజాబ్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ అమరిందర్ రాజా వారింగ్‌ను అయిదు రోజుల్లోగా అరెస్టు చేయాలని షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. మాజీ కేంద్ర హోంశాఖ మంత్రి బూటా సింగ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో ఆ ఆదేశాలు ఇచ్చింది. తర్న్ తారన్‌లో జరిగిన ఎన్నికల సభలో రాజా వారింగ్ ఆ వ్యాఖ్యలు చేశారు. కిషోర్ మక్వానా నేతృత్వంలోని ఎస్సీ కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మే 5వ తేదీన ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడం పట్ల ఆ కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. యాక్షన్ టేకన్ రిపోర్టును ఇంకా సమర్పించలేదని కమిషన్ పేర్కొన్నది. డిఎస్పీలు హర్‌ప్రీత్ సింగ్, గుల్జార్ సింగ్‌తో పాటు దివంగత బూటా సింగ్ కుమారుడు సరబ్‌జోత్ సింగ్ కూడా పాల్గొన్నారు. చట్టం ప్రకారం సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ కోరింది. అయిదు రోజుల్లోగా ఆ చర్యలకు సంబంధించిన వివరణ ఇవ్వాలని కమిషన్ పేర్కొన్నది. దర్యాప్తును పూర్తి చేసి, ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని నేషనల్ ఎస్సీ కమిషన్ తెలిపింది. ఒకవేళ దర్యాప్తులో మళ్లీ ఎటువంటి జాప్యం జరిగినా, వారిపై 1989 నాటి ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సీ కమిషన్ హెచ్చరించింది.

## మత్స్యకారుల ఉపాధికి రవాణా శాఖ గండి

### రోడ్‌సేఫ్టీ సెస్ పేరుతో అడ్డంకి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అసలే అంతంత మాత్రంగా ఉన్న మత్స్యకారుల ఉపాధిపై రవాణా శాఖ గండికొడుతోంది. ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ పథకాల్లో భాగంగా వాహనాలు మంజూరు అయినా రవాణా శాఖ అధికారులు మెలికతో నెలలల తరబడి అవి షోరూంలకే పరిమితమయ్యాయి. తమ సొంత వాటా సొమ్మును సకాలంలో చెల్లించినప్పటికీ, వాహనాల పంపిణీ మాత్రం ముందుకుసాగడం లేదు. రవాణా శాఖ తాజాగా తెచ్చిన రోడ్డు సేఫ్టీ సెస్ట్ పేరుతో పెట్టిన నిబంధనతో వేలాది వాహనాలు షోరూంలకు, శాఖాపరమైన కార్యాలయాల వద్దే నిలిచిపోయాయి. రాష్ట్రంలో మత్స్యకారుల ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి చేపలు విక్రయించేందుకు, రవాణాసౌకర్యం కల్పించాలని నప్రభుత్వం సబ్సిడీపై వాహనాలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా టూ వీలర్, త్రీవీలర్స్(ఐస్ బాక్స్), ఫోర్ వీలర్స్ (మొబైల్ అవుట్ లెట్స్) అందజేస్తుంది. వీటి నిమిత్తం మహిళలకు 60శాతం, పురుషులకు 40శాతం సబ్సిడీపై కల్పిస్తోంది. ఫోర్ వీలర్ కు 10లక్షలు, త్రీవీలర్ 3లక్షలు, టూ వీలర్ కు 75వేలు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ వాహనాల సరఫరాలో షోరూం ప్రైస్, ఐస్ బాక్స్, లైఫ్ టాక్స్ రిజిస్ట్రేషన్ హైపోతిటికేషన్ ఛార్జెస్, హెచ్‌ఎస్‌ఆర్ ప్లేట్ అన్ని కలిపి ప్రభుత్వమే భరిస్తుందని మత్స్య శాఖ అధికారులు ప్రకటించినట్లు లబ్దిదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపికైన లబ్ధిదారులు ఇప్పటికే తమకు కేటాయించిన వాటాను అందినకాడల్లా అప్పులు చేసి చెల్లించారు. అయితే, వాహనాల రిజిస్ట్రేషన్ సమయానికి వచ్చేసరికి అధికారులు కొత్త నిబంధనలను తెరపైకి తెచ్చారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం రోడ్డు సేఫ్టీ సెస్ చెల్లిస్తేనే వాహనాలను విడుదల చేస్తామని అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఈఏడాది మార్చి 1 నుంచి ద్విచక్ర వాహనాలులకు ప్రతి వాహనానికి రూ.2 వేలు సెస్, మూడు చక్రాల వాహనాలు (3వీలర్), నాలుగు చక్రాల వాహనాలు (4వీలర్) ప్రతి వాహనానికి ఏకంగా రూ.10,000 సెస్ చెల్లించాల్సిందేనని అధికా రులు స్పష్టం చేసినట్లు లబ్దిదా రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని లబ్దిదారులైన మత్స్య కారులు కోరుతున్నారు.

## పహాడిషరీఫ్‌లో నర్సు హత్యాచార ఘటనలో నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** నగర శివార్లలోని పహాడిషరీఫ్ పరిధిలో ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న 21 యేళ్ల యువతి పై లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన ఘటనలో 30 గంటల వ్యవధిలోనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివ రాలను శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 29వ తేదీన అర్ధరాత్రి సమయంలో తుక్కుగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి, హత్య చేయడం తెలిసిందే. ఆదివారం ఉదయం ఈ ఘటన వెలుగు చూసింది. హతురాలి పినతల్లి దీనిపై పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై వెంటనే రంగంలో దిగిన పోలీసులు ఘటనా స్థలంలో లభించిన ఆధారాలను సేకరించి, సిసిటివి ఫుటేజిలను గమనించి నిందితుడి కోసం గాలించారు. అనంతరం ఈ ఘాతుకానికి పాల్పడింది అదే ప్రాంతానికి చెందిన బైక్ మెకానిక్ సనావుల్లా (34)గా తేలింది. బిహార్‌కు చెందిన ఇతను కొన్నేళ్ల క్రితం హైదరా బాద్‌కు వచ్చి పలుచోట్ల బైక్ మెకానిక్‌గా పనిచేసి ప్రస్తుతం తుక్కుగూడ వద్ద బైక్ మెకానిక్‌గా వున్నాడు. సలావుల్లా పనిచేసే ప్రాంతంలోనే బాధి తురాలు పనిచేసే ఆసుపత్రి వుంది.

ఆసుపత్రిలోని క్వార్టర్స్‌లో ఆమె వుంటోంది. ఆమె కదలికలను గమనించిన సనావుల్లా పక్కా పథకం ప్రకారం ఆమె వుంటున్న గది కిటికీ బలహీనంగా వుండడంతో ఇందులోని కొంత భాగాన్ని అర్ధరాత్రి వేళ తొలగించి లోపలికి ప్రవేశించాడు. దీంతో బాధిత యువతి కేకలు వేయగా సనావుల్లా ఆమెపై దాడిచేశాడు. ఈ క్రమంలో ఆమె సనావుల్లా చిటికెన వేలును కొరకడంతో పాటు మెడపై గోళ్లతో గీరింది. దీంతో సనావుల్లా బాధిత యువతిపై దాడిచేసి తీవ్రంగా కొట్టడడంతో ఆమె స్పృహ కోల్పోయింది. అనంతరం ఆమెపై లైంగిక దా డికి పాల్పడ్డ సనావుల్లా, అనంతరం తనను ఎవరూ గుర్తించకుండా వుండేందుకు హత్యచేసి కిటికి గుండా దూకి పారిపోయాడు. సాంకేతిక ఆ ధారాలతో నిందితుడిని ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. నిందితుడి వద్ద ఒక మొబైల్ ఫోన్‌ను జప్తు చేశారు. కాగా సనావుల్లా ఫోన్‌లో అశ్లీల వీ డియోలు చూసేవాడని తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో నిందితుడిని వేగంగా పట్టుకున్న పహాడిషరీ ఫ్ పోలీసులను డిసిపి రాజేష్ అభినందించారు. ఈ సమావేశంలో ఎసిపి శ్రీకాంత్ గౌడ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మార్పు దిశగా రాజకీయం

### అందులో మునుగోడు ఎమ్మెల్యేగా నేనుంటా: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు32,ప్రభాతవార్త:** తెలంగాణలో మార్పు దిశగా రాజకీయాలు వెళ్ళుతున్నాయని మునుగోడు ఎమ్మెల్యేగా అందులో నేను కీలకంగా ఉంటానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భవిష్యత్ చిత్రపటంపై ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు. వైఎస్‌ఆర్‌సిపి పార్టీ ఎస్‌ఆర్‌ఐ టీమ్ ఏర్పాటు చేసిన ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హాజరై రాజకీయాల్లో మార్పులు తీసుకువచ్చి పేదవారికి సేవ చేయాలని భావిస్తున్నానన్నట్లు తన మనోగతం ఆవిష్కరించారు.అవసరం అయితే నిజాయితీపరులైన వారిని అసెంబ్లీలో అడుగుపెట్టేలా చేస్తానన్నారు. ఈ మార్పులో నా పాత్ర కీలకంగా ఉండబోతోందని డబ్బుల కోసం రాజకీయం చెయ్యడానికి వచ్చిన వాళ్లు శాశ్వతంగా ఉండలేరని డబ్బులే కావాల నుకునే వారు వ్యాపారం చేసుకోవాలన్నారు. వ్యవస్థ మొత్తం అవినీతి మయం అయ్యాయిందని అధికారులు, రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడుతుంటే పేదలకు న్యాయం ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. అవినీతి గ్రామీణ ప్రాంతం వరకు పాకిందని ఆవేదన చెందారు.ప్రభుత్వం ఒక చేత్తో రైతు బంధు లాంటి పథకాల ద్వారా డబ్బులు ఇస్తూ, మరో చేత్తో బెల్ట్ షాపుల ద్వారా ఆ సొమ్మును గుంజుకోవడం సరికాదని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేయించగలిగానని, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను ప్రభుత్వం ఇప్పటికైనా నిలిపివేయాలని సూచించారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని రాజకీయ నాయకుల ఆలోచన విధానం, వ్యవస్థ మారాలని కోరుకొంటున్నాని తెలిపారు. మార్పు దిశగా అడుగులు వేస్తున్నానని అందుకే గత కొన్ని నెలలుగా నేను ప్రతి విషయాన్ని మాట్లాడుతున్నాననీ పదవుల కంటే రాజకీయ నాయకుల ఆలోచనా విధానం, వ్యవస్థలో మార్పు రావడమే ముఖ్యమని అభిప్రాయ పడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే తనకు చాలా అభిమానం అని ఆయన ఎప్పటికీ నా గుండెల్లో ఉంటార న్నారు. పేద ప్రజల కోసం ఆయన తీసుకువచ్చిన కార్యక్ర మాలు ఎప్పటికీ మర్చిపోలేం. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి కార్యక్రమాలు చేశారు. వైఎస్సార్ ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక కుటుంబ సభ్యుడిగా నిలిచారు.కాంగ్రెస్ పార్టీలో ఆయన లాంటి మరొక లీడర్ లేనే లేడన్నారు. తెలంగాణ ఏర్పడినా ఆయన అంటే మాకు ఎనలేని అభిమానం ఉందని తెలంగాణ ఉద్యమం పీక్స్ లో ఉన్న సమ యంలో మా గ్రామంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పా టు చేశామమని తెలిపారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే రాజశేఖర్ రెడ్డి టీమ్ అని అంటారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ ఈ స్థాయిలో ఉన్నారంటే అది వైఎస్సార్ ఆశీర్వాదమేనన్నారు. రాజశేఖర్ రెడ్డి ఇన్స్పిరేషన్ తోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను.ఫీజు రీయింబర్స్ మెంట్ దుర్వినియోగం అవుతోందని కోమటిరెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసమే ఇంజనీరింగ్ కాలేజీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకు వచ్చాయని సరైన మౌళిక వసతులు లేకుండానే ఇంజినీరింగ్ కాలేజీలు వచ్చాయన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సమయానికి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారు. ప్రభుత్వమేమో అప్పుల్లో ఉంది. ఫీజి రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. సరైన రీతిలో మానిటరింగ్ ఉంటే ఇది చాలా మంచి పథకం అన్నారు. ఫీజు రీయింబర్స్ ఖర్చు అని అనుకోవద్దు. ఇది మన యువతపై పెడుతున్న ఇన్వెస్ట్‌మెంట్ అనుకోవాలి.

## అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి: మంత్రి పొంగులేటి

**మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రాష్ట్ర వెన్యూ, హౌసింగ్ అంశాలపై ఉమ్మడి వరంగల్‌జిల్లా సమావేశాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపిలు కడియం కావ్య,పోరిక బలరాం నాయక్,ఉమ్మడి జిల్లాలకు సంబందించిన శాసనసభ్యులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచి పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అక్రమాలకు పాల్పడి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరించారు. 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యలు తదితర అంశాలపై అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని మంత్రి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదన్నారు.


వార్త

గొప్ప గొప్ప వివాదాలను పరిష్కరించగలిగేది సమర్థులు లేదా వ్యతిరేకులు మాత్రమే, తటస్తులు కాదు.

- సిసిరో

# రహదారుల రక్తదాహం!

మానవుడి సుఖానికి, సంతోషానికి, అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసమే అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్ల అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. మరి ఆ సోపానాలే మృత్యుమార్గాలైతే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి?దేశంలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీలేని అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలు పోతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారంగా మారి జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు యేటా వేలాది మంది అసువులు బాస్తున్నారు. మొన్న పల్నాడుజిల్లా చిలకలూరు పేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే చనిపోగా మరో పది మందికి తీవ్ర గాయలయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు ముగించుకొని స్వగ్రామానికి వస్తున్న వారి వాహనాన్ని ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. వీరంతా కొండుమంజూరు గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన పలువురిని ఆస్పత్రిలో చేర్పించగా అందులో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరో ప్రమాదంలో ఆరుగురు అక్కడి కక్కడే మరణించగా మరో పధ్నాలుగు మంది వరకు గాయపడ్డారు. ఇనుప స్తంభాల భారీ లోడుతో వెళ్తున్న వాహనం అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కి నిలిచిపోయింది. అక్కడ వాహనం నిలిచి ఉండటాన్ని గమనించని హైదరాబాద్ నుంచి ఏలూరుకు బయలుదేరిన ప్రైవేట్ బస్సు ఈ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే ఆరుగురు చనిపోయారు. ట్రక్కులోని ఇనుప స్తంభాలు బస్సు అద్దాలను చీల్చుకుంటూ ప్రయాణికుల వైపు దూసుకువెళ్లాయి. స్తంభాలు తగిలి ముఖాలు గుర్తు పట్టలేనంతగా ఛిద్రమైపోయాయి. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారిది ఒక్కొక్కరిది ఒక్కొక్క దీనగాథ. తమ్ముడికి రాఖీ కట్టేందుకు వెళ్తూ ఇరవై నాలుగేళ్ల యువతి ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ఇక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని చూసి తిరిగివెళ్తూ మరో యువకుడు మరణించాడు. ఇక తన బాబాయ్ కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు వెళ్తూ మరొక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృత్యుపాలయ్యాడు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రమాదాలు యేడాది యేడాదికి పెరిగిపోతున్నట్లు అధికార రికార్డులే చెబుతున్నాయి. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నామని ప్రభుత్వాలు చెప్తున్నా, నిబంధనలను పటిష్టం చేస్తున్నా ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రమాదాల్లో మరణించిన వారి సన్నిహితులు, బంధువులు గుండెలుబాదుకొని ఏడ్చేవారిని చూసి కన్నీరు సైతం ఘనీభవించేస్థితికి చేరుకున్నదేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా 2001నుండి 2020 వరకు తొంభైఆరు లక్షల అరవై రెండు ప్రమాదాలు చోటుచేసుకుంటే, ఇరవై మూడులక్షల ఇరవైఐదు వేల మంది మృత్యువాతపడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్య కోట్లల్లో ఉండవచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత ఐదేళ్లలో ముప్పైవేలకు పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు విడిచిన వారెందరో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నారు. పోలీసుల రికార్డుల్లోకి రాని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. చనిపోయిన వారిలో అధికశాతం పద్దెనిమిదేళ్ల నుంచిముప్పైయేళ్ల వయస్సున్నవారే. సంపాదన చేస్తున్న భర్తో,కుమారుడో చేతికి అందివస్తున్న కుటుంబ సభ్యులను కోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఒకటి, రెండు కుటుంబాలుకాదు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఈప్రమాదాల గురించిపాలకులకు తెలియంది కాదు. ప్రభుత్వ విధానాలలో ప్రజాసంక్షేమం లేదనిపిస్తున్నది. ఎవరు ఎలాపోయినా, ఎంతమంది ప్రాణాలు అర్థాంతరంగా గాలిలో కలిసిపోయినా, ఎన్ని లక్షల కుటుంబాలు వీధినపడినా ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న విమర్శలను కొట్టివేయలేం. ఎన్నిసార్లు నిబంధనలను ఉల్లంఘించినా, చట్టానికి విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలతో కాసులు దండుకుంటున్నా,జరిమానా రూపంలో డబ్బు చెల్లిస్తే చాలనే దీమాతో వాహన చోదకులు బరితెగిస్తున్నారు. ఈ ప్రమాదాలతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవాలుగా బ్రతుకీడుస్తున్నవారు దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు రోడ్డు ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. ఆదాయమే లక్ష్యంగా కాకుండా మానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారులైన వాహన చోదకుల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లో లాగా శాశ్వతంగా రద్దు చేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే విధంగా చట్టాన్ని రూపొందించాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా వాహనాలు మృత్యుదేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది ప్రాణాలు అర్థాంతరంగా ముగియక తప్పదు.



యువతను మోసగించడం తేలిక, ఎందుకంటే వారు తొందరగా ఆశలు పెంచుకొని, భ్రమల్లో పడిపోతారు.

అరిస్టాటిల్



దేశం కోసం తమ జీవితాలను అర్పించగల, సర్వత్యాగాలు చేయగల, సర్వసన్నద్ధులైన యువకులు నేడు కావాలి.

స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### చక్కర ధరలను నియంత్రించాలి

ప్రస్తుతం దేశంలో చక్కెర ధరలు చుక్కలను చూపిస్తున్నాయి.నెలరోజుల్లోనే దాదాపు 30శాతం ఎగిసిన రిటైల్ రేటు ప్రస్తుతం సగటున కేజీ 63 రూపాయల స్థాయికి చేరింది. చెక్కరను ఇథనాల్ తయారీకి మళ్లించడం వల్లే ప్రస్తుత కొరత ఏర్పడిందన్న విమర్శలు కూడా ఒక ప్రక్క నుండి వస్తున్నాయి. చెక్కర ఉత్పత్తిలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న భారత్ దాదాపు పదేళ్ళ తర్వాత దిగుమతుల బాట పట్టింది. వచ్చే రెండు నెలల్లో వరుస పండుగలు వివాహాల సీజన్‌దగ్గర పడుతుండటంతో చెక్కరకు డిమాండ్ పెరగవచ్చును.అలాగేఇళ్లల్లో వినియోగంతో పాటు స్వీట్లు, బేకరీలు, పానీయాలు ఇతర ఆహార ఉత్పత్తుల తయారీలోనూ చెక్కరఅవసరం పెరుగుతోంది. కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే చెక్కర ధరల నియంత్రణకు చర్యలు తీసుకొని సామాన్య ప్రజలకు పాత ధరకే చెక్కర లభించేలా చర్యలు చేపట్టాలి.

- దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

### బొగ్గు లారీల వేగానికి కళ్లెం వేయరా?

భూపాల్‌పల్లి, మల్హర్‌రావు మండలం తాడి చర్ల బొగ్గు గనుల నుండి ఉప్పల్, జమ్మికుంట రైల్వే స్టేషన్‌లకు వెళ్ళే బొగ్గు లారీలు కాటారం భూపాల్ పల్లి పరకాల ద్వారా రైల్‌నిలయం అయిన ఉప్పల్ వరంగల్‌కి వెళ్తాయి.అలాగే మణుగూరు,భద్రాద్రిపవర్ ప్లాంట్ ప్రధాన రహదారిపై బొగ్గులారీలు వస్తున్నాయంటే ప్రజలుహడలిపోతున్నారు.ఈ రెండుమార్గాలలో లారీల దూకుడు రోజురోజుకు పెరిగిపోతుండటంతో ఎప్పుడుఏప్రమాదం పొంచి ఉందో అనే ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మణుగూరులో అంతర్గతంగా బొగ్గును సరఫరా చేసే లారీల దూకుడుకుతోడు మణుగూరు ఓసీ, ఓసీ2 నుంచి బొగ్గునుతరలించే టిప్పర్లఅతివేగం మితిమీరిన వాహన దారులకు ప్రాణ సంకటంగా మారుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### అందమైన బంధం

ఒకప్పుడు ఉత్తరాల కోసం వెయ్యికళ్లతో ఎదురుచూసే వారు కోకొల్లలు. దూర తీరాలను చేర్చేదారాలు ఈ ఉత్తరాలు అంటే అతిశయోక్తికాదు. పోస్ట్ అన్నకేకతో, పరుగునవచ్చి లెటర్ అందుకొని చదివితేగాని మనస్సు కుదుటపడదు. తీపి, చేదు,వార్తలు కలగూరగంపలా ఉంటాయి. మాటలకన్నా చదవడంలోనే ఎంతో హాయి ఉంటుంది.

-ఆర్ వెంకటేష్ చరన్, బెంగళూరు

### తీరప్రాంతంలో తాటిచెట్లు

ఆంధ్రరాష్ట్రంలో ఎక్కువగా సుదీర్ఘ సముద్రతీర ప్రాంతముంది. ప్రకృతి విపత్తులు తుఫానులు ఎక్కువ సంభవించినపుడు ఉప్పునీరుతో, హోరుగాలులు వీచడం వలన తీరప్రాంతం ఎక్కువగా కోతకు గురై చుట్టుపక్కల భవనాలకు, వ్యవసాయ భూములకు,మత్స్యకార నివాసాలకు తీవ్ర ధన, ప్రాణ నష్టాలను కలుగుజేస్తుంది. ఈవిపత్తుల నివారణకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి తీరప్రాంతంవెంట తాటివనాలను నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. దీనికి భూలోక కల్ప వృక్షమని పేరుంది.ఇతర చెట్లేమైనా పెంచితే ఆ పరిసరాల్లో సాగు కష్టం. కానీ తాటిచెట్లు ఎత్తుగా ఉండడం వల్ల ఏ పంటకూ నష్టం వాటిల్లదు. ఏ మొక్కను పెంచాలన్నా రోజూ నీళ్లపోయాలి. కానీ వీటికి నీళ్లఅవసరమే లేదు. ఏ జంతువూ తినదు. అగ్ని ప్రమాదాల సమస్య లేదు. చెట్టును కొట్టేసినా ప్రతిభాగం ఉపయుక్తమే.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### అప్పుడే పార్లమెంటు భవనం కురుస్తుంది?

బ్రిటీష్ కాలం నాటి కట్టడాలు ఈనాటికి చెక్కుచెదరకుండా ఉన్నాయి.మరి మనవాళ్ల కట్టినకట్టడాలు ఆరునెలలకే బీటలు వారుతున్నాయి. వెయ్యి కోట్లరూపాయలతో అత్యంత ఆధునికంగానిర్మించిన మన నూతనపార్లమెంటు భవనం ప్రారంభం జరిగి సంవత్సరం అవుతుంది. బేతాళ మాంత్రికులచే ప్రారంభంచేయించారు.ఇప్పుడు వర్షానికి పైనుండి నీరు కారుతుంటే కింద బకెట్లు పెట్టి నీళ్ల పట్టుకుంటున్నారు.మోడీగారూ 150 కోట్ల దేశప్రజలకు అవమానంగా ఉంది. కోట్లాది రూపాయలతో నిర్మించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ కూడా అప్పుడే ప్లాట్ ఫారంమీద నీళ్లు కురుస్తున్నాయి.అంతేకాదు వేలకోట్ల రూపాయలతో రైల్వే స్టేషన్లు అన్ని పునర్నిర్మాణం చేస్తున్నారు. అవి కూడా అంతేనా అనే అనుమానంగా ఉంది. టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందింది. మరి అత్యంత ముఖ్యమైన పార్లమెంటు భవననిర్మాణంలో ఆటెక్నాలజీ, ఆనాణ్యత ఏమైనది?

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రకృతిని ఆరాధించాలి

మానవ జీవితంలో ఆయురారోగ్యాలతో కూడిన జీవితం గడపాలంటే స్వచ్ఛమైనగాలి,చాలా మెరుగైన పాత్ర పోషిస్తుంది. నిరంతరం మొక్కలు నాటుతూ ప్రకృతిని కాపాడుకోవాలి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందింపజేయాలి. మొక్కలను పెంచితే అవి అందరి జీవితాలను పెంపొందింపజేస్తాయి. విరివిగా మొక్కలు నాటుదాం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# హిమాలయాల హెచ్చరికలు వినాలి..

హిమాలయాలను మనిషి స్థిరపరచలేడు. పర్వతం కూలడాన్ని ఆపలేడు. కానీ ఆ పర్వతం కింద ఏం నిర్మించాలి, ఎంతమేరకు విస్తరించాలి, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలి, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఎలా రక్షించాలి అన్నది మానవ ప్రణాళికపైనే ఆధారపడి ఉంది. ప్రకృతిని అర్థం చేసుకోకుండా సాగే అభివృద్ధి దీర్ఘకాలంలో నిలవదు. అదే సమయంలో అభివృద్ధిని పూర్తిగా ఆపేయడం కూడా పరిష్కారం కాదు. హిమాలయాల్లో ఇకపై ప్రతి పెద్ద ప్రాజెక్టు ముందు ఎక్కడ నిర్మించగలం?" అనే ప్రశ్నతో పాటు ఎక్కడ నిర్మించకూడదు? అనే ప్రశ్న కూడా ఉండాలి. ప్రకృతి ప్రమాదాన్ని పూర్తిగా నివారించడం మనిషి చేతిలో లేకపోవచ్చు. కానీ అది మానవ విషాదంగా మారే అవకాశాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న పర్వతం ఎప్పుడు కదులుతుందన్నది మాత్రమే కాదు. అది కదిలినప్పుడు మనం ఎంత సంసిద్ధంగా ఉన్నామన్నదే.

డి జె మోహన రావు

హిమాలయాల్లో కొండచరియలు విరిగిపడటం,మంచు కదలడం, నదులు ఉప్పొంగడం కొత్త కాదు. భౌగోళికంగా అత్యంత చురుకైన ఈ పర్వత ప్రాంతంలో ప్రకృతి తన సహజ స్వభావాన్ని ఎప్పటికప్పుడు చూపిస్తూనే ఉంటుంది. అయితే మారుతున్నది మరొకటి. గతంలో తక్కువగా మానవ వినియోగంలో ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో ఇప్పుడు రహదారులు, వంతెనలు, నివాసాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక సదుపాయాలు వేగంగా పెరుగుతున్నాయి. అంటే ప్రమాదం కొత్తది కాకపోయినా, దానికి గురయ్యే మనుషులు, ఆస్తుల విస్తృతి పెరుగుతోంది.ఆగస్టు 26న నేపాల్‌లోని రాసువా ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరద ఈ మారుతున్న ప్రమాద స్వభావానికి తాజా హెచ్చరిక. ప్రాథమిక శాస్త్రీయ విశ్లేషణల ప్రకారం లాంగ్ టాంగ్ లిరుంగ్ ప్రాంతంలో హిమనదితో సంబంధం ఉన్న భారీ మంచు-రాళ్ల కూల్చివేత చోటుచేసుకుంది. దాని ప్రభావంతో మంచు, రాళ్లు, మట్టి, నీరు భారీగా భోటేకోశీ-త్రిశూలీ నదీ మార్గంలోకి దూసుకొచ్చి ఆకస్మిక ప్రవాహాన్ని సృష్టించాయి. ఈ ఆకస్మిక ప్రవాహానికి రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇది సాధారణ వర్షాకాల వరద కాదు. ప్రమాదం నదిలో మొదలుకాలేదు. పర్వతంలో మొదలై నదిలోకి వచ్చింది. ఈ తేడానే విపత్తు నిర్వహణ విధానాన్ని సమూలంగా మార్చాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. ఈతరహా విపత్తులు భారత హిమాలయ ప్రాంతానికీ కొత్తేమీ కాదు. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో హిమ-శిథిల ప్రవాహం కారణంగా రిషిగంగ, తపోవన్ ప్రాంతాల్లో భారీ వరద సంభవించి జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని దక్షిణ లొనాక్ మంచు సరస్సు ఆకస్మికంగా పొంగిపొర్లడంతో తీస్తా నదిలో భారీ వరద వచ్చి మౌలిక వసతులకు తీవ్ర నష్టం కలిగింది. జోషిమఠ్‌లో చోటుచేసుకున్న నేల కుంగుబాటు వంటి ఘటనలు పర్వత ప్రాంతాల భౌగోళిక సున్నితత్వాన్ని మరోసారి గుర్తుచేశాయి. ఇవన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పర్వతాల ఎగువ ప్రాంతాల్లో జరిగే మార్పుల ప్రభావం దిగువన నివసించే ప్రజలు, మౌలిక వసతులపై తీవ్రంగా పడవచ్చు. సాధారణంగా వరదలను అంచనా వేయడానికి వర్షపాతం, నదీ నీటిమట్టం వంటి సూచికలను ఉపయోగిస్తాం. భారీ వర్షాలు కురిసి నదులు క్రమంగా ఉప్పొంగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కొంత సమయం దొరుకుతుంది. కానీ పర్వతం నుంచే ప్రమాదం మొదలైనప్పుడు లెక్కలు తారుమారవుతాయి. ఎత్తైన ప్రదేశంలో మంచు, శిథిలాలు ఒక్కసారిగా కదిలి నదిలోకి చేరితే ప్రవాహం క్షణాల్లో మారిపోతుంది. నదిలో ప్రమాదకరమైన మార్పు కనిపించే సమయానికి దిగువ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రతిస్పందించేందుకు లభించే సమయం అత్యంత పరిమితంగా ఉండవచ్చు. రాసువా ఘటనపై మొదట భూకంపం కారణమై ఉండవచ్చనే అనుమానాలు వచ్చాయి. అమెరికా భూగర్భ సర్వేసంస్థ చేసిన విశ్లేషణ ప్రకారంనమోదైన ప్రకంపనలు భారీ కూల్చివేతతోనే సంబంధం కలిగి ఉండవచ్చని సూచనలు లభించాయి. అయితే ఆ కూల్చివేతకు ఏదైనా భూకంపం ప్రేరణగా పనిచేసిందా అన్నది వేరే ప్రశ్న. ఇలాంటి సంక్లిష్ట ప్రకృతి ఘటనలకు ఒకే కారణాన్ని తొందరపడి ఆపాదించడం సరికాదు. హిమాలయాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, హిమనదులు వెనక్కి తగ్గడం, కొన్ని ప్రాంతాల్లో శాశ్వతంగా గడ్డకట్టిన నేల కరగడం



వంటి మార్పులు పర్వత వాలుల స్థిరత్వాన్ని ప్రభావితం చేసే అవకాశాన్ని పెంచుతున్నాయి. అయితే రాసువా ఘటనకు వాతావరణ మార్పే ప్రత్యక్ష కారణమని నిర్ధారించడానికి ప్రస్తుతం తగిన ఆధారాలు లేవు.వాతావరణ మార్పు, భౌగోళిక నిర్మాణం, స్థానిక పరిస్థితులు ఇవన్నీ కలిసి ప్రమాద స్వభావాన్ని ప్రభావితం చేయవచ్చు. అందువల్ల గత అనుభవాల ఆధారంగా మాత్రమే భవిష్యత్తు ప్రమాదాలను లెక్కగట్టడం ఇక సురక్షితం కాదు. పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రహదారులు, విద్యుత్తు, ఆరోగ్యం, ఉపాధి అవసరం. పర్యాటకం, జలవిద్యుత్ ఈప్రాంతాల ఆర్థిక వ్యవస్థలకు కీలకం. కాబట్టి హిమాలయాల్లో నిర్మాణాలను పూర్తిగా ఆపేయాలని చెప్పడం ఆచరణ సాధ్యం కాదు. అసలు సమస్య నిర్మాణాల్లో లేదు, ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్మించడంలో ఉంది. అభివృద్ధి ఎక్కడ చేయాలన్నదే కాదు, ఎక్కడ చేయకూడదన్నది కూడా ప్రణాళికలో భాగం కావాలి. ఒక రహదారి లేదా జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రతిపాదించేటప్పుడు కేవలం నిర్మాణ స్థలాన్ని మాత్రమే కాకుండా, దాని ఎగువన ఉన్న మొత్తం పర్వత ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. హిమనదుల్లో మార్పులు,మంచు సరస్సుల విస్తరణ, కొండచరియల ముప్పు, ఆకస్మిక శిథిల ప్రవాహాల అవకాశాలను ముందే అధ్యయనం చేయాలి. ఒకే లోయలో అనేక ప్రాజెక్టులు ఉన్నప్పుడు వాటిసంయుక్తపర్యావరణ ప్రభావం ఎంత అన్నది కూడా విశ్లేషించాలి. ఒక్కో ప్రాజెక్టు విడిగా సురక్షితంగా కనిపించినా, మొత్తం లోయపై వాటి కలిపిన ప్రభావం భిన్నంగా ఉండవచ్చు. పర్యావరణ ప్రభావ అంచనా అనేది ప్రాజెక్టు ప్రారంభంలో ఒకసారి ఇచ్చి ముగిసిపోయే ప్రక్రియగా ఉండకూడదు. పదేళ్ల కాలంలో హిమనది వెనక్కి తగ్గవచ్చు, కొత్త మంచుసరస్సు ఏర్పడవచ్చు, కొండ వాలు అస్థిరంగా మారవచ్చు లేదా నదీ మార్గంలో మార్పులు రావచ్చు. అందువల్ల పర్వత ప్రాంతాల్లో ప్రమాద అంచనాలను నిరంతరం నవీకరించే వ్యవస్థ అవసరం. ఒకసారి ఇచ్చిన అనుమతిని శాశ్వత భద్రతా ధ్రువీకరణగా చూడటం ప్రమాదకరం. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల్లోనూ ఆధునిక మార్పులు రావాలి. వర్షపాతంతో పాటు ఉపగ్రహ చిత్రాలు, భూకంప సంకేతాలు, హిమనదుల పర్యవేక్షణ, మంచు సరస్సుల స్థితి, నదీ ప్రవాహాల సమాచారాన్ని ఒకే వ్యవస్థలోకి తేవాలి. ప్రమాదం నదిలో కనిపించే దశకు చేరుకునేలోపే, అది పర్వతంలో మొదలైన దశలో గుర్తించే సామర్థ్యాన్ని పెంచాలి. అయితే సాంకేతికత మాత్రమే ప్రాణాలను రక్షించదు. హెచ్చరిక అందిన వెంటనే ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? ఏ మార్గంలో వెళ్లాలి? అత్యవసర పరిస్థితుల్లో ఎవరు నాయకత్వం వహించాలి? వంటి ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు సిద్ధంగా ఉండాలి. తరలింపు మార్గాలు, సురక్షిత ప్రాంతాలు, స్థానిక స్పందనా బృందాలు, అత్యవసర ఆశ్రయాలు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలి. స్థానిక యంత్రాంగం బలంగా లేకపోతే అత్యాధునిక హెచ్చరిక వ్యవస్థలు సైతం పరిమిత ప్రయోజనమే ఇస్తాయి. హిమాలయాల్లో పుట్టే నదులకు దేశాల సరిహద్దులు తెలియవు. ఎగువ ప్రాంతంలో సంభవించే హిమనదీ మార్పులు, మంచు సరస్సుల ఆకస్మిక విసర్జనలు, కొండచరియలు దిగువ ప్రాంతాలను ప్రభావితం చేయగలవు. అందుకే భారత్, నేపాల్, చైనాల మధ్య హిమనదులు, మంచు సరస్సులు, నదీ ప్రవాహాలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులపై వేగవంతమైన సమాచార మార్పిడి అత్యవసరం. విపత్తు ముప్పును తగ్గించడంలో ఈ సహకారం దౌత్యపరమైన అంశం మాత్రమే కాదు, ప్రాణరక్షణకు సంబంధించిన కార్యాచరణ. హిమాలయాలను మనిషి స్థిరపరచలేడు. పర్వతం కూలడాన్ని ఆపలేడు.కానీ ఆ పర్వతం కింద ఏంనిర్మించాలి, ఎంతమేరకు విస్తరించాలి, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలి, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఎలా రక్షించాలి అన్నది మానవ ప్రణాళికపైనే ఆధారపడి ఉంది. ప్రకృతిని అర్థం చేసుకోకుండా సాగే అభివృద్ధి దీర్ఘకాలంలో నిలవదు. అదే సమయంలో అభివృద్ధిని పూర్తిగా ఆపేయడం కూడా పరిష్కారం కాదు. హిమాలయాల్లో ఇకపై ప్రతి పెద్ద ప్రాజెక్టు ముందు ఎక్కడ నిర్మించగలం?" అనే ప్రశ్నతో పాటు ఎక్కడ నిర్మించకూడదు? అనే ప్రశ్న కూడా ఉండాలి. ప్రకృతి ప్రమాదాన్ని పూర్తిగా నివారించడం మనిషి చేతిలో లేకపోవచ్చు. కానీ అది మానవ విషాదంగా మారే అవకాశాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న పర్వతం ఎప్పుడు కదులుతుందన్నది మాత్రమే కాదు. అది కదిలినప్పుడు మనం ఎంత సంసిద్ధంగా ఉన్నామన్నదే. ●

# పోషకాహార జాగ్రత్తలతో ఆరోగ్య భద్రత

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి


ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యానికి మించిన సంపద లేదు. పోషకాహారమే మన ఆరోగ్యానికి పునాది. దేహమనే దేవాలయానికి ఆరోగ్యకర వాతావరణమే పరమ పవిత్రం. మనం తినే ప్రతి ఆహారం మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. మంచి ఆహారం తీసుకున్నపుడు ఆరోగ్య భాగ్యం, చెడు ఆహారం తీసుకున్నపుడు రోగం కలుగుతుంది. పోషకాహారమే ప్రజారోగ్యానికి ఆధారంగా నిలుస్తుంది. అనారోగ్యాలు కుటుంబాల ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా నిలుస్తాయి. ఆరోగ్యకర పౌర సమాజమే జాతి సమగ్రాభివృద్ధికి వెన్నెముక అని తెలుసుకోవాలి. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతానికి పోషకాహార లోపాలు శాపంగా మారుతున్నాయి. పేదరికం,నిరుద్యోగం, అవిద్య, అవగాహనలేమి లాంటివి పోషకాహారలోప సమస్యలకు కారణం అవుతున్నాయి. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఎదుగుతున్న భారతదేశంలో పోషకాహార లోపాలు బెడద అధికంగా కనిపిస్తున్నది. ప్రజలకు పోషకాహార విలువలను వివరించడానికి, పోషకాల పట్ల అవగాహన కల్పించడానికి, జీవనశైలి మార్పులను సూచించడానికి, పోషక విలువ గూర్చి తెలుపడానికి, ప్రభుత్వాలబాధ్యతను తట్టిలేపడానికి ప్రతి ఏటా 01 నుంచి 07 సెప్టెంబర్‌వరకు ప్రపంచవ్యాప్తంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు (నేషనల్ న్యూట్రీషన్ వీక్) పాటించడం కొనసాగుతున్నది. 1975లో అమెరికాలో ప్రారంభమైన జాతీయ పోషకాహార వారోత్సవాలను 1982లో భారత మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ కూడా ఆచరించడానికి నిర్ణయించింది. ఈ వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్యంపట్ల అవగాహన, పోషకాహార విద్య, అనువైన జీవనవిధానం, పరిసరాలపరిశుభ్రత, సురక్షిత తాగునీరు, పోషకాహారలోపం వల్ల కలిగే దుష్ప్రభావాలు లాంటి అంశాలను ప్రచారం చేయడం జరుగుతుంది. 2026 జాతీయ పోషకాహార వారోత్సవాల ఇతివృత్తంగా డిస్కవర్ ది పవర్ ఆఫ్ న్యూట్రిషన్ (పోషకాహారం శక్తిని ఆవిష్కరిద్దాం) అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. అధిక జనాభా,పేదరికం,నిరుద్యోగం, నిరక్షరాస్యత కలిగిన దేశంలో పోషకాహార సమస్యలు ఉత్పన్నం కావడం సర్వసాధారణం.తినడానికిరెండు పూటల తిండి దొరకడమే కష్టం అయిన వేళ పోషకాహార లభ్యత కష్టమే. రెండు ముద్దల పచ్చడి మెతుకులు తినడానికి అలవాటు పడిన జనానికి ఆరోగ్య సమస్యలు రావడం అతి సహజమే. ఎంత తిన్నాం అనే విషయం కన్న, ఏం తిన్నామన్నదే ప్రధానమని తెలుసుకోవాలి.మనం తినే ఆహారంలో స్థూల సూక్ష్మ పోషకాలు,విటమిన్లు, ప్రోటీన్లు,పిండి పదార్థాలు, ఆరోగ్యకర కొవ్వులు ఉండే విధంగా జాగ్రత్త పడితేనే కుటుంబ ఆరోగ్యం బాగుంటుంది. మనం తినే ప్లేటులో అధికంగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఉండే విధంగా చూసుకోవాలి. చక్కెరలు, ఉప్పు,హానికారక కొవ్వులు తక్కువగా తీసుకోవాలి లేదా నివారించాలి. ●

# వెయ్యి రోజుల ప్రజాపాలన విజయాలు, వైఫల్యాలు!



కొలను వెంకటేశ్వర రెడ్డి


ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భం ఇది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని చెబుతోంది. మరో వైపు, హామీల అమలు,ఆర్థిక పరిస్థితి, వ్యవసాయం, ఉద్యోగాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ప్రభుత్వం తన పాలనను విజయాలుగా ప్రస్తావిస్తున్న 147అంశాలకే పరిమితం కాకుండా, ఆ పథకాల ప్రభావం ప్రజల జీవితాల్లో ఎంతవరకు కనిపించింది? ఎక్కడ ప్రభుత్వం విజయవంతమైంది?ఎక్కడ లోపాలు మిగిలాయి? అనే ప్రశ్నలను పరిశీలించాల్సిన సమయం ఇది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్లవరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు ప్రజల దైనందిన జీవితంపైప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ప్రత్యేకంగా ఈ పథకాలు ప్రభుత్వం సాధించిన ముఖ్యమైన సంక్షేమ విజయాలుగా చెప్పవచ్చు. అయితే, ఈపథకాల దీర్ఘకాలిక ఆర్థిక భారం ఎంత? వాటి వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం ఏమిటి? అన్నది కూడా సమాంతరంగా పరిశీలించాల్సినఅంశమే. దీర్ఘకాలంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామకాలు కొంత ఆశ కలిగించాయి. వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు నియామక ప్రక్రియలు, డీఎస్సీ వంటి పరీక్షలు ప్రభుత్వం చేపట్టిన ప్రధాన చర్యల్లో ఉన్నాయి. ఉద్యోగాల సంఖ్య కంటే నియామక ప్రక్రియలో పారదర్శకత, పరీక్షల నిర్వహణలో నాణ్యత, నోటిఫికేషన్‌నుంచి నియామకం వరకు నిర్దిష్ట కాలపట్టిక ఉండటం మరింత కీలకం. ఈఆఫీస్, వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు, భూభారతి వంటి కార్యక్రమాలు పరిపాలనను సులభతరం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తగ్గించి, సేవలను ప్రజల మొబైల్ ఫోన్లకు చేరువ చేయడం డిజిటల్ పాలనలో మంచి పరిణామం. అయితే డిజిటల్ సేవలు అందుబాటులో లేని గ్రామీణ, వృద్ధ, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న ప్రజలకు ప్రత్యామ్నాయ సేవావ్యవస్థ కూడా సమర్థంగాఉండాలి. అలాగే కులగణన, ఎస్సీ ఉపవర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదనలు వంటిఅంశాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైనరాజకీయ అడుగులుగా నిలిచాయి. అయితే వీటి అమలు న్యాయపరమైన సవాళ్లను అధిగమిస్తూ, అన్ని వర్గాల ఆమోదంతో ముందుకు సాగడం ప్రభుత్వానికి కీలక పరీక్ష. సంక్షేమ పథకాలు కొనసాగించడంతో పాటు మూలధన వ్యయం,మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగాల సృష్టికోసం అవసరమైన పెట్టుబడులు పెట్టడం ప్రభుత్వానికి పెద్ద సవాలు. ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన, తరచూ నవీకరించే సమాచారం అందించడం ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచుతుంది. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో రైతు రుణమాఫీ, రైతు



భరోసా, ఉద్యోగ క్యాలెండర్,గృహ నిర్మాణం తదితర అంశాలు కీలకమైనవి. ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ,ప్రతిపక్షాలు మాత్రం కొన్ని హామీలు పూర్తిగా అమలు కాలేదని విమర్శిస్తున్నాయి. అలాగే ఉద్యోగ నియామకాల్లో పరీక్షల నిర్వహణ, కోర్టు వివాదాలు, నోటిఫికేషన్లలో జాప్యం వంటి అంశాలు యువతలో అసంతృప్తికి కారణం కాకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా రైతుల సమస్యలు ప్రభుత్వ పనితీరుకు కీలకమైన కొలమానం. యూరియా, విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, పంటల కొనుగోలు అనంతరం రైతులకు చెల్లింపుల విషయంలో అప్పుడప్పుడు ఎదురవుతున్న సమస్యలు ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అంశాలు. రైతుకు పంట పండించడం ఎంత ముఖ్యమో, అవసరమైన సమయంలో ఎరువు,విత్తనం లభించడం,పంటకు గిట్టుబాటు ధర రావడం, అమ్మిన పంటకు సమయానికి డబ్బుఅందడం అంతేముఖ్యం. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పనితీరును ప్రకటనలతో కాకుండా, రైతుపొలంలో కనిపించే మార్పులతోనే కొలవాలి. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు,ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా చేపడుతున్న చర్యలకు ఒక వర్గం నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. మరోవైపు, నిర్మాణాల కూల్చివేతలు, మధ్యతరగతి కుటుంబాల ఆస్తులపై ప్రభావం, న్యాయపరమైన అంశాలపై విమర్శలు కూడా వచ్చాయి. మూసీ పునరుజ్జీవనం కూడా హైదరాబాద్ భవిష్యత్తుకు అవసరమైన భారీ ప్రాజెక్టుగా ప్రభుత్వం చెబుతోంది. కానీ అభివృద్ధి పేరుతో నివాసితుల పునరావాసం, పరిహారం, జీవనోపాధి వంటి అంశాలను విస్మరించకూడదు. ప్రాజెక్టు ఎంత గొప్పదైనా, దానివల్ల ప్రభావితమయ్యే కుటుంబాల కన్నీళ్లపై అభివృద్ధి నిర్మించకూడదు.ముందుగా సమగ్ర పునరావాసం, పరిహారం, ప్రత్యామ్నాయ నివాసం కల్పించి, ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవడం మానవతా దృక్పథంగా ఉంటుంది. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది.పెట్టుబడుల ఒప్పందాలు రాష్ట్ర భవిష్యత్తుకు ఆశాజనకమైన సంకేతాలే. కానీ అవగాహన ఒప్పందాలు కుదరడం ఒక దశ మాత్రమే. ఎన్ని కంపెనీలు వాస్తవంగా తెలంగాణలో పెట్టుబడి పెట్టాయి? ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి?ఎంతమంది స్థానికులకు ఉద్యోగాలు వచ్చాయి?ఎంత పెట్టుబడివచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానాలే పెట్టుబడుల విజయాన్ని నిర్ణయిస్తాయి. అలాగేకేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు,ప్రాజెక్టులు, అనుమతులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతవరకు విజయం సాధించింది అన్నదికూడా చర్చనీయాంశమే.ముఖ్యమంత్రి ఢిల్లీపర్యటనల సంఖ్యకంటే, వాటి ద్వారా తెలంగాణకు వచ్చిన ప్రయోజనాలే ప్రజలకు ముఖ్యం.వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను ఒకే రంగుతో అంచనా వేయడంసరైనది కాదు. ప్రజలకు సంక్షేమం, యువతకు ఉద్యోగాలు కావాలి, రైతుకు భరోసా కావాలి.వ్యాపారికి స్థిరమైన వాతావరణం కావాలి. పెట్టుబడిదారుడికి నమ్మకం, రాష్ట్రానికి ఆర్థిక క్రమశిక్షణ కావాలి. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించగలిగితేనే వెయ్యిరోజుల పాలనకు నిజమైన అర్థం ఉంటుంది. ప్రభుత్వం చెప్పే విజయాలు ఒక వైపు, ప్రతిపక్షాలు చేసే విమర్శలు మరోవైపు కానీ అంతిమంగా ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే ప్రభుత్వ పనితీరుకు అసలు కొలమానం. వెయ్యిరోజులు పూర్తయ్యాయి ఇక మిగిలింది ఫలితాల కాలం. ప్రజలు ప్రశ్నిస్తారు, ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అదే ప్రజాస్వామ్యంలో నిజమైన ప్రజాపాలన. ●

# నేపాల్‌లో కుప్పకూలిన భారీ హిమానీనదం

## డ్రోన్ వీడియోలో రికార్డయిన ప్రళయ దృశ్యాలు



**కాఠ్మాండు, ఆగస్టు 31:** హిమాలయ పర్వత శ్రేణుల్లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ శిఖరం వద్ద ఓ భారీ హిమానీనదం, దాని కిందఉన్న రాతి పొరలు సహా కుప్పకూలింది. ఈ ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు డ్రోన్ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటన కారణంగానే గత వారం నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో భీకర వరదలు సంభవించి వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.
చైనాకు చెందిన ఒకఫొటోగ్రాఫర్ సుమారు 7,200 మీటర్ల ఎత్తు నుంచి ఈ విపత్తును తన డ్రోన్ కెమెరాలో చిత్రీకరించారు. భారీ మంచు ఫలకం, రాళ్లతోకూడిన పర్వత భాగం ఒక్కసారిగా విరిగి పడటం, ఆ తర్వాత పర్వతాల నుంచి దట్టమైన ధూళి మేఘాలు పైకి లేవడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. విరిగిపడిన భాగం సుమారు 1,200 మీటర్ల దిగువనఉన్న లోయలో పడటంతో మంచు, రాళ్లు, బురదతో కూడిన ఉప్పెన సృష్టించింది. ఈ ప్రళయం కారణంగా ఆగస్టు 26న భోటేకోశి, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ వరదల వల్ల నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో వందలాది మంది మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఎక్కువ మంది నేపాల్‌కు చెందినవారే. శాటిలైట్ చిత్రాలు, భూకంప డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు, 'లాంగ్‌టాంగ్ లిరుంగ్ ఉత్తర భాగంలో భారీ స్థాయిలో మంచు, రాళ్లు విరిగిపడటమే వరదలకు కారణం' అని తేల్చారు. హిమానీనదం కూలినప్పుడు భూకంప లేఖినిపై 5.2 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయని వెల్లడించారు. హిమాలయాల్లో ఇలాంటి విపత్తులు ఇటీవలి కాలంలో తరచుగా జరుగుతున్నాయని, ఎత్తైన ప్రదేశాల్లోని అస్థిరమైన మంచు, రాళ్ల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

**నేపాల్ సహాయ నిధికి సద్గురు రూ.కోటి విరాళం**

హిమాలయ ప్రాంతంలో విపత్తులను ఎదుర్కొనేందుకు భారత్,చైనా, పాకిస్థాన్, నేపాల్, భూటాన్‌తో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ ప్రతిపాదించారు. రాజకీయ సరిహద్దులకు అతీతంగా ఈ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నేపాల్ వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు రూ.కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.
కాఠ్మండులో నిర్వహించిన 'ఇన్ సాలిడారిటీ విత్ నేపాల్' కార్యక్రమంలో సద్గురు జగ్గీ వాసుదేవ్ మాట్లాడారు. నేపాల్-టిబెట్ సరిహద్దులో ఇటీవల సంభవించిన భారీ వరదలతో వేలాది మంది గల్లంతయ్యారని తెలిపారు. మృతుల సంఖ్య కూడా భారీగా ఉండే అవకాశం ఉందన్నారు. విపత్తు సమయంలో చైనా వైపు గ్యిరోంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న ఇషా సంస్థకు చెందిన కైలాశ్ యాత్రలో పాల్గొన్న 77 మంది ఆచూకీ ఇంకా లభించలేదని చెప్పారు.
నేపాల్ వైపుఉన్న ముగ్గురు ఇషా వాలంటీర్లు కూడా గల్లంతైనట్లు తెలిపారు. హిమాలయ పర్వతాలకు దేశాల సరిహద్దులు తెలియవని సద్గురు అన్నారు. పర్వత ప్రాంతాలను ఒకే పర్యావరణ వ్యవస్థగా భావించి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపాదిత హిమాలయ బోర్డును ఆలస్యం చేయకుండా ఏర్పాటు చేయాలని కోరారు. రాజకీయ పాలనలు వేర్వేరుగా ఉన్నా.. హిమాలయాల పరిరక్షణ విషయంలో దేశాల మధ్య సమన్వయం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో 933 మంది వర్కర్లు మిస్సింగ్**

నేపాల్ వరదల్లో పలు జల విద్యుత్తు కేంద్రాలు కొట్టుకుపోయాయి. అయితే అక్కడ ఉన్న టన్నెల్స్‌లో వందల సంఖ్యలో కార్మికులు చిక్కుకున్నట్లు గుర్తించారు. బురద సునామీవల్ల ఆ టన్నెల్స్ అన్నీ మూసుకుపోయాయి. అయితే రసువా జిల్లాలోని త్రిశూలీ 3ఏ హైడ్రోపవర్ సైట్ వద్ద ఉన్న టన్నెల్‌లో సుమారు 933 మంది కార్మికులు ఇరుక్కున్నట్లుతెలుస్తోంది. వారిని రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఆ టన్నెల్స్‌లోకి వెళ్లేందుకు చాలా కంట్రోల్డ్ బ్లాస్టింగ్ చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు ఆ బ్లాస్టింగ్ చేపట్టారు. టన్నెల్ యాక్సెస్ కోసం ఆ బ్లాస్ట్ చేసినట్లు తెలుస్తోంది. హైడ్రోపవర్ సైట్ వద్ద ప్రధాని ఆదేశాల ప్రకారం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొన్నది.
జెసిబిల ద్వారా సుమారు 10 మీటర్ల గొయ్యిను ఓ ప్రదేశంలో తొవ్వారు. బురద, రాళ్లతో నిండిన ప్రదేశాన్ని నేపాలీ ఆర్మీ శుభ్రం చేస్తున్నది. త్రిశూలీ 3ఏ టన్నెల్‌లోకి ప్రవేశించేందుకు క్లీనింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఓ టన్నెల్ నుంచి శుక్రవారం 191 మందిని, శనివారం మరో టెన్నెల్ నుంచి 88 మందిని రక్షించినట్లు నేపాల్ డిజాస్టర్ ఏజెన్సీ పేర్కొన్న విషయం తెలిసిందే. టన్నెల్స్ నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన వారు.. టన్నెల్స్‌లో మరింత మంది సజీవంగా ఉన్నట్లు చెప్పారు.
టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ కోసం విదేశీ బృందాలు కూడా రంగంలోకి దిగాయి. హైడ్రోపవర్ ప్రాజెక్టుల వద్ద ఉన్న టన్నెల్స్‌ను లొకేట్ చేసి, వాటిల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.
రసువాగాధీ హైడ్రోపవర్ ప్రాజెక్టులో ఆర్మీ సిబ్బంది వెళ్లారు. కానీ ఎవర్నీ గుర్తించలేకపోయారు. డ్రోన్ల సాయంతో టన్నెల్స్‌ను పరీక్షిస్తున్నారు. అప్పర్ త్రిశూలీ 1, త్రిశూలీ 3ఏ, త్రిశూలీ 3బీ టన్నెల్స్ లోనూ సెర్చ్ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. భారత్, చైనా, దక్షిణ కొరియాకు చెందిన రెస్క్యూ బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. సాంకేతిక అంశాల్లో చాలా సాయం కావాల్సి ఉంటుందని నేపాల్ ప్రభుత్వం పేర్కొన్నది. మృతదేహాల డిఎన్‌ఏ గుర్తింపు కూడా కష్టమైన పని అని పేర్కొంటున్నారు.



# అమెరికాలో వరద బీభత్సం

## 20 మందికి పైగా గల్లంతు

**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ నేషనల్ పార్కులో ఆకస్మిక వరదలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. బ్రైట్ ఏంజెల్ క్రీక్‌లో శనివారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో 20 మందికిపైగా గల్లంతైనట్లు సమాచారం. ఉధృత ప్రవాహం కారణంగా.. పాదచారుల వంతెనలు, పెద్ద బండరాళ్లు, లోహ నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొలరాడో నదిలోకి కొట్టుకుపోయాయి. వరద ప్రవాహం కారణంగా క్రీక్ రూపమే పూర్తిగా మారిపోయిన దృశ్యాలు విడియోల్లో కనిపిస్తున్నాయి. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతం నుంచి ఫాంటమ్ రాంచ్‌లో ఉన్న 62 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలపై అధికారిక సమాచారం వెలువడలేదు. అయితే భారీ వర్షాల కారణంగా మరిన్ని ఆకస్మిక వరదలు, శిథిలాల ప్రవాహాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. నష్టాన్ని అంచనా వేసేందుకు బ్రైట్ ఏంజెల్ క్యాంప్‌గ్రౌండ్, ఫాంటమ్ రాంచ్‌చ నార్త్ కైబాబ్ ట్రైల్‌లోని కొన్ని ప్రాంతాలను మూసివేయడంతోపాటు కొలరాడో నదిపై రాఫ్టింగ్ యాత్రలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.

# ఇక పార్కులు, నైట్ క్లబ్స్‌లోనూ మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు!

## చైనా సంచలన నిర్ణయం



**బీజింగ్, ఆగస్టు 31:** చైనాలో వివాహాల సంఖ్య అంతకంతకూ క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో వివాహ ప్రక్రియను సులభతరం చేసేందుకు చైనాలోని స్థానిక అధికారులు ప్రసూతి ఆస్పత్రులు, బ్యాంకులు, నైట్‌క్లబ్‌ల వంటి ప్రదేశాల్లో వివాహ రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్టు' వెల్లడించింది. క్విక్సీ పండుగ సందర్భంగా ఈ వినూత్న ప్రయత్నాన్ని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని లింజీ జిల్లాలోని ప్రసూతి, శిశు సంక్షరణ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రారంభించారు. ఇదేవిధంగా టియాంజిన్‌లోని పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ ఆఫ్ చైనా శాఖ గత నెలలో వివాహ నమోదుసేవలను అందించిన మొదటి బ్యాంకుగా నిలించింది. అలాగే గ్వాంగ్ జౌ బైయున్ అంతర్జాతీయ విమానాశ్రయం తాజాగా వివాహ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడం ప్రారంభించింది. షాంఘైలోని ఒక నైట్ క్లబ్ స్థానిక పౌర అధికారులతో సర్టిఫికేషన్ వేడుకలను నిర్వహించింది. ఇక చైనాలోని జంటలు మెట్రోస్టేషన్లు, పబ్లిక్ పార్కులు, చారిత్రక దేవాలయాలలో కూడా వివాహాలు చేసుకోవచ్చు. దేశంలో జనాభా సంక్షోభం తలెత్తుతున్న దృష్ట్యా చైనా ఈ నిర్ణయం తీసుకుంది.

# నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు రద్దు చేయండి

## సుప్రీంకోర్టును కోరిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలో దాడికి పాల్పడ్డ నిందితులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు కొట్టివేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించాలని కోరింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద సిజెపి ఆధ్వర్యంలో ఆందోళన జరిగిన సంగతి తెలిసిందే. ఈ నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులపై భద్రతాదళాలు దాడిచేయగా.. పోలీసులు, భద్రతా బలగాలపై ఆందోళనకారులు దాడి చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనల్లో పలువురికి గాయాలయ్యాయి. భారీ ఆస్తి నష్టం జరిగింది. దీంతో ఈ దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఢిల్లీతోపాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో కూడా అనేక మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, సిజెపి ఆందోళన విరమించే సమయంలో కేంద్ర ప్రభుత్వం యువతపై నమోదైన కేసుల్ని తొలగిస్తామని, ఎఫ్ఐఆర్‌లో రద్దు చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చింది. ఇదిజరిగి నెలరోజులు అవుతున్నా.. ఇంకా ఎఫ్ఐఆర్‌లు రద్దుకాలేదు. దీంతో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోని కారణంగా సెప్టెంబర్ 5న సిజెపి ఆధ్వర్యంలో ఢిల్లీలో మరో ర్యాలీ జరగనుంది. ఈనేపథ్యంలో ముందుగానేస్పందించిన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తనకున్న అపరిమిత అధికారాన్ని ఉపయోగించి, నిందితులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సుప్రీంకోర్టును ప్రభుత్వం కోరింది. సుప్రీంచీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ముందు ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. మంగళవారమే ఈ కేసు విచారణ చేపట్టాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ సూర్యకాంత్.. ఈ కేసు విచారణ అంత త్వరగా చేపట్టడం అత్యవసరమా అని ప్రశ్నించారు. దీనికి మెహతా బదులిస్తూ ఈ విషయంలో ఇరుపక్షాలు రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం, ఆందోళన కారులు కలిసి ఈ అంశంపై ఏకాభిప్రాయానికి వస్తామంటే తమకేం అభ్యంతరం లేదని కోర్టు తెలిపింది. ఈ కేసు విచారణను సెప్టెంబర్ 1, మంగళవారానికి వాయిదా వేసింది.



# సింధు జలాల ఒప్పందం

## మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అధికారం ఆ కోర్టుకు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ సోమవారం ఒక ఘాటైన ప్రకటన విడుదల చేసింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ కోర్టును చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిందని భారత్ ఆరోపించింది.
ఈ కోర్టును తాము ఎన్నడూ గుర్తించలేదని, దాని విచారణకు కూడా హాజరు కాలేదని తేల్చి చెప్పింది. "ఈ మధ్యవర్తిత్వ కోర్టుకు మా సార్వభౌమ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఏమాత్రం లేదు. ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఆ కోర్టు తీర్పులు మా చర్యలపై ఎలాంటి ప్రభావం చూపవ్వు అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగినంత కాలం ఈ ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ స్పష్టం చేసింది. తాజా తీర్పుతో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, దేశీయంగా చేపడుతున్న జల ప్రాజెక్టులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండదని పునరుద్ఘాటించింది.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు



**డెహ్రాడూన్, ఆగస్టు 31:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యక్రమం జరిగిన ప్రదేశంలో నిర్వహించిన ఓ మతపరమైన కార్యక్రమానికి కులం రంగు పులిమారంటూ వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. కులాల మధ్య విద్వేషాన్ని పెంచడం, మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉద్దేశ పూర్వకంగా వ్యవహరించడం వంటి అభియోగాలపై భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని నిబంధనలను కూడా కేసులోచేర్చారు. జవహర్‌నగర్‌కు చెందిన అమిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఆయన శ్రీరామ్ సేన ధర్మార్థ సేవాన్యాస్ సభ్యుడిగా ఉన్నారు.
హల్ద్వానీలో జరిగిన 'శుద్ధి కార్య క్రమం, పరిశుభ్రత కార్యక్రమ్మంలో తాను పాల్గొన్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆగస్టు 29నఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో రాహుల్‌చేసిన వ్యాఖ్యలు వాల్మీకిసామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీశాయని ఆరోపించారు. శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న వారిని అంటరానితనాన్ని పాటించే వారిగా, దళిత వ్యతిరేకులుగా రాహుల్ చిత్రీకరించారని అమిత్‌కుమార్ ఆరో పించారు. తాను ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తినని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ లతో పాటు వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. దీనికి ఖర్గే కులానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

# పెట్రోల్‌లో ఇథనాల్ శాతమెంత?

## సుప్రీంకోర్టులో పిల్... విచారణకు నో

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఇథనాల్ శాతం ఎంతో తప్పనిసరిగా వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. న్యాయవాది ఎన్.కె. గోస్వామి సుప్రీంకోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. పెట్రోల్ నాజిల్లపై, జారీ చేసే రశీదులపై ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ముద్రించాలని ఆయనకోరారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌కు ఏయే వాహనాలు అనుకూలంగా ఉంటాయో తెలిపే అధికారిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలనిఅభ్యర్థించారు. ముఖ్యంగా 2023 కంటే ముందు తయారైన పాత వాహనాలకు ఇ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వాడకం వల్ల తలెత్తే సమస్యల నుంచి రక్షణ కల్పించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు.
ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి.వరాళేలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఇది ఒక 'ప్రాక్సీ పిటిషన్' అని, ఇదే తరహా వ్యాజ్యాన్ని 2025 సెప్టెంబర్‌లోనే సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది.

# 'సర్' పేరుతో జనాభా తగ్గిస్తున్నారా?

## ఎన్నికల సంఘం తీరుపై ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ఓటర్ జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ ద్వారా దేశ జనాభాను ఎన్నికల సంఘం తగ్గిస్తున్నదని ఢిల్లీ మాజీ సిఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. దీంతో జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 47 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను ఇసి తొలగించడంపై కేజ్రీవాల్ స్పందిస్తూ, దేశ రాజధానిలోని సుమారు 1.5 కోట్ల మంది ఓటర్లలో 47 లక్షల పేర్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనా పరోక్షంగా విమర్శలు గుప్పించారు.
'జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందకూడదు. ఎందుకంటే 'సర్' ప్రక్రియ ద్వారా దేశ జనాభాను 140 కోట్ల నుంచి 50 కోట్లకు ఎన్నికల సంఘం తగ్గించగలదు' అని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# 'నిజమైన శత్రువు ఎవరో గుర్తించండి'


## ముస్లిం దేశాలకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా లేఖ

**టెహ్రాన్, ఆగస్టు 31:** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా.. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇస్లామిక్ ప్రపంచానికి కీలక సందేశాన్ని ఇచ్చారు. ముస్లిం దేశాలు, ముఖ్యంగా గల్ఫ్ ప్రాంత దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనబెట్టి.. ఏకమవ్వాలని సూచించారు. నిజమైన శత్రువులు ఎవరో గుర్తించి వారికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఆయన తన అధికారిక టెలిగ్రామ్ ఖాతా ద్వారా ఈ లిఖితపూర్వక ప్రకటనను విడుదల చేశారు.

**ముస్లిం దేశాల మధ్య ఐక్యత లేకపోవడం వల్లే..**

ఇస్లామిక్ దేశాల మధ్య సఖ్యత, సహకారం, ఐక్యత లేకపోవడం వల్లే పశ్చిమాసియా ప్రాంతంలో నిరంతరం ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని మొజ్తబా ఖమేనీ ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడం వల్లే పాలస్తీనా తీవ్రమైన నిస్సహాయ స్థితికి దిగజారిందని, అంతులేని వ్యథకు గురైందని పేర్కొన్నారు. 'తెలిసో తెలియకో, ఉద్దేశపూర్వకంగానో లేక అనుకోకుండానో ముస్లిం సమాజంలో ఘర్షణలకు, విభేదాలకు కారణమయ్యే ప్రతి ఒక్కరూ ఇస్లాం శత్రువుల ప్రణాళికలకే సహకరిస్తున్నారు. గల్ఫ్ దేశాలు ఇస్లాం జెండా నీడన ఐక్యంగా ఉంటే శత్రువులు వారి భూభాగాలపై కన్నేసేవారా?' అని ఆయన ప్రశ్నించారు. గల్ఫ్ పాలకులంతా తమ అసలైన శత్రువులైన అమెరికా, ఇజ్రాయెల్‌ను స్పష్టంగా గుర్తించి.. వారి కుట్రలను అర్థం చేసుకుని ఎదుర్కోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఇరాన్ పౌరులు, అధికారులకు కీలక సూచన**



కేవలం పొరుగు దేశాలకే కాకుండా.. ఇరాన్‌లోని ప్రజలు, అధికా రులు కూడా తమ మధ్య ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఖమేనీ సూచించారు. సామాజిక సమైక్యతను దెబ్బతీసే ఏ చర్య అయినా నిషేధించదగినదని ఆయన తేల్చి చెప్పారు. యుద్ధం, సుదీర్ఘ ఆంక్షలు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వల్ల తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోవడానికి దేశంలో ఉత్పత్తిని పెంచాలని, ఇరాన్ ఆర్థిక వ్యవస్థలో డాలర్ వాడకాన్ని విడతల వారీగా తగ్గించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ యేడాది ఫిబ్రవరి 28న యుద్ధ ప్రారంభంలో తండ్రి అలీ ఖమేనీ మరణించిన తర్వాత మొజ్తబా ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయ కుడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు గడుస్తున్నా.. ఆయన ఇప్పటివరకు ఒక్కసారి కూడా బహిరం గంగా కనిపించలేదు. ఆయనకు సంబంధించిన ఎలాంటి ఆడియో లేదా విడియో దృశ్యాలను అధికారులు విడుదల చేయకపోవడం గమనార్హం.

# సంక్షిప్త వార్తలు

## టపాసుల పరిశ్రమలో పేలుడు: ఏడుగురు మృతి

**లక్నో, ఆగస్టు 31:** ఉత్తర ప్రదేశ్‌లోని ఒక టపాసుల పరిశ్రమలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. కౌశంబి జిల్లాలోని టపాసుల పరిశ్రమలో పేలుడు సంభవించి ఏడుగురు మరణించారు. 24 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా మెజిస్ట్రేట్ అమిత్‌పాల్ శర్మతోపాటు సిఐ శివాంగ్ సింగ్, ఇతర ఉన్నతాధికారులు దగ్గరుండి పరిస్థితిని సమీక్షించారు.

## సింగర్ హత్య.. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు షూటర్లు మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** హరియాణా సింగర్, యూట్యూబర్ అంకిత్ బాల్యన్ హత్య కేసులోని ఇద్దరు ప్రధాన నిందితులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని షామ్లీ పరిధిలో కైరానా రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. సోనేపట్‌కు చెందిన మోహిత్(22), సుమిత్(24) తప్పించుకునేందుకు పోలీసులపై కాల్పులు జరపగా, పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. గాయపడ్డ ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. వీరిపై రూ.50 వేల చొప్పున రివార్డు ఉంది. ఆగస్టు 26న జిమ్ వద్ద అంకిత్‌పై 18 రౌండ్లు కాల్పులు జరిపి హతమార్చిన విషయం తెలిసిందే.

## సిజెపి ర్యాలీపై ఆంక్షలకు సుప్రీంకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సెప్టెంబర్ 5న ఢిల్లీలో తలపెట్టిన ర్యాలీపై ఆంక్షలు విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే బ్రిక్స్ సదస్సు ముగిసే వరకూ ఈ ర్యాలీని నిలువరించాలని దాఖలైన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని భావించేందుకు బలమైన కారణాలేమీ లేవని కోర్టు స్పష్టం చేసింది.

## ఆర్మీకి మేజర్ రిషభ్ గుడ్‌బై



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెంటే కనిపించే ఎడిసి మేజర్ రిషభ్ సింగ్ ఆర్మీకి గుడ్‌బై చెప్పారు. నేషనల్ క్రష్‌గా పేరొందిన ఆయన ముందస్తు రిటైర్మెంట్ తీసుకోవడం నెట్టింట వైరల్‌గా మారింది. 12 యేళ్ల సైన్యంలో చేసిన ఆయన వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 2014లో ఎన్‌డిఎలో చేరిన ఆయన 4 పారా స్పెషల్ ఫోర్సెస్‌లో బలిదాన్ బ్యాడ్జ్ సాధించారు. 2021 రిపబ్లిక్ పరేడ్‌లో జాట్ రెజిమెంట్‌ను నడిపించి 2023లో ఎడిసిగా ఎంపికయ్యారు. ఆయన సడెన్‌గా తప్పుకోవడం చర్చకు దారితీసింది.

## వరదల్లో కోటిన్నర నగదు, బంగారం స్వాధీనం

**ఖాఠ్మాండు, ఆగస్టు 31:** నేపాల్‌లోని త్రిశూలీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఓ గ్రామీణ బ్యాంకు నుంచి భారీ మొత్తంలో నగలు, ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బురదతో నిండిన వరద పోటెత్తిన ఘటనలో త్రిశూలీ దుంగేలో ఉన్న అగ్రికల్చర్ డెవలప్మెంట్ బ్యాంక్ బ్రాంచ్ ధ్వంసమైంది. ఆకస్మిక వరదలతో ధ్వంసమైన ఆ ప్రాంతంలోని బ్యాంకు నుంచి లాకర్లను తీసేందుకు సుమారు 8 గంటల ఆపరేషన్ చేపట్టారు. ఆ బ్యాంకు శిథిలాల కింద ఉన్న లాకర్లను ఎట్టేకేలకు చేజిక్కించుకున్నారు. వివిధ లాకర్లలో ఉన్న సుమారు రూ.1.5 కోట్ల నగదు, సుమారు 50 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను బ్యాంకు ఆఫీసర్లు స్వాధీనం చేసుకున్నారు.

## నేపాల్‌కు కేపాప్ స్టార్ లీ నో భారీ విరాళం

**కాఠ్మాండు, ఆగస్టు 31:** నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరద బాధితులను ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ప్రముఖ దక్షిణ కొరియా పాప్ (కేపాప్) బ్యాండ్ 'స్ట్రే కిడ్స్' సభ్యుడు లీ నో తన ఉదారతను చాటుకున్నారు. వరద సహాయక చర్యల నిమిత్తం 100 మిలియన్ల కొరియన్ వన్‌లు (భారత కరెన్సీలో సుమారు రూ.69 లక్షలు) విరాళంగా ప్రకటించారు. 'వరల్డ్ విజన్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ విరాళాన్ని అందించారు.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 31:** హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్,అమెరికా(అధికారుల బృందం)లో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది.

ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్.. భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్) ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి.

ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి), లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. బ్రిటన్ పర్యటన ముగిసిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షి ంచారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇప్పటికే నాలెడ్జ్ ఎకానమీలో మంచి స్థానం సంపాదించిందన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో హైదరాబాద్ ముందుందని చెప్పారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూళ్లు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీల నుంచి మంచి విద్య పొందిన మానవ వనరులే హైదరాబాద్ అభివృద్ధికి ప్రధాన బలమన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే మరిన్ని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, కంపెనీలు తెలంగాణకు వచ్చే అవకాశం ఉందన్నారు.

స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కాలేజీల ద్వారా నైపుణ్యం కలిగిన బ్లూ కాలర్ ఉద్యోగులను తయారు చేస్తామని చెప్పారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల స్వల్పకాలిక కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను హైదరాబాద్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు ఇన్‌స్టిట్యూట్‌లోని తరగతి గదులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. నవంబర్ నుంచే హైదరాబాద్‌లోని ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలు నిర్వహించే విద్యా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో భారత్ ఫ్యూచర్ సిటీలోనూ గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌కు అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

డిసెంబరు 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ విద్యాసంస్థలు, క్రీడా సదుపాయాలు రాష్ట్ర అభివృద్ధిపై చూపే ప్రభావంపై ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో సర్కార్ కీలక ఒప్పందాలు
### సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ప్రకటన


సీడ్ గణేశను ప్రారంభిస్తున్న మెగాస్టార్ చిరంజీవి, చిత్రంలో జోగినపల్లి సంతోష్‌రావు తదితరులు.

## చిరంజీవి చేతుల మీదుగా సీడ్ గణేశ ప్రచారానికి శ్రీకారం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 31, ప్రభాతవార్త:** కాలుష్యకారకాలైన వినాయకులను కాకుండా పర్యావరణ గణపతులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, ఆ దిశగా ప్రతిమలను ఏర్పాటుచేసుకోవాలని సినినటుడు చిరంజీవి అన్నారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించే గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా రానున్న వినాయక చవితి నేపథ్యంలో జోగినపల్లి సంతోష్ రావు ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా సీడ్ గణేశ ప్రచారాన్ని ప్రారంభించారు. భక్తి భావంతో పాటు ప్రకృతి పరిరక్షణను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సంతోష్ రావు అన్నారు. సహజ పదార్థాలు, విత్తనాలతో రూపొందించిన సీడ్ గణేశ విగ్రహాన్ని పూజ అనంతరం ఇంటి వద్దే నిమజ్జనం చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం కొంతనీరు పోసి జాగ్రత్తగా సంరక్షిస్తే అందులోని విత్తనాలు మొలకెత్తి మొక్కగా ఎదుగుతాయన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను అభినందిస్తూ సీడ్ గణేశ కార్యక్రమానికి మద్దతు తెలిపిన చిరంజీవికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ప్రోత్సాహకరమైన మాటలు పర్యావరణహితంగా వినాయకచవితి వేడుకలు నిర్వహించేందుకు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. వినాయకుడి ఆశీస్సులు పొందడంతో పాటు ప్రకృతి పట్ల మన బాధ్యతను గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. వినాయకుడిని పూజిద్దాం.. మొక్కను పెంచుదాం.. ప్రకృతిని కాపాడుదాం అనే సందేశంతో పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు.

## రేపు గాంధీభవన్‌లో షబ్బీర్‌అలీ ప్రజలతో ముఖాముఖి

**హైదరాబాద్,ఆగస్టు 31,ప్రభాతవార్త:** ప్రజా పాలనలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఎస్ సి, ఎస్‌టి, ఒబిసి మైనారిటీ సంక్షేమ శాఖ సలహాదారులు షబ్బీర్ అలీ బుధవారం పాల్గొంటారు. ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇందిరాభవన్‌లో విన్నపాలు తీసుకొని అనంతం ఎన్ని విన్నపాలు అందాయో షబ్బీర్ అలీ విలేఖరులకు వివరిస్తారు.

## తెలంగాణ ప్రగతికి కొత్త దిశ వెయ్యిరోజుల పాలన

### మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్,ఆగస్టు 31,ప్రభాతవార్త:** తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికి దిక్సూచిగా నిలుస్తుందనీ వెయ్యి రోజుల పాలనలో ప్రజలు సుఖశాంతులతో ఆనందంతో జీవిస్తున్నారని మంత్రి వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 1000 రోజుల్లో రైతు సంక్షేమం, పేదల భరోసా, యువతకు ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా పెంపు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయన్నారు. బిసి కులగణన, స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. 1000 రోజులు ఒక మైలురాయి మాత్రమేనని ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో మరింత వేగంగా పనిచేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై అప్పీలు దాఖలు చేసిన ప్రభుత్వం

### విచారణ నేటికి వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు31:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. అప్పీలు పిటిషన్ విచారణ అర్థతపై సీజే ధర్మాసనంలో వాదనలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్ రెడ్డి సోమవారం వాదనలు వినిపించారు. నిరుపేద యువతుల పెళ్లి కోసం ప్రభుత్వం సాయం చేస్తోందని, బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని వివరించారు. అనంతరం న్యాయమూర్తి మంగళవారం విచారణను వాయిదా వేశారు.

## ఎంపి ల్యాడ్స్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యం

### రెండేళ్లలో 23 శాతం మాత్రమే వినియోగం
### ఆరుగురు ఎంపిలు 10 శాతం కంటే తక్కువ ఖర్చు
### నిధుల వినియోగంలో 24వ స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేయడంలో కొందరు ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గత రెండేళ్లలో పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీల్యాడ్స్) కింద తెలంగాణ ఎంపీలకు కేటాయించిన నిధులలో వారు కేవలం 23 శాతం మాత్రమే వినియోగించుకున్నట్లు ఎంపవర్‌డ్ ఇండియన్ వెబ్‌సైట్‌లో వెల్లడైంది. కేంద్రం ఎంపీల్యాడ్స్ కింద ప్రతి ఎంపీకి ఏటా రూ. 5 కోట్లు కేటాయిస్తుంది. జాతీయ సగటు వినియోగం 75 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది చాలా తక్కువగా ఉంది. 28 రాష్ట్రాలలో ఈ రాష్ట్రం 24వ స్థానంలో ఉంది. తెలంగాణకు చెందిన 17 మంది లోక్‌సభ, 6గురు రాజ్యసభ సభ్యులతో సహా 23 మంది ఎంపీలకు కేంద్రం రూ.394 కోట్లు కేటాయించగా, అందులో కేవలం రూ.94 కోట్లు మాత్రమే వినియోగించినట్లు చూపించారు. ఆరుగురు ఎంపీలు అయితే రెండేళ్ల కాలంలో తమకు అందుబాటులో ఉన్న నిధులలో 10 శాతం కంటే తక్కువ ఉపయోగించారు. తెలంగాణ ఎంపీలలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అత్యధిక వినియోగాన్ని నమోదు చేశారు. రెండేళ్ల కాలానికి తనకు కేటాయించిన రూ. 28 కోట్లలో ఆయన 56 శాతం వినియోగించుకున్నారు. మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్ 49 శాతం, బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర 48 శాతం నిధులను ఉపయోగించుకున్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులలో, జి. కిషన్‌రెడ్డి తన కేటాయింపులో 3.23 శాతం, బండి సంజయ్ కుమార్ సుమారు 38 శాతం వినియోగించుకున్నట్లు చూపించారు.

## లింగ నిర్ధారణ అవకాశాలున్న కేంద్రాలపై ప్రత్యేక నిఘా

### పిసిపిఎన్‌డిటి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి
### ఎఆర్‌టి, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలి
### ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు31:** రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించడంతో పాటు, ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే సెంటర్లపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ల పనితీరు, ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై మంత్రి సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గాంధీ హాస్పిటల్, పేట్లబుర్జు హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరును మంత్రి సమీక్షించారు. ఈ రెండు సెంటర్లలో కలిపి ఇప్పటివరకు 39,802 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించామని అధికారులు తెలిపారు. 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు చేసినట్లు మంత్రికి వివరించారు. ఎంతో మంది దంపతులు తమ సంతాన కలను నెరవేర్చుకోవడంలో గాంధీ, పేట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్లు ఉపయోగపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

గాంధీ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సెంటర్‌ను 2024 అక్టోబర్‌లో, పేట్ల బుర్జులోని ఎంజీ ఎం హెచ్‌లో ఐవీఎఫ్ సెంటర్ ను 2024 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ రెండు సెంటర్లు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలను విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు రిజిస్టర్ అయి ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఏఆర్‌టీ, సరోగసి చట్టాల ప్రకారం సెంటర్ల కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. సెంటర్లలో సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, గ్రీవెన్స్ సెల్ తదితర అంశాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో అధికారులు నిర్వహించిన తనిఖీలపై మంత్రి ఆరా తీశారు. ఆయా సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, నిబంధనల ఉల్లంఘనల తీవ్రతను బట్టి చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

నిబంధనలు ఉల్లంఘించిన 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేయగా, 9 సెంటర్ల అనుమతులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే సెంటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ఫర్టిలిటీ సేవల పేరుతో పేషెంట్లపై అనవసర ఆర్థిక భారం మోపకుండా, పారదర్శకతతో సేవలు అందేలా చూడాలని మంత్రి సూచించారు.

## జపాన్ భాషానైపుణ్యంతో చక్కటి ఉపాధి, గౌరవప్రదమైన జీ(వి)తం

### టోక్యోలో తెలంగాణ నర్సులతో మంత్రి వివేక్ వెంకటస్వామి భేటీ

**హైదరాబాద్ ఆగస్టు 31, ప్రభాతవార్త:** జపాన్ భాషా కమ్యూనికేషన్ నైపుణ్యం పెంచుకోవడంతో నర్స్‌వృత్తి కోర్సుకు మంచి ఆదరణ దొరకడమే కాకుండా చక్కటి ఉపాధి గౌరవప్రదమైన జీతం అందుకొంటూ సంతోషమైన జీవితాలు గడుపుతున్నారనీ శక్తి కార్మిక, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం టోక్యోలో తెలంగాణ నుంచి నర్సు వృత్తిలో కొనసాగుతున్న వారితో ఆయన మాట్లాడారు. జపాన్‌లో పనిచేస్తున్న తెలంగాణ నర్సులు ఇక్కడ పనిగంటలకు అనుగుణంగా ఆకర్షణీయమైన జీతం అందు తోందని శక్తి గనుల శాఖ మంత్రి వివేక్‌కు వివరించారు. టామ్‌కామ్ బృందంతో కలిసి టోక్యో వెళ్లిన మంత్రి జపాన్‌లో నర్సుల పని అనుభవాలు, ఉద్యోగ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల క్రితం టామ్‌కామ్ ద్వారా జపాన్‌కు వెళ్లిన తొలి బ్యాచ్‌కు చెందిన నర్సులు తమ పని వాతావరణం, ఉద్యోగంపై ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. తొలి బ్యాచ్‌లో వెళ్లిన వారంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం 30 మంది తెలంగాణ నర్సులు జపాన్‌లో పనిచేస్తున్నారని, జపనీస్ భాష నేర్చుకున్న వారికి జపాన్‌లో మరింత భారీగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఇంకా కొంత మంది మనవాళ్లకు ఇక్కడ ఉపాధి కల్పిస్తామని మీరు కూడా కొత్త వారిని ప్రోత్సహించాలని చెప్పారు. జపాన్ భాష నేర్చుకున్న నర్సులకు అక్కడ భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలి పారు. తెలంగాణ ప్రభుత్వం జర్మన్, జపాన్ భాషల్లో శిక్షణ అందిస్తూ రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోం దన్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో విదేశీ భాషల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు, శిక్షణ పొందిన వారికి విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

## బిజెపి కార్యాలయం ముట్టడి ఉద్రిక్తత

### కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం

**హైదరాబాద్,ఆగస్టు 31,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యాలయంను సోమవారం ముట్టడించారు. బిజెపి కార్యాలయంకు నల్లరంగు పులిమి పార్టీని జెండా, అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేయడంతో ఉద్రిక్తత వాతావర్ణం నెలకొంది. జాతీయ అధ్యక్షుడు ఖర్గేపై బిజెపి పార్టీ వ్యవహరించిన తీరు, విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ఘటనను నిరసిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తూ బిజెపి కార్యాలయం వైపు దూసుకెళ్ళుతు నిరసన చేపట్టారు. బిజెపి మనువాద రాజ్యాంగం అమలు చేయడానికి కులదురహంకారంతో వ్యవహరిస్తోందని జక్కిడిశివచరణ్‌రెడ్డి విమర్శలు చేశారు. అణగారిని వర్గాలపట్ల అమర్యాదగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కార్యాలయంకు నల్లరంగులు పూసి నిరసన తెలిపి ఆఫీస్ ఎదుట బిజెపి పార్టీ జెండాతో పాటు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిరసనను పోలీసులు అడ్డుకుని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డితో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ బిజెపి నిరంకుశ వైఖరికి నిదర్శనం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** దళితులపై వివక్ష, అంటరానితనాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా ఇదేం విధానం ప్రజాస్వామిక స్ఫూర్తికి వెన్నుపోటు పొడవడం కాదా అని రవాణాబిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులపై జరుగుతున్న వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బిజెపి అహంకార, నిరంకుశ వైఖరికి నిదర్శనమని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎదుర్కొన్న అవమానకర పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే, సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించలేరని స్పష్టం చేశారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం, అన్యాయాన్ని ప్రశ్నించిన వారినే నిందితులుగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం ద్వారా నిర్మూలించడం నుంచి ఎస్‌సి, ఎస్టీలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాల రూపకల్పన వరకు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాటం చేసిందని మంత్రి పేర్కొన్నారు. దళితులపై వివక్షను నిర్మూలించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలు ఏమిటో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే అంటరానితనం నిర్మూలన కోసం ఆర్ఎస్ఎస్ చేపట్టిన ఉద్యమాలు, చేసిన పోరాటాలు ఏమిటో కూడా ప్రజలకు వివరించాలని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**రాహుల్‌పై ఎఫ్ఐఆర్ కక్షపూరిత**

**కుట్ర : పిసిసి చీఫ్ మహేశ్**

దళితులపై జరుగుతున్న వివక్ష, అంట రానితనం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బిజెపి కక్షపూరిత రాజకీయ కుట్రకు నిదర్శనమనిటిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎదుర్కొన్న అవ మానకర పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు. దళితులపై వివక్ష, అంటరాని తనాన్ని ప్రశ్నించడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించలేరని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం.. అన్యాయాన్ని ప్రశ్నించిన వారినే నింది తులుగా చిత్రీ కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం ద్వారా నిర్మూలించడం నుంచి ఎస్‌సి, ఎస్‌టి అఘా యిత్యాలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాల రూపకల్పన వరకు సామా జిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

### మొత్తం 3,319 వినతుల స్వీకరణ
### 9,673 మంది అధికారుల హాజరు
### అత్యధికంగా నల్గొండ జిల్లాలో 406 వినతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు31:** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 553 ప్రాంతాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, ఇందులో 552 మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు ఉన్నాయి. అదనంగా సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి నిర్వహించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 3,319 వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,673 మంది అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఒక్కో జిల్లాలో సగటున 107 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా నల్గొండ జిల్లాలో 406 వినతులు స్వీకరించారు. అదే విధంగా మండలాల వారీగా సగటు వినతుల సంఖ్యలో కరీంనగర్ జిల్లా అత్యధికంగా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 16 వినతులు అందాయి. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని వాటికి వేగంగా పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల నుంచి మంచి స్పందనతో పాటు అధికారుల చురుకైన భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

## క్రెడాయ్ ప్రాపర్టీషో విజయవంతం

### 36వేల మంది సందర్శకులు హాజరు





**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో 2026ను 36వేల మంది సందర్శకులు సందర్శించడమే కాకుండా గృహ కొనుగోలు ఒప్పొందాలు చేసుకోవడంతో మూడు రోజులపాటు జరిగిన ప్రాపర్టీ షో విజయవంతంగా ముగిసింది. చివరి రోజున కూడా గృహ కొనుగోలుదారులు డెవలపర్ల మధ్య కొనుగోలు చర్చకొనసాగింది. సందర్శకులు ఒకేచోట ఉత్తమ 'రేరా' ఆమోదం పొందిన ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు, నివాస, వాణిజ్య విభాగాలలోని డెవలపర్లతో సంభాషించారు. రేట్ ఆగదు డిమాండ్ తగ్గదు అనే థీమ్‌తో నిర్వహించబడిన ఈ ప్రాపర్టీ షో, గృహ కొనుగోలుదారులకు ప్రాజెక్టులను పోల్చి చూసుకోవడానికి, అందుబాటులో ఉన్న ఎంపికలను అర్థం చేసుకోవడానికి సరైన పద్ధతిలో ఆస్తి నిర్ణయాలు తీసుకోవడానికి ఒక వేదికను అందించింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను తీర్చి దిద్దుతున్న పోకడలు, అవకాశాలపై చర్చించ డానికి ఈ ప్రాపర్టీ షో పరిశ్రమ భాగస్వా ములను, ఆర్థిక సంస్థలను కూడా ఒకచోట చేర్చింది. మాజిక్ బ్రిక్ సిఎంవో ప్రసన్నకుమార్, సర్వేష్ సింగ్, జి.శ్రవణ్ కుమార్, కె రహజ, రొమిళ్ళ దూబె, కె క్రాంతి కిరణ్ రెడ్డి, క్రెడాయి ప్రెసిడెంట్ జయదీప్‌రెడ్డి లోకేష్ కజ్జా, జగన్నథరావులు మాట్లాడుతూ ఇది ప్రత్యేక నైపుణ్యం గల ప్రతిభా వంతులను ఆకర్షిస్తూ, రియల్ ఎస్టేట్ డిమాం డ్‌కు బలమైన, ఉపాధి ఆధారిత పునాదిని వేస్తోందనీఅన్నారు. మార్కెట్ గణాంకాలు ఈ ఊపును మరింత బలపరుస్తున్నాయి. 2026 ప్రథమార్థం నాటికి ఆఫీస్ లీజింగ్ రికార్డు స్థాయిలో 75 లక్షల చదరపు అడుగులకు చేరుకుందనీ వివ రించారు. గతేడాదితో పోలిస్తే ఇది 29 వృద్ధిని నమోదు చేసిందని అన్నారు.

ఇందులో గల్ఫ్ సహకార మండలి దేశాల వాటా 45 . బలమైన ప్రీమియం డిమాండ్, పెరుగుతున్న ఎన్నారైల భాగస్వామ్యం, మరియు కఠినమవుతున్న అద్దె మార్కెట్ వంటివి నగరం యొక్క పెరుగుతున్న లోతును మరింతగా ప్రతిబింబిస్తున్నాయనీ తెలిపారు మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉండేలా చూడటమే ఇప్పుడున్న అవకాశం. హైదరాబాద్ తదుపరి దశ వృద్ధి కేవలం నగరం ఎంత వేగంగా ఎదుగుతుందనే దానిపైనే కాకుండా, ఎంత సమ్మిళితంగా, సుస్థిరంగా ఆలోచనాత్మకంగా అభివృద్ధి చెందుతుందనే దానిపై కూడా ఆధారపడి ఉంటుందనీ అన్నారు.

## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

### సోషల్ మీడియా వేదికగా ప్రకటన



**మియామి, ఆగస్టు 31:** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత ప్రతిభావంతుడైన క్రీడాకారుల్లో ఒకరైన లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు గుడ్‌బై చెప్పారు. తన రిటైర్మెంట్‌ను సోమవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. స్పానిష్ భాషలో చేతితో రాసిన నోట్‌బుక్‌లోని ఒక ఎంట్రీని చూపిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్‌లో, 39 ఏళ్ల వయసులో తాను అర్జెంటీనా జాతీయ జట్టు నుండి రిటైర్ అవుతున్నట్లు మెస్సీ ధ్రువీకరించారు. ఈ ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది. సుదీర్ఘకాలం పాటు అర్జెంటీనా జట్టుకు ప్రతినిధిగా వ్యవహరించిన మెస్సీ, తన అద్భుతమైన ఆటతీరుతో మైదానంలో ఎన్నో మరుపురాని ఘట్టాలను ఆవిష్కరించారు. అంతర్జాతీయ స్థాయిలో అర్జెంటీనా తరఫున ఏకంగా 207 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించిన లియోనెల్ మెస్సీ, మొత్తం 125 గోల్స్ సాధించి అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా సంచలన రికార్డు నెలకొల్పారు. సుదీర్ఘ పోరాటం తర్వాత అర్జెంటీనాకు ఖతార్ వేదికగా జరిగిన 2022 ఫిఫా ప్రపంచ కప్‌ను అందించడంలో మెస్సీ అత్యంత కీలక పాత్ర పోషించారు. ప్రపంచ కప్‌తో పాటు కోపా అమెరికా టోర్నమెంట్లలో కూడా జట్టును విజయతీరాలకు చేర్చి దశాబ్దాల నిరీక్షణకు తెరదించారు.

## తమిళనాడు సిఎం విజయ్‌తో భువనగిరి ఎంపి చామల కిరణ్‌రెడ్డి భేటీ

**హైదరాబాద్, ఆగస్టు31,ప్రభాతవార్త:** తెలంగాణ తమిళనాడు రాష్ట్రాల మధ్య అభివృద్ధి సంక్షేమం వంటి అంశాలపై పరస్పర సహకారం చేసుకోవాలని తమిళనాడు సిఎం విజయ్‌ను ఎంపి చామలకిరణ్‌కుమార్ రెడ్డి అభ్యర్థించారు. సోమవారం చెన్నైలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టడీ టూర్ లో ఆయన పాల్గొన్నారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత తమిళనాడు సిఎం విజయ్ తో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించి తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అంశాలపై సిఎం విజయ్ చర్చలు చేశారు.

## ఆర్మేనియా ప్రధానితో మోడీ భేటీ



**బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్), ఆగస్టు 31:** భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సోమవారం ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థిక, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమ ఆసియాలో పరిస్థితులతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఆర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోడీ తెలిపారు.

## అగ్రిస్టాక్‌లో రాష్ట్రానికి రూ.175 కోట్ల ప్రోత్సాహం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అగ్రిస్టాక్ ఆధారిత డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ అమలులో తెలంగాణ రాష్ట్రం మరో కీలక మైలురాయిని సాధించిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో రైతులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు చేపట్టిన అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థ అమలులో తెలంగాణకు రూ.175 కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జారీ చేసిన లేఖలో రాష్ట్రం సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి, నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను పూర్తి చేసిందని పేర్కొన్నట్లు తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు ప్రత్యేక సహాయ పథకం కింద ఈ ప్రోత్సాహకం అందనుందన్నారు.

## ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

### అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలి

### సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమ్మార్క విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని సూచించారు. డిసెంబర్ 7 నుండి మూడు రోజుల పాటు నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సోమవారం ఐటీ, పరిశ్రమలమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్ల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలన్నారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్, ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్, మీడియా కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎంఓయూ తదితర కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమ్మిట్‌కు సంబంధించి ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వివరించేలా కార్యక్రమ రూపకల్పన ఉండాలన్నారు. సమ్మిట్‌కు అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి, రెండో వారంలో ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటి సిఎండి శశాంక, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీజీ.. చొరవ చూపండి

### అమెరికాతో వివాదం పరిష్కరించండి

### ప్రధాని మోడీకి ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అభ్యర్థన

### శాంతి స్థాపనకు కృషి చేయాలని వినతి

### షాంఘై సదస్సు వేదికగా భేటీ

### యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు



**బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్), ఆగస్టు 31:** అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్-అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోడీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోడీని కోరారు.

ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోడీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తు చేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోడీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

హార్మూజ్ జలసంధిలోని లారక్ ద్వీపంలో ఇరాన్ లాంచర్లపై అమెరికా దాడి చేయడం, దానికి ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రవాణా, సముద్రయాన రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

# ఇందిరమ్మ టవర్స్‌తో 7,340 కుటుంబాలకు ఆసరా

### ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, ఎల్‌బినగర్, గోషామహల్‌లో దరఖాస్తులకు సెప్టెంబరు 3 వరకు అవకాశం

### తప్పుగా నియోజకవర్గాన్ని నమోదు చేసినవారు ఆన్‌లైన్‌లో సరిచేసుకునే సదుపాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు31:** ఔటర్‌రింగ్‌రోడ్డు పరిధిలోని అల్పాదాయ వర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్' పథకంలో తొలి విడతగా 7,340 ఫ్లాట్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లాటరీ ప్రక్రియ పూర్తయింది. నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 4 రోజుల పాటు నిర్వహించిన లాటరీ ప్రక్రియ సోమవారం ముగిసింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగస్టు 28న లాటరీ ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం మినహా మిగిలిన 15 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఫ్లాట్ల చొప్పున లబ్ధిదారుల ఎంపిక కోసం లాటరీ నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో తొలి విడతలో 140 ఫ్లాట్లు మాత్రమే నిర్మిస్తున్నందున అక్కడ 140 ఫ్లాట్లకు లాటరీ నిర్వహించారు. మొత్తంగా 7,340 ఫ్లాట్లకు లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ప్రజలు తమ జీవనోపాధి, పిల్లల చదువు, ఉద్యోగాలను వదిలి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా, ఏ నియోజకవర్గంలో నివసిస్తున్న వారికి సాధ్యమైనంత వరకు అదే నియోజకవర్గ పరిధిలో ఇల్లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టులను చేపట్టింది.

తెలంగాణ హౌసింగ్ బోర్డు చేపట్టిన డిమాండ్ సర్వేలో ప్రతిపాదించిన 7,340 ఫ్లాట్లకు 60,720 దరఖాస్తులు వచ్చాయి. ప్రాథమిక పరిశీలన అనంతరం అర్హత కలిగిన దరఖాస్తుదారులతో, ఎలాంటి రాజకీయ లేదా ఇతర ప్రమేయానికి తావులేకుండా, పూర్తి పారదర్శకంగా, బహిరంగంగా లాటరీ నిర్వహించారు.

ఆగస్టు 28 నుంచి 31 వరకు ఆయా నియోజకవర్గాల్లోనే దరఖాస్తుదారులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. లాటరీ నిర్వహించిన విధానంపై దరఖాస్తుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పండుగల సీజన్‌కు ముందు లాటరీలో ఎంపికైన వేలాది అల్పాదాయ కుటుంబాల్లో ఈ ప్రక్రియ కొత్త ఆనందాన్ని నింపింది. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ప్రస్తుతం 16 నియోజకవర్గాల్లో తొలి విడత లాటరీ ప్రక్రియ పూర్తయింది. మరో నాలుగు నియోజకవర్గాలైన ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, ఎల్‌బీ నగర్, గోషామహల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ కోసం ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 3 చివరి తేదీ. అర్హులైన వారు ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని తెలంగాణ హౌసింగ్ బోర్డు కోరింది. మిగిలిన నియోజకవర్గాల్లో కూడా అనువైన స్థలాలను గుర్తించి, దశలవారీగా నోటిఫికేషన్లు జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరు తమ నివాస నియోజకవర్గానికి బదులుగా పొరపాటున వేరే నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు హౌసింగ్ బోర్డు దృష్టికి వచ్చింది. అలాంటి దరఖాస్తుదారులకు ఇబ్బంది కలగకుండా తాము దరఖాస్తులో నమోదు చేసిన నియోజకవర్గాన్ని మార్చుకునే సదుపాయాన్ని తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. పొరపాటున తప్పు నియోజకవర్గాన్ని ఎంపిక చేసిన దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను సరిచేసుకోవాలని బోర్డు సూచించింది. లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుల వివరాలను తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. ఎంపికైన వారిలో ఎవరైనా పథకం అర్హత నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ప్రజల వద్ద సమాచారం ఉంటే, వారిపై అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అభ్యంతరాలను కూడా హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే సమర్పించవచ్చని తెలిపారు. లాటరీలో ఎంపికైన ప్రతి దరఖాస్తుదారుడి వివరాలను పరిశీలించేందుకు అధికారుల బృందాలు క్షేత్రస్థాయి ధృవీకరణ చేపడతా యని తెలిపారు. కుటుంబ వివరాలు, నివాసం, ఆదా యం, ఇంటి యాజమాన్యం తదితర అర్హత ప్రమాణా లను పరిశీలించిన అనంతరం మాత్రమే కేటాయింపును ఖరారు చేస్తామని చెప్పారు. లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే అధికారులకు అవసరమైన సమాచారం, పత్రాలు అందించి సహకరించాలని ఆయన కోరారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకుని లాటరీలో ఎంపిక కాని వారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇది ప్రారంభం మాత్రమే. అర్హులైన అల్పాదాయ కుటుంబాలకు సొంతింటిని అందించే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. రాబోయే ప్రాజెక్టుల్లో మరిన్ని కుటుంబాలకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

## కళాకారుడుగా పుట్టడం ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో

### ప్రముఖ సినీనటుడు మురళీమోహన్

### జానపద కళాకారులను ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలి : డా. కె.వి.రమణాచారి

### అంగరంగ వైభవంగా ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం




రాష్ట్ర జానపద కళాకారుల సంక్షేమానికి సంఘ అధ్యక్ష కార్యదర్శులకు రెండున్నర లక్షల చెక్కును అందజేస్తున్న ఎం.మురళీమోహన్, రమణాచారి, కొండలరావు, లంక తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 31, ప్రభాతవార్త :** పుట్టిన ప్రతీఒక్కరిలో ఎంత ఆసక్తి అభిరుచి ఉన్నా కళాకారుడు కాలేడని, కళాకారుడు కావడం ఏజన్మలోనో చేసుకున్న పుణ్యమేనని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ సినీనటుడు, మాజీ ఎంపి డా. మాగంటి మురళీమోహన్ అన్నారు. నేడు ఇక్కడ కళాకారులు ప్రదర్శించిన జానపద కళాప్రదర్శనలు ఒళ్లు పులకరింపుజేశాయన్నారు. అయితే కళలకే వెన్నెముక, వన్నెతెచ్చిన జానపద కళాకారుల జీవితాలు, ఆర్థిక స్థితిగతులు నేటికీ చాలా అధ్వాన్నంగా ఉండడం బాధాకరమని, తనవంతు బాధ్యతగా ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవాన్ని పురస్కారించుకుని జానపద కళాకారుల సంక్షేమానికి సంఘానికి 5లక్షల విరాళాన్ని ప్రకటించి మొదటి విడతగా రెండున్నర లక్షల ఆర్థిక సహాయ సంబంధిత చెక్కును వేదిక సమక్షంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు వంగా శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్యలకు అందజేసి తన ధాతృత్వాన్ని, జానపద కళాకారులపట్ల ప్రేమాభిమానాన్ని చాటుకున్నారు. జానపద కళాకారులకు మున్ముందూ తన పూర్తి సహాయసహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం, యువకళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన, సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరిగిన ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ సినీనటుడు, మాజీ ఎంపి డా. మాగంటి మురళీమోహన్ విశిష్ట అతిథి డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆత్మీయ అతిథులు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, వంగా శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రసంగించారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో ప్రభుత్వంతోపాటు దాతలూ జానపద కళాకారులకు ఆదుకోవడానికి ముందుకురావాలని సూచించారు. స్పందనగా నా కంఠంలో ప్రాణమున్నంత వరకు జానపద కళాకారులకు అండదండగా ఉంటానని సారిపల్లి కొండలరావు హామీనిచ్చారు. చివరిగా ఎం.మురళీ మోహన్‌ను ఘనంగా సత్కరించారు. సభకుముందు రాష్ట్రవ్యాప్తంగా హాజరైన జానపద కళాకారులు తమతమ వివిధ జానపద కళాప్రదర్శనలు కావించి వేదికను హోరెత్తించి ఉర్రూతలూగించారు.

## కృష్ణా జలాల దోపిడీపై సిఎం మౌనం: హరీశ్‌రావు ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు31:** నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపి ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సిఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు ఎక్స్(ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఎపి ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని పేర్కొన్నారు. ఒకవైపు కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఎపి నిబంధనలు ఉల్లంఘిస్తూ, యదేచ్ఛగా నీటిని తరలిస్తోందని విమర్శించారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ అని వ్యాఖ్యానించారు. తెలంగాణ వాటా నీటిని ఎపి తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు..? అని ప్రశ్నించారు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది అని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సిఎం రేవంత్ రెడ్డి.. ఎపికి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు..? అని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటనే స్పందించి, కెఆర్ఎంబిపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని హరీష్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# తెలంగాణపై కేంద్రం ప్రభుత్వం దృష్టి

### మూడు బుల్లెట్ రైళ్లు తెలంగాణకు కేటాయింపు

### యేటా రూ.5,454 కోట్లు ఖర్చు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్ పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 31, ప్రభాతవార్త :** తెలంగాణలో రైల్వే నెట్ వర్క్ అభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని, గత 10 ఏళ్లుగా రైల్వే స్టేషన్లకు సంబంధించి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్, గద్వాల మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వేస్టేషన్లో ఆధునికరణ పనులను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి పరిశీలించారు. తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నాం. ఈ రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. తెలంగాణలో నూతన రైళ్లు, నూతన రైల్వే ట్రాకులు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్ పనులను మోదీ ప్రభుత్వం చేస్తోందన్నారు. సికిందరా బాద్ నుంచి మహబూబ్ నగర్ వరకు లైన్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయని, ఇక్కడి నుంచి కర్నూలు వరకు కూడా డబ్లింగ్ పనులు పూర్తికానున్నాయన్నారు. అలాగే దేవరకద్ర నుంచి కృష్ణ వరకు నూతన రైల్వే లైన్ అభివృద్ధి చేశామన్నారు. తెలంగాణలో 5 వందేభారత్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ లోని షాద్ నగర్, జడ్చర్ల, గద్వాల నగరాల్లో రైల్వే స్టేషన్లను అత్యద్భుతంగా తీర్చి దిద్దుతున్నామని వివరించారు. తెలంగాణలోని 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని , రైల్వేల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేసి, రైల్వే స్టేషన్లను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ యేడాది తెలంగాణ కోసం కేంద్రప్రభుత్వం సరాసరిగా రూ.5,454 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 7బుల్లెట్ రైళ్లను ప్రకటించగా, అందులో 3రైళ్లు తెలంగాణకు ఇచ్చారు. దీన్ని బట్టే నరేంద్రమోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిపై దృష్టి సారించిందనేది అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో

## 17 రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు డిపిఆర్‌లు సమర్పణ

### దక్షిణ మధ్య రైల్వే జిఎంతో సమావేశమైన సిఎస్ సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు31:** రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్ తదితర ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ, వివిధ శాఖల నుంచి అవసరమైన పరిపాలనా అనుమతులు, రైల్వే ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. రైల్వే కనెక్టివిటీ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించి, రైల్వే ప్రాజెక్టుల పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌లను రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. రైల్వే అండర్‌పాస్‌లు, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, వివిధ రైల్వే మార్గాల డబ్లింగ్ పనులు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రజా రవాణా సదుపాయాల మెరుగుదల తదితర సుమారు 21 అంశాలపై సమావేశంలో సమీక్షించారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను గుర్తించాలని సీఎస్ ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు తగు ప్రణాళికలను సిద్ధం చేయాలని, ప్రధానంగా మున్సిపల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, రెవెన్యూ, విద్యుత్, రోడ్లుభవనాల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## కిర్గిజ్ అధ్యక్షుడితో ప్రధాని మోడీ భేటీ

### ద్వైపాక్షిక సంబంధాలపై ఇరు దేశాధినేతలు సమాలోచనలు

### వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ఊపునిచ్చే మార్గాలపై చర్చ



**బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్), ఆగస్టు 31:** బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా కిర్గిజ్‌స్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్‌తో తనకు 'చాలా ఫలవంతమైన సమావేశం' జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఈ సమావేశంలో ఇద్దరు నాయకులు పలు కీలకరంగాల్లో మరింత సహకారంతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ఊపునిచ్చే మార్గాలపై చర్చించారు. "ఈరోజు బిష్కెక్‌లో కిర్గిజ్ రిపబ్లిక్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్‌తో చాలా ఫలవంతమైన సమావేశం జరిగింది. ఆయనకు, కిర్గిజ్ రిపబ్లిక్ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశాను. వారి దేశం విజయవంతంగా ఎస్‌సిఒ ఛైర్మన్ షిప్‌ను చేపట్టినందుకు కూడా అభినందించాను' అని ప్రధాని మోడీ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. "ఆరోగ్య సంరక్షణ, ఫార్మాస్యూటికల్స్, ఐటీ, ఖనిజాలు, వ్యవసాయం, డిజిటల్ టెక్నాలజీలు, మౌలిక సదుపాయాల రంగాలలో మరింత సహకారం ద్వారా మన వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ఊపునిచ్చేలా చర్చించాం. రక్షణ, భద్రతా సంబంధాలను విస్తరించడం. క్రీడలు, పర్యాటకంవంటి రంగాలద్వారా ప్రజలమధ్య బలమైన సంబంధాలను పెంపొందించడం' తదితర అంశాలపై చర్చించినట్లు వివరించారు.

# యేడాదిలో ఆత్మకూరుకు కొత్త రూపు

- ఆత్మకూరు అభివృద్ధికి రూ.30 నుంచి రూ.40 కోట్లతో ప్రణాళిక
- 20 ఎకరాల్లో స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు

**ఆత్మకూరు (నెల్లూరు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** మార్చి నాటికి సుమారు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు ఖర్చు చేసి ఆత్మకూరు పట్టణ సమగ్ర అభివృద్ధికి కొత్త రూపు తీసుకురావడమే తమ లక్ష్యయమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరు బైపాస్ రోడ్డు పనులను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సుమారు 12 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆత్మకూరు శాసనసభ్యుడిగా పనిచేసిన సమయంలో ఆత్మకూరు నెల్లూరు పాలెం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ రహదారి మరమ్మతులకు రూ.40 లక్షలు విడుదల చేసి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే ఆత్మకూరు నుంచి సోమశిల వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరగా, ఆయన రూ.5 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సంఘం-కలిగిరి-వాసనాపురం మార్గంలో మధ్యలో ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు బైపాస్ రోడ్డు ప్రారంభోత్సవం, అభయాంజనేయ స్వామి ఆలయ భవనానికి శంకుస్థాపన, టిడ్కో కాలనీలో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలను త్వరలోనే నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వివిధ పద్దుల కింద మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీకి వివిధ పద్దుల కింద ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, పార్కులు, వీధి దీపాల అభివృద్ధితో పాటు తాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆత్మకూరు పట్టణానికి సోమశిల నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు ఇప్పటికే ఉన్న పైపులైన్లకు అదనంగా మరో నూతన పైపులైన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రతిపాదనలను మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లి నూతన పైపులైన్ మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. నూతన పైపులైన్ మంజూరైతే ఆత్మకూరు పట్టణానికి తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పెద్ద ఎత్తున నూతన రహదారులు మంజూరు చేశామని, ఈ రహదారులన్నీ పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు. రైతుల భూములకు మంచి ధరలు లభించడంతో పాటు రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. వాసిలి-వెంకటరావుపల్లి, నాగులపాడు రహదారులు కూడా మంజూరయ్యాయని వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలో సుమారు 20 ఎకరాల్లో స్టేడియం నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ స్టేడియం గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఐటీడీఏ శిక్షణ కళాశాలకు మార్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త భవనాలు నిర్మించి బీసీ గురుకుల పాఠశాల తరగతులను ఆ భవనాల్లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఇందుకు సుమారు ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నూతన రహదారులు, డ్రైన్లు, పార్కుల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, స్టేడియం, ఆధ్యాత్మిక ఆలయాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో ఆత్మకూరు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతినిత్యం కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## పరిశ్రమలకు సకాలంలో అనుమతులు, రాయితీలు అందించాలి



**నెల్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త - కలెక్టరేట్:** జిల్లాలో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులు, రాయితీలను సకాలంలో అందజేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన వెబెక్స్ ద్వారా జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మరియు ఎగుమతుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పన, సింగిల్ డెస్క్ ద్వారా అనుమతులు, పరిశ్రమలకు అందిస్తున్న రాయితీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ బాబు జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటికే 11 మెగా పరిశ్రమలు రూ.43,650 కోట్ల పెట్టుబడితో 16,380 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. అలాగే 45 భారీ పరిశ్రమలు రూ.5,478 కోట్ల పెట్టుబడితో 9,429 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని వెల్లడించారు. అదే విధంగా 36,599 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) రూ.7,164 కోట్ల పెట్టుబడితో 3.22 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. ఇంకా 35 భారీ పరిశ్రమలు రూ.69,302 కోట్ల పెట్టుబడితో 97,836 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో వివిధ దశల్లో అమలులో ఉన్నాయని జనరల్ మేనేజర్ శ్రీధర్ బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మొత్తం 386 దరఖాస్తులు అందగా, వాటిలో 365 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 19 దరఖాస్తులు వివిధ శాఖల పరిశీలనలో ఉన్నాయని, వాటికి వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల రాయితీలకు సంబంధించి 14 క్లెయిమ్‌లకు రూ.1,56,42,062 రాయితీలు మంజూరు చేసినట్లు జనరల్ మేనేజర్ వివరించారు. ఇందులో షెడ్యూల్డు కులాలకు చెందిన 6 దరఖాస్తులకు రూ.1,45,65,418, వెనుకబడిన వర్గాలకు చెందిన 5 దరఖాస్తులకు రూ.4,27,282, జనరల్ వర్గాలకు చెందిన 3 పరిశ్రమలకు రూ.6,49,362 రాయితీలు మంజూరు చేసినట్లు తెలిపారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని మహాధర్నా

**సైఫాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** సైదాబాద్‌లో నూతనంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి ప్రభుత్వం ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, తొలి మహిళా పార్లమెంటేరియన్, బీసీ సామాజిక వర్గానికి చెందిన సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. బీసీ జెఏసి ఆధ్వర్యంలో సోమవారం గన్‌పార్కు వద్ద నిర్వహించిన 'మహాధర్నా'లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , బీసీ జెఏసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఆ బ్రిడ్జికి ఆమె పేరు పెట్టడానికి అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక మంది నాయకుల పేర్లను వివిధ సంస్థలకు పెట్టాయని, కాని ఇప్పటి వరకు లక్ష్మీబాయి పేరును ఎక్కడ పెట్టలేదని, స్టీల్ బ్రిడ్జి పెట్టి సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం జరిగిందని, త్వరలో ప్రజా ప్రతినిధులందరిని కలుపుకుని ఆమె పేరును పెట్టాల్సిన ఆవశ్యకతను సిఎం దృష్టికి తీసుకువెళతామన్నారు. అలాగే ఆమె విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు గుజ్జ కృష్ణ, శ్యాం, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగొద్దన్న భర్త
## పురుగుల మందు సేవించి భార్య ఆత్మహత్య

**మిర్యాలగూడ, ఆగస్టు 31 ప్రభాత వార్త:** మద్యం తాగొద్దని భర్త వారించగా, మనస్తాపానికి గురైన భార్య పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటన సోమవారం మిర్యాలగూడ మండల పరిధిలో వెలుగు చూసింది. గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.... మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం దుర్గానగర్ పరిధిలో కోమేర గణేష్, సైదమ్మ దంపతులు తమ సంతానంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇటీవల సైదమ్మ మద్యానికి బానిసగా మారి తరచూ మద్యం సేవిస్తుంది. ఆదివారం కూడా మద్యం సేవించగా విసిగిపోయిన భర్త గణేష్ చిన్న పిల్లలు ఉన్నారు, వారి భవిష్యత్ ఇబ్బందిగా మారుద్ది మద్యం తాగొద్దని వారించి పని మీద బయటకు వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన సైదమ్మ పురుగుల మందు మంచి నీళ్లలో కలుపుకుని సేవించి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన ఆమె మామ కొమేర పరమేష్, కొడుకు సాయితేజతో కలిసి ఆటోలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సైదమ్మ మృతి చెందింది. మృతురాలి తల్లి పిట్టల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య పేర్కొన్నారు.

## యాదాద్రి థర్మల్ విద్యుత్ టెండర్లు ఖరారు

**హైదరాబాద్, అగస్టు 31, ప్రభాతవార్త:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని బొగ్గు, బూడిద ప్లాంట్ల నిర్వహణను ప్రైవేటీకరణకు తెలంగాణ విద్యుత్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో) సిద్ధమైంది. థర్మల్ కేంద్రంలోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణ మొత్తం టెండర్లు ఖరారు చేసిన ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఆయా విభాగాల నిర్వహణ కోసం జెన్‌కో టెండర్లను ఆహ్వానించడంతో మూడు సంస్థలు బిడ్లు వేశాయి. వీటిలో పవర్‌మెక్ సంస్థ ఎల్1గా నిలిచింది. మూడేండ్ల కాలానికి రూ.279 కోట్లతో టెండర్లు దాఖలు చేసిన పవర్‌మెక్ సంస్థకు ఖరారు చేసినట్టు తెలియవచ్చింది. దీంతో ఇదే సంస్థలకు త్వరలో ఆయా విభాగాలను అప్పగించనుంది. మరోపక్క యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని యాష్ హ్యాండ్లింగ్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు జెన్‌కో టెండర్లు ఆహ్వానించినప్పటి నుండి ౖవిద్యుత్తు ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇందులో భాగంగా వివిధ దశల్లో ఆందోళనలు చేస్తున్నాయి. కాగా విద్యుత్తు సమస్యతో సతమతమవుతున్న తెలంగాణను మిగులు విద్యుత్తు ర్ఠాంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటైన యాదాద్రి పవర్‌ప్లాంట్ (వైటీపీఎస్)లోని వివిధ విభాగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు జెన్కో గట్టిపట్టుదలలో ఉంది. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని స్టేజ్1, స్టేజ్2 యూనిట్లకు చెందిన కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ల ఆపరేషన్, మెయింటెనెన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులకు 3 సంవత్సరాలకు గాను జెన్కో ఇటీవల టెండర్లను పిలిచింది. ఎస్టిమేషన్ కాంట్రాక్టు విలువ రూ.250 కోట్లుగా పేర్కొన్నది. ఇక ఈ పవర్ ప్లాంట్‌లోని నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటికీ అందుకు అవసరమయ్యే ఉద్యోగులను ఇప్పటి వరకూ నియమించనే లేదు. 2020లో పాల్వంచ నుంచి 400 మంది, రామగుండం నుంచి 70 మందిని ఇక్కడ పనిచేసేందుకు బదిలీపై రప్పించారు. వీరితోపాటు స్థానికులైన 445 మందిని ఉద్యోగాల్లోకి తీసుకొన్నారు. అయితే వీరికి అదనంగా మరో 800 మంది ఉద్యోగుల అవసరం ఉన్నది. ఇదే సమయంలో యష్, కోల్ ప్లాంట్ల ప్రైవేటీకరణ నిమిత్తం వచ్చిన టెండర్లలో ఎ1గా నిలిచిన సంస్థకు ఖరారు చేసిన జెన్కో దానికే అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

## బెంగాల్‌కు బిగ్ వార్నింగ్

- తూర్పు హిమాలయాల్లో వరుస విపత్తుల ముప్పు
- భూకంపంతో కొండచరియలు, వరదలు సంభవించే ప్రమాదం
- ఐసిఐఎంఒడి శాస్త్రవేత్తల హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** నేపాల్-టిబెట్ సరిహద్దులో ఇటీవల సంభవించిన భారీ వరదలు తూర్పు హిమాలయాలపై మరోసారి ఆందోళన పెంచాయి. అక్కడ జరిగిన విపత్తు బెంగాల్‌ను నేరుగా ప్రభావితం చేయకపోయినా హిమాలయాల్లో ఒక విపత్తు మరో భారీ ప్రమాదానికి దారితీసే ప్రమాదాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు. భూకంపం, కొండచరియలు, మంచు విరిగిపడటం, భారీ వర్షాలు, హిమ సరస్సులు అకస్మాత్తుగా ఉప్పొంగడం, ఇవన్నీ పరస్పరం ప్రభావితం చేసుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు కొండచరియలు నదిని అడ్డుకుంటే తాత్కాలిక సరస్సు ఏర్పడొచ్చు. ఆ అడ్డంకి తెగితే ఒక్కసారిగా భారీ వరద దిగువ ప్రాంతాలకు దూసుకెళ్లొచ్చు. ఇలాంటి పరిణామాలను 'క్యాస్కేడింగ్ హజార్డ్స్'గా పిలుస్తారు.డార్జిలింగ్ ప్రాంతం కూడా భౌగోళికంగా సున్నితమైన హిమాలయ వ్యవస్థలోనే ఉంది. నిటారైన కొండలు, భారీ వర్షాలు, కొండచరియలు, భూకంప ముప్పు అక్కడి ప్రమాదాలను పెంచుతున్నాయి. 2025 అక్టోబరులో కేవలం 12 గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 300 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురవడంతో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 24 మంది మృతి చెందినట్లు 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' అంచనా వేసింది. డార్జిలింగ్ సెస్మిక్ జోన్4లో ఉంది. దీంతో భారీ భూకంపం సంభవిస్తే ప్రకంపనలతో పాటు కొండచరియలు, రాళ్లు విరిగిపడటం, నదులకు అడ్డంకులు ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. 2023లో సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగిన ఘటన ఈ ప్రమాదాన్ని కళ్లకు కట్టింది. భారీ నీటి ప్రవాహం తీస్తా నదిలోకి దూసుకెళ్లి వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు తీవ్ర నష్టం కలిగించింది. ఆ వరద ప్రభావం బెంగాల్ వరకు కనిపించింది. ఐసిఐఎంఒడి ప్రకారం తూర్పు హిమాలయాల్లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెనల ముప్పు 2050 ప్రాంతంలో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మంచు, శాశ్వతంగా గడ్డకట్టిన నేలల్లో మార్పులు రావడం కొండ ప్రాంతాల స్థిరత్వాన్ని ప్రభావితం చేయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# జిఓ 99ను రద్దు చేయండి

- సచివాలయం ముట్టడికి మాలల యత్నం
- పలువురు నాయకుల అరెస్టు



**సైఫాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రోస్టర్‌ను సవరిచాలని, జివో నెంబరు 99ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం 'చలో సెక్రటేరియట్ ముట్టిడి'కి వచ్చిన ఆనేక మంది మాలలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఇచ్చిన పిలువు మేరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాలలు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని నినదించారు. సచివాలయాన్ని ముట్టడించిన మాలలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. అరెస్టుల సందర్భంగా పోలీసులకు, మాలలకు మధ్య వాగ్వివాదం, తొక్కిసలాట జరిగింది. ఈ సందర్భంగా మాల మహానాడు అధికార ప్రతినిధి దార సత్యం తీవ్రంగా గాయపడగా, పిల్లి సుధాకర్ అస్వస్థతకు గురైనారు. వారిని హాస్పటల్‌కు తరలించారు. అంతకు ముందు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ మాలల సెక్రటేరియట్ ముట్టడిని పురస్కరించుకుని వస్తుండగా పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టుల పరంపర కొనసాగించారని ఆరోపించారు. ఉదయం నుంచి గ్రూపులు, గ్రూపులుగా పోలీసులు అరెస్టుల పరపర కొనసాగిస్తూ పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తున్నారని చెప్పారు. రోస్టర్ పద్ధతి ద్వారా మాలలకు తీరని అన్యాయం జరుగుతున్నదని, విదా , ఉద్యోగ రంగాలలో ఉనికే లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జివో నెంబరు 99ని రద్దు చేసి మాల గ్రూప్-3లోని 26 కులాలకు న్యాయం చేయాలని, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి మాలలపై కక్ష పెంచుకుని వ్యవహరిస్తున్నారని విద్యా, ఉద్యోగ రంగాలలో పూర్తిగా దూరం చేస్తున్నారని విమర్శించారు. మాలలపై పోలీసులు అమానుషంగా దాడి చేసి గాయపరిచారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు నేడు మాలలపైన జరిగిన దాడులు హేయమైన చర్యలని దీనికి సిఎం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోలీసుల దాడులు, అరెస్టులను వ్యతిరేకిస్తూ మాలలు అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రోస్టర్‌ను సవరించకపోతే ప్రభుత్వంతో మాలలు యుద్ధం చేస్తారని సుధాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అంజయ్య, కనకరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## తీరప్రాంత భద్రతను మరింత పటిష్టం చేయాలి

- తీరప్రాంతంలో నిరంతర నిఘా, క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని ఆదేశం



**నెల్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త - కలెక్టరేట్:** నెల్లూరు జిల్లాలో తీరప్రాంత భద్రతను మరింత పటిష్టం చేసి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని తన ఛాంబర్ నందు జిల్లా స్థాయి తీర భద్రతా కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో అమలులో ఉన్న తీర భద్రతా ఏర్పాట్లు, తీరప్రాంత నిఘా, గస్తీ నిర్వహణ, మత్స్యకారుల పడవల గుర్తింపు, ధృవీకరణ తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తీరప్రాంతంలో నిరంతర నిఘా, సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగించాలని, క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద కదలికలు లేదా కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం లభించిన వెంటనే సంబంధిత శాఖలు, భద్రతా సంస్థలతో పరస్పరం చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకోవాలన్నారు. మత్స్యకారుల పడవల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియను పటిష్టంగా అమలు చేయడంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి పడవలు అక్రమంగా జిల్లాలోకి ప్రవేశించకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. తీరప్రాంతంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం లేకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తీర భద్రతకు సంబంధించిన వివిధ శాఖలు, అమలు సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని, పరస్పరం సమాచారాన్ని వేగంగా పంచుకుంటూ సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలపై అవసరమైన తదుపరి చర్యలు చేపట్టి, తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్ శాఖ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, మత్స్యశాఖ, డీడబ్ల్యుఎంఏ, పంచాయతీరాజ్ శాఖ, కస్టమ్స్ శాఖ, కృష్ణపట్నం పోర్ట్, ఇంటెలిజెన్స్ బ్యూరో, స్టేట్ పోర్ట్స్ శాఖ, ఇండియన్ కోస్ట్ గార్డ్ తదితర శాఖలకు చెందిన అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు

# ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్‌లోకి సింగరేణి

### సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్‌తో ఆదేశ ప్రతినిధి బృందం భేటీ

**హైదరాబాద్, అగస్టు 31, ప్రభాతవార్త:** కీలక ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఆస్ట్రేలియా దేశంలో కలిసి పనిచేయడానికి ముందుకురావాలని ఆ దేశ ప్రముఖ పరిశోధన సంస్థ మోనాష్ యూని వర్సిటీ సింగరేణిని ఆహ్వానించింది. మోనాష్‌యూనివర్సిటీ ప్రతినిధి బృందం సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి తో సమావేశమై ఆస్ట్రేలియా దేశంలో క్రిటికల్ మి నరల్స్ రంగంలో గల అవకాశాలను వివరిం చింది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం క్రిటికల్ మినరల్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం, వాటి అన్వేషణ, వెలికితీత, ప్రా సెసింగ్, రిఫైనింగ్‌తో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలపై సమా వేశంలో ప్రధానంగా చర్చించారు. తమ దేశం అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని క్రిటికల్ మినరల్స్ రంగంలో కోరుకుంటోందని, మైనింగ్ రంగంలో విశేష అను భవం కలిగిన సింగరేణి సంస్థను కూడా పరస్పర లాభదాయ భాగస్వామ్యం కోసం కలసిరావాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా నేడు క్రిటికల్ మినరల్స్‌కు డిమాండ్ ఉందని, ఈ రం గంలో తాము ఆధునిక సాంకేతిక, పర్యావరణ హిత మైనింగ్, లాభదాయక వ్యూహాత్మక వ్యా పార చర్యలపై తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అం దించడానికి సంసిద్ధంగా ఉన్నామని వివరించారు. పరిశోధన, విద్య, పరిశ్రమలతో భాగస్వామ్యం, పరి శోధన ఫలి తాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరి ష్కారాలుగా మార్చడంలో మోనాష్ యూ నివర్సిటీకి ఉన్న అనుభవాన్ని ఆ బృందం వివ రిం చింది. అంతర్జాతీయ స్థాయిలో పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో కలిసి వివిధ రంగాల్లో పనిచేస్తున్నట్లు తెలిపింది. ముడి ఖనిజాలకే పరి మితం కాకుండా డౌన్‌స్ట్రీమ్ ప్రాసెసింగ్, రిఫైనింగ్ ద్వారా అదనపు విలువను సృష్టించే అవకాశాలను మోనాష్ బృందం వివరించింది. మైనింగ్ రం గంలో సుస్థిరత, పర్యావరణ హిత విధానాలు, మైన్ క్లోజర్ ప్లానింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాల్లో తమ సేవలను విని యోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కీలక ఖనిజ రం గంలోకి ప్రవేశంచడానికి చేస్తున్న కృషిని సింగరేణి అధికారులు మోనాష్ యూనివర్సిటీ ప్రతిని ధులకు వివరించారు. ఇటీవలే కర్ణాటకలో బంగారంరాగి గనుల అన్వేషణను ప్రారం భించామని తెలిపారు. క్రిటికల్ మినర్సల్ రం గంలో పరస్పర లాభ దాయకమైన భాగస్వామ్యం కోసం అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధప్రకాష్ తెలిపారు. మోనాష్ యూనివర్సిటీసింగరేణి మధ్య పరిశోధన, ఆధునిక సాం కేతికత, క్రిటికల్ మినరల్స్, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో భవిష్యత్ సహకార అవ కాశాలను పరిశీలిస్తామన్నారు. త్వరలో సింగరేణి ఉన్నతస్థాయి అధికార బృందాన్ని ఆస్ట్రేలియాలో అవకాశాల పరిశీలనకు పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాల నేపంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 31, ప్రభాతవార్త :** మంత్రాల చేయించాడాన్న అనుమానంతో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని అతని బంధువులు కొందరు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన ఆదివారం రాత్రి ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఫలక్‌నుమా వట్టేపల్లి ఫాతిమానగర్ నివాసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే మహ్మద్ మహబూబ్ అలీ(54) ఆదివారం రాత్రి స్థానిక అల్మాస్ హోటల్ వద్ద నుండి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో వాహనాలపై వచ్చిన ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్న ఫళంగా అతనిపై దాడి చేసి కత్తులతో పొడిచారు. అనంతరం అక్కడి నుండి పారి పోయారు. రక్తపు మడుగుడులో పడి ఉన్న అలీని స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.శ్రీనివాస్, ఫలక్‌నుమా ఏసీపీ ఎం.ఎ.జావిద్, ఫలక్‌నుమా అదనపు ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డిలు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. క్లూస్ టీమ్స్‌ను రప్పించి అగంతకుల ఆనవాళ్లను సేకరించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన నిందితులను పట్టుకునే వేటలో ఉన్నారు. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో తమ కుటుంబంపై మంత్రాలు (జాదూ) చేశాడన్న అనుమానంతో బంధువులే ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది.

# పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ధర్నాచౌక్, ఆగస్ట్ 31, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈనెల 29న భువనగిరి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి ఇందిరాపార్కు వరకు చేపట్టిన సీపీఎం పాదయాత్ర ధర్నాచౌక్ వరకు కొనసాగి, సోమవారం ముగిసింది. అనంతరం ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారావు, సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు ఎస్.వీరన్న, చెరుపల్లి సీతారాములు, డి.జి.నరసింహారావులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్ర సర్కారు చిన్న మధ్యతరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేవలం 1700 కోట్లు ఖర్చు పెడితే ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని, ప్రభుత్వం స్పందించి యాదాద్రి భువనగిరి జిల్లాలలోని ప్రాజెక్టులను పూర్తి చేయాలని, లేనిపక్షం ఆ జిల్లా రైతాంగంతో కలసి ఎమ్మెల్యేలను, మంత్రులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. డిండి, చర్లగూడెం ప్రాజక్టులను దశాబ్దాలుగా పెండింగ్‌లో పెట్టారని, రాచకొండ ఎత్తిపోతల పథకానికి శంఖుస్థాపన చేసి వదిలిపెట్టారని ఆరోపించారు. ఈ పథకం పూర్తయితే నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందుతుందని, భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు. బస్వాపూర్, గందమల్ల రిజర్వాయర్లు, చర్లగూడెం ప్రాజెక్టు, ధర్నారెడ్డిపల్లి పిలాయిపల్లి కాలువలను వెంటనే పూర్తి చేయాలని, మూసీని ప్రక్షాళన చేయాలని, యాదాద్రి జిల్లాలకు కృష్ణ, గోదావరి జలాలను రప్పించాలని డిమాండ్ చేశారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో మిగతా ప్రాజెక్టులను విస్మరించిందని, ఇప్పుడు కాళేశ్వరం కూడా వృధాగా మారిందని తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చే విషయంపై రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, సీపీఎం నేతలు నర్సింహ, పైళ్ల ఆశయ్య, బి.అనురాధ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు బాలరాజు, పెంటయ్య, దాసరిపాండు తదితరులు పాల్గొన్నారు.

## 11 మంది నిందితులు అరెస్ట్

**గుంటూరు క్రైమ్, ఆగస్టు31,ప్రభాతవార్త:** గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పెండ్రాల వెంకన్న హత్య కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి మొత్తం 11 మంది నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు.ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, పాత కక్షలు,ప్రతీకార భావంతో నిందితులు వెంకన్న చిన్నను హత్య చేయడానికి పథకం రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఈ నెల29వ తేదీన వెంకన్న తన కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరుకు వచ్చిన విషయం తెలుసుకున్న నిందితులు, అతని కదలికలను గమనిస్తూ అవకాశం కోసం ఎదురుచూశారు. 30వ తేదీ ఉదయం సుమారు 09.00 గంటల సమయంలో, కె.వి.పి కాలనీ 1/7వ లైన్ ప్రాంతంలో వెంకన్న చిన్నను నిందితులు అడ్డగించి దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ప్రధాన నిందితుడు కత్తితో దాడి చేయగా,మరికొందరు నిందితులు కర్రలు,చేతులతో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో పెండ్రాల ఇమ్మానుయేలు రాజి,పెండ్రాల అమూల్య రాజు,పెండ్రాల దేవరాజు,పెండ్రాల గురవయ్య,పెండ్రాల శ్యామ్,పెండ్రాల బుజ్జి,పెండ్రాల జమాలమ్మ,పెండ్రాల రాజ్ కుమార్ రాజు,బత్తుల మోషే రాజు మోషే,దేవరకొండ షాలేమ్ రాజు సలీమ్,ఇరుగు బాబు అనే మొత్తం 11 మంది నిందితులను ఆదివారం అర్ధరాత్రి సుమారు 01.45 గంటలకు అరెస్ట్ చేశారు. అరెస్టుకు తెలియజేశారు. గల కారణాలను నిందితులకు చట్టప్రకారంనిందితుల విచారణలో వారి వద్ద ఉన్న వాహనాల వివరాలు వెలుగులోకి రావడంతో, నేరానికి ఉపయోగించిన ఏపీ40బిబి2414 నంబరు గల హెచ్.ఎఫ్ డీలక్స్ మోటార్‌సైకిల్,ఏపీ40బిళి0183 నంబరు గల బజాజ్ పల్సర్ ఎన్.ఎస్125 మోటార్ సైకిల్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా, నిందితుడు ఇమ్మానుయేలు రాజు చూపించిన ప్రదేశంలో దాచి పెట్టిన నేరానికి ఉపయోగించిన పదునైన కత్తిని మంగళవారం ఉదయం పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరు వ్యక్తుల ప్రమేయం, నేరానికి ఉపయోగించిన ఇతర వాహనాలు,ఇతర ఆధారాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# మానస సరోవరానికి వెళ్లి మణికొండ వాసి అదృశ్యం

- ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు



**నార్సింగి, ఆగస్టు 31 ప్రభాతవార్త :** మానస సరోవరానికి వెళ్లిన మణికొండకు చెందిన ఓ వ్యక్తి ఆచూకి లభించడం లేదు. నేపాల్ వరదల నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. గండిపేట మండలం మణికొండ క్వార్టర్స్‌కు చెందిన రాళ్లగూడెం ధన్‌పాల్‌రెడ్డి(38) మానస సరోవరంకని హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లాడు. ఈ నెల 23.వ,తేదీన నేపాల్‌లోని ఖాట్మాండ్‌కు చేరుకున్నాడు. ముంబాయి నుంచి వెళ్లిన వీరి గ్రూపులో మొత్తం 60.మంది ఉన్నారు. ఖాట్మాండ్‌లోని శంకర్ హోటల్‌లో వీరంతా బస చేశారు. అక్కడి నుంచి నేపాల్‌కు చెందిన రీచా ట్రావెల్స్‌లో 60.మంది గ్రూపు సభ్యులు కలిసి 26.వ,తేదీన మానస సరోవరంకు చేరుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. అదే రోజు సాయంత్రం నేపాల్ వరదలు వచ్చాయి. 26.వ,తేదీ నుంచి ఇప్పటి వరకు ఆయన నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందడం లేదు. ఆయన ఆచూకి కోసం అనేకమార్లు కుటుంబ సభ్యులు ఫోన్‌లు చేసినా ఎలాంటి స్పందన లేదు. దీంతో ధన్‌పాల్‌రెడ్డి నేపాల్ వరదల్లో ఏమైనా ప్రమాదానికి గురయ్యాడా? అని కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. ఆయన ఆచూకి కోసం కుటుంబ సభ్యులు సైబరాబాద్ పోలీసు కమీషనర్‌ను కలిశారు. అక్కడ పోలీసులు ఓ యాప్‌ను చూపించి ఇందులో పేరు నమోదు చేసుకొని సెర్చ్ చేయాలని సూచించారని ధన్‌పాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడుల పి.ఎలను ఫోన్‌లో సంప్రదించి ఆచూకి తెలుపాలని కోరారు. మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. నేపాల్ వరదల నేపథ్యంలో మణికొండ వాసి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులంతా ఆందోళన చెందుతున్నారు.



ఉద్యోగినులకు ఇంటి పనులకు బయటివి తోడై ఒత్తిడి పెరిగి పోతుంటుంది. ఇది ప్రత్యక్షంగానో, పరోక్షం గానో భాగస్వామితో విభేదాలకి దారి తీస్తుంది. అలా కాకుండా ఉండాలంటే సానుకూలంగా మెలుగుతూ

# ఆడుతూ.. పాడుతూ..

సమస్య లను పరిష్కరించు కోవాలి. పనులన్నీ చకాచకా చేసేయాలన్న తొందరమాని, సులువుగా చేసుకునే మార్గాలేంటో తెలుసుకోవాలి. వాటిని ఆచరణలో పెడితే త్వరగా అలసిపోరు. ఏదైనా ప్రాధాన్యతా క్రమంలో చేస్తే సరి. ఇంటి పట్టు నుండే మహిళలు అన్ని పనులూ తామే చేసుకోవాలి అనుకుంటారు. అలాకాకుండా భర్తకి, పిల్లలకి కాస్త పనులు చెప్పండి. వారు నాకు చేతకాదు అంటే.. పనులన్నీ ఒక్కదాన్నే చేసుకోవడం కష్టం అవుతోం దన్న విషయాన్ని విడమరచి చెప్పండి. వాళ్లు అర్థం చేసుకుంటారు. మొదటిసారి కాస్త అటు ఇటుగా చేసినా క్రమంగా నేర్చుకుంటారు. . ఆఫీసు లో అలసిపోయి ఇంటికి వస్తే కాస్తయినా విశ్రాంతి దొరకాలి. ఎవరి పనులు వారు చేసుకోవడం అలవాటైతే..మీకు ఒత్తిడీ ఉండదు. ఇందుకోసం ఇంటిల్లి పాదికీ పని విభజన చేసేయండి తర్వాత ఎవరేం చేశారో పైపైన పరిశీలించుకుంటే సరి. ఏ పనిలోనూ ఎవరూ నిపుణులు కాదు. క్రమంగా అన్నీ వారే ఒంట పట్టించుకుంటారు.

# ఉజ్వల భవితలు !

**స్వామి వివేకానంద తండ్రి** విశ్వనాథ దత్తా ఆ రోజుల్లో కలకత్తాలోనే బాగా పేరున్న న్యాయవాది. ఆయన నగరంలోని శ్రీమంతుల్లో ప్రముఖుడు. ఎంతో ఉదారుడు కూడా. దానధర్మాల్లో విశ్వనాథదత్తాది అందెవేసిన చేయి. ఆయనలా ఎముక లేని చేతితో యథేచ్ఛగా ధనాన్ని వెచ్చిస్తుంటే కుటుంబభ్యులు ఆందోళనచెందినా ఎవరూ ధైర్యం చేసి బయటపడేవారు కాదు. వివేకానంద మాత్రం యుక్తవయసులో ఒకసారిధైర్యం చేసి తండ్రితో నాన్న! ఇలా సంపాదించినదంతా అందరికీ పంచేస్తూ ఉంటే, ఇంకేం మిగులుతుంది? నాకంటూ ఏమీ ఇవ్వవా? అనడిగాడు సరదాగా, దానికాయన బదులు చెప్పక, నిలువుటద్దం వద్దకు తీసుకెళ్లారు. వివేకానందను దాని ముందు నిలబెట్టి చూడు నేను నీకేమిచ్చానో! ఇదుగో ఈ బలిష్టమైన శరీరం.. ఇదే నీకు నేనిచ్చిన ఆస్తి. పెద్ద చదువు, ఆరోగ్యవంతమైన శరీరం.. ఇంతకన్నా సంపద ఇంకేముం టుంది చెప్పు? అన్నాడు ప్రశాంతంగా నవ్వుతూ. విశాలమైన వ్యక్తిత్వం, విలువైన జీవనప్రమాణాలు పిల్లలకు అందిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా రూపొందుతుందన్నది విశ్వనాథదత్తా ఆలోచన. దాన్నాయన పుత్రుడి ద్వారా నిరూపించారు. విశ్వనాథ దత్తా విశాలభావాలు కలిగిన ఆభ్యదయవాది. రచయిత, గాయకుడు, పలుభాషల్లో నిష్ణాతుడు. సంగీతాన్ని ఆస్వాదించే వారు. ఆ సద్గుణాలన్నీ తండ్రి ద్వారానే పుణికి పుచ్చుకున్నానని తదనంతర కాలంలో వివేకానంద సగర్వంగా గుర్తుచేసుకునే వారు.

# తమలపాకు కషాయం



తమలపాకులో సమస్త దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. ముత్తైదువులకు తాంబూలం ఇవ్వడం ద్వారా లక్ష్మీదేవిని గౌరవించినట్లు భావిస్తున్నారు. అందుకే ఈ ఆకుల్ని కొనేటప్పుడు చిన్నమచ్చ, ఆకు చిరగకుండా, తొడిమ విరగకుండా, తాజాగా ఉండేవాటిని ఏరి మరీ కొనుక్కొస్తాం. ఇంతవరకూ బాగానే ఉంది కానీ... పండగ రోజంతా ఎంతో పవిత్రంగా, జాగ్రత చూసుకున్న తమలపాకుల్ని తరవాత ఏం చేస్తాం? తీసి పక్కన పెట్టేస్తాం. రెండు మూడు రోజులయ్యేసరికి అవి వడిలిపోయి, ఎండిపోయి చివరికి చెత్తబుట్ట పాలవుతున్నాయి. కానీ ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న తమలపాకుకి అద్భుతమైన ఆరోగ్య, సౌందర్య, ఔషధ గుణాలెన్నో ఉన్నాయి. అందుకే, వీటిని పక్కనపడేయ కుండా ఎలా ఉపయోగించాలో తెలుసుకుంటే సరి. తొడిమలు తీసిన ఆకుల్ని తడివస్త్రంలో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే వారం వరకూ తాజాగా ఉంటాయి వీటితో పలు రకాల వంటకాలు చేయొచ్చు. మన సంప్రదాయంలో విందు భోజనం తర్వాత తాంబూలం (తమలపాకు+వక్క+సున్నం) వేసుకోవడం ఒక అలవాటు. దీని వెనక శాస్త్రీయకోణం లేకపోలేదు. తమలపాకును నమలడం లాలాజలం ఎక్కువగా ఊరుతుంది. ఇది తిన్న ఆహారాన్నీ అందులోని కొవ్వు పదార్థాలను త్వరగా అరిగేలా చేస్తుంది. ముఖ్యంగా కడుపు ఉబ్బరం, గ్యాస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనికోసం తమలపాకులలో కొద్దిగా వాము లేదా మిరియం గింజ పెట్టి నమిలి రసం మింగి సరి. తమల పాకులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోట్లో ఉండే హానికర రూపాన్ని నశింపజేస్తాయి. చిగుళ్ల వాపులు, రక్తం కారడం, పంటి నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. దీన్ని తేనె, అల్లంతో కలిపి కషాయంలా తీసుకుంటే దగ్గు, కఫం తగ్గుతాయి.

# టీనేజ్ డైట్ ..



**రజస్వల వయసుకి చేరవతోన్న అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా పలు మార్పులు చోటుచేసుకోవ డం సహజం.**

హార్మోన్ల స్థాయుల్లో హెచ్చుతగ్గుల వల్లే ఇలా జరుగు తుంటుంది. నిజానికి ఈ మార్పులు టీనేజీ దశలోకి ప్రవేశించే అమ్మాయిలకు కాస్త అసౌకర్యాన్ని, ఇబ్బందిని కలగజేస్తాయి. అయితే ఈ దశలో హార్మోన్లలో మార్పు లొచ్చినా.. వాటి ప్రభావం వారిపై పడకుండా ఉండాలంటే. వారి ఆహారంలో పలు మార్పులు చేర్పులు చేయాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా ముందు నుంచే కొన్ని పదార్థాల్ని వారికి అందించడం వల్ల.. పోషకాలన్నీ వారి శరీరానికి అంది.. ఈ దశనూ వారు సౌకర్యవంతంగా దాటేయగలరని చెబుతున్నారు. ఏంటా పదార్థాలు? తెలుసుకుందాం.. హార్మోన్లను సమతులంగా ఉంచడంలో ఐరన్ కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి రజస్వలకు చేరువవుతోన్న అమ్మాయిల్లో హార్మోన్ల ఆరోగ్యానికీ ఐరన్ అధికంగా లభించే మునగాకు పొడి మంట ప్రత్యామ్నాయం అంటున్నారు నిపుణులు. రోజూ టీస్పూన్ పొడిని వారు తినే వంటకాల్లో భాగం చేయడం లేదంటే ఉదయాన్నే ఓ గ్లాసు నీటిలో కలిపి ఇవ్వడం వంటివి చేస్తే మంచిది. అవిసె గింజల్లో ఐరన్, క్యాల్షియం, మెగ్నీసియంతో పాటు సి, ఇ, కె.. వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఈ పోషకాలన్నీ హార్మోన్ల స్థాయుల్ని క్రమబద్ధీకరించేవే కాబట్టి టీనేజ్ అమ్మాయిలకు ఇది మంచి ఆహారం. వీటిని లడ్డూలు, పొడి, కూరల్లో భాగం చేయడం.. ఇలా వారికి నచ్చినట్లుగా అందించచ్చు. రజస్వల ప్రారంభమైన తొలినాళ్లలో కొంతమంది అమ్మాయిలకు ఎక్కువ బ్లీడింగ్ అవుతుంటుంది. దీనివల్ల రక్తహీనత తలెత్తకుండా ముందు నుంచే జాగ్రత్తపడమని చెబుతున్నారు నిపుణులు. ఈ క్రమంలో అంజీర్‌ను వారి ఆహారంలో చేర్చడం మంచిది. ఈ పండు హెమోగ్లోబిన్ స్థాయుల్ని పెంచడమే కాదు. రక్తాన్నీ శుద్ధి చేస్తుంది. అయితే వేడి శరీరం ఉన్న అమ్మాయిలకు దీన్ని రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే ఇవ్వాలి. తద్వారా ఒంట్లో వేడి మరింత పెరగకుండా జాగ్రత్తపడచ్చు. టీనేజ్‌లోకి ప్రవేశించే అమ్మాయిల్లో ఎముకల ఆరోగ్యానికి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పాల పదార్థాల్ని అందించాలి. ఒకవేళ ఇవి ఇష్టపడక పోతే.. బాదం/కొబ్బరి/ సోయా పాలు చక్కటి ప్రత్యామ్నాయం. అలాగే ఆకుకూరలు, బ్రకలీ కూడా వారికి మేలు చేస్తాయి. శరీరంలో హార్మోన్ల మార్పుల వల్ల నీరసం, అలసట ఆవహిస్తుంది. వీటిని ఎదుర్కొని శారీరక శక్తి స్థాయుల్ని పెంచుకోవాలంటే బీన్స్, పప్పులు, చేపలు, నిమ్మజాతి పండ్లు, సెరల్స్, వంటివి మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. శరీరంలో కొన్ని రకాల హార్మోన్లలో మార్పల కారణంగా కడుపుబ్బరం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి ఎదిగే అమ్మాయిల్లో ఈ సమస్య తలెత్త కుండా ఉండాలంటే ఫైబర్ అధికంగా బ్రౌన్ రైస్, క్వినోవా, ఓట్స్, తాజా పండ్లు, కాయగూరలు, పప్పులు వారి మెనూలో చేర్చాలంటున్నారు. .

# అందానికి అందానివై..



అందం పరిరక్షణ అంత తేలికా ఏంటి? ఎంతో సవ యం తీసుకుంటుంది. అందుకే విసిగి పోయి.. స్కిన్ కేర్‌ని పెద్దగా పట్టించుకోని అమ్మాయిలే ఎక్కువ. వాళ్లకి ఆ భారం తగ్గిస్తూ వచ్చినవే ఈ స్ప్రేలు.

**తలంటుకు సమయం లేదా ..** తలస్నానం చేయడం ఒకెత్తయితే.. జుట్టుని ఆరబెట్టుకోవడం మరొకెత్తు కదూ. తగినంత సమయం లేదని చేయకపోతేనేమో ముఖ్యమైన వేడుకల్లో జిడ్డు తలతోనో, తడి కురుల తోనో కనిపించాలి. ఏదైనా అందాన్ని తగ్గించేదే! అలాంటి సందర్భాల కోసం..ఈ 'డ్రై' షాంపూ తెచ్చు కోండి. బాటిల్‌ని బాగా కుదిపి కాస్త దూరంలో ఉంచి పాయల్లో స్ప్రే చేయాలి. ఆపై తలపై మర్దన చేసి, దువ్వెనతో దువ్వితే సరి. జిడ్డు మాయమై అప్పుడే తలస్నానం చేసినట్టుగా శుభ్రమైన కురులు మీ సొంతమవుతాయి.

**మాయిశ్చరైజింగ్ సులువుగా..** ముఖాన్ని పట్టంచుకున్నట్టుగా చాలా మంది అమ్మాయిలు చేతులు, పాదాలను పట్టించుకోరు. కొద్దికొద్దిగా క్రీమ్ తీసుకుంటూ చర్మంలోకి పూర్తిగా ఇంకిపోయేలా జాగ్రత్తగా రాయడం పెద్ద పనిలా తోస్తుంది మరి! పోనీ బాడీ స్ప్రే మాయిశ్చరైజర్ ప్రయత్నించండి. శరీరమ్మీద స్ప్రే చేసి, కాస్త మర్దన చేయడమే! ఇది త్వరగా శరీరంలోకి ఇంకుతుంది. ఎక్కువ సమయంమూ తీసుకోదు, కావాల్సి న తేమా అందుతుంది.

**అవాంఛిత రోమాలు మాయం! ....** ఎక్కువ రోజులు అవాంఛిత రోమాలు పలకరించకుండా ఉంటాయని వ్యాక్స్‌ను ఎంచుకుంటాం. కానీ అది వేడిదైనా చల్లటిదైనా నొప్పి ఖాయం. రేజర్‌తోనేమో గాయాల భయం. పైగా తీసుకునే సమయమూ ఎక్కువే. తక్కువ సమయంలో ఫలితం చూపేలా ఉంటే బాగుండు అనిపి స్తోందా? అయితే హెయిర్ రిమూవల్ క్రీమ్ స్ప్రే ప్రయత్నించి చూడండి. దీన్ని సమస్య ఉన్నచోట స్ప్రే చేసి, కొంతసేపు వదిలే యాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి పోతుంది. సమయాన్ని తగ్గిస్తూ.. పని సులువు చేస్తూ.. ఈ స్ప్రేలు భలేగున్నాయి. మీకు కావాల్సి ందేదో ప్రయత్నిం చేయండి మరి.

# తోటకూర వడలు



శనగపప్పు: ఒక కప్పు, మినుప పప్పు: అర కప్పు, తరిగిన తోటకూర: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: నాలుగు, ఉప్పు: తగినంత, వెల్లుల్లి: నాలుగు రెబ్బలు, జీలకర్ర: ఒక టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా.

శనగపప్పు, మినుప పప్పును బాగా కడిగి నాలుగు గంటలపాటు నానబెట్టాలి. నానిన పప్పుల్ని బరకగా, గట్టిగా గ్రైండ్ చేసుకోవాలి. ఒక గిన్నెలో పప్పు ముద్ద, తోటకూర తరుగు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, దంచిన వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు వేసి బాగా కలపాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనెపోసి, బాగా వేడయ్యాక పప్పు మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని అర చేతిలో గారెల్లా ఒత్తి నూనెలో దోరగా కాల్చుకుంటే వేడివేడి తోటకూర గారెలు సిద్ధం.

# తెర

## 'డాయ్‌రా'.. ట్రైలర్ విడుదల




జంగ్లీ పిక్చర్స్, డాక్టర్ జయంతీలాల్ గడా (పెన్ స్టూడియోస్) సంయుక్తంగా నిర్మిస్తోన్న'డాయ్‌ర్గా చిత్రంలో ప్రధాన పాత్రధారులుగా కరీనా కపూర్ ఖాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కరీనా కపూర్ ఖాన్ మాట్లాడుతూ.. మేఘనాతో కలిసి పనిచేసే క్రమంలో.. ఒక పాత్ర గురించి మనకు తెలిసిన ప్రతి విషయాన్ని కూడా ఆమె ప్రశ్నించేలా చేస్తుంది. ప్రతి చిన్న విషయం వెనుక ఎంతో ఆలోచన ఉంటుంది. అయితే నటిగా మన సహజమైన భావోద్వేగాలను ఆమె ఎప్పుడూ దూరం చేయదు. ఇందులో నేను చేసిన డీసీపీ అజూనీ కోహ్లీ పాత్ర నా మనసులో చాలా కాలం నిలిచిపోతుంది. ఎందుకంటే నన్ను నేను పెద్దగా అన్వేషించని ఒక కొత్త కోణంలోకి ఈ పాత్ర నన్ను తీసుకెళ్లింది.

పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ'డీసీపీ రామన్ కుమార్ పాత్రలోని సంక్లిష్టతే నన్ను ఎక్కువగా ఆకట్టుకుంది. బయటకు చాలా ప్రశాంతంగా కనిపించే ఈ పాత్రలో లోపల ఎన్నో భావోద్వేగాలు, సంఘర్షణలు ఉన్నాయి. దర్యాప్తు సమయంలో ఆయన ఎదుర్కొనే ప్రశ్నలు కూడా ఈ పాత్రను మరింత ఆసక్తికరంగా మార్చాయి. ఈ సినిమా చివరి వరకు ఎలాంటి పక్షపాతం లేకుండా సాగుతూ.. ప్రేక్షకులు తమదైన కోణంలో కథను అర్థం చేసుకునే అవకాశం ఇవ్వడం నాకు బాగా నచ్చింది. డైరెక్టర్ మేఘనా గుల్జార్ మాట్లాడుతూ డాయ్‌రా కథను కేవలం ఏది పూర్తిగా సరైనది.. ఏది పూర్తిగా తప్పు అనే కోణంలో చూడలేం. ఇందులోని పాత్రల్లో మనకు గ్రే షేడ్స్ కూడా కనిపిస్తాయి. వాటి వెనుక ఉన్న సంక్లిష్టతను కూడా ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. ఒక దర్శకురాలిగా ఇలాంటి గ్రే ఏరియాను తెరపై చూపించడం ఎప్పుడూ సవాలుతో కూడుకున్నదే అయినా.. అదే సమయంలో ఎంతో ఆసక్తికరంగా కూడా ఉంటుంది. జంగ్లీ పిక్చర్స్ సీఈఓ అమృతా పాండే మాట్లాడుతూ..'జంగ్లీ పిక్చర్స్‌లో మేం ఎప్పుడూ మన చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి పుట్టుకొచ్చే కథలకే ప్రాధాన్యత ఇస్తుంటాం. ముఖ్యంగా నిజ జీవిత ఘటనలు, వాస్తవ అనుభవాల నుంచి స్ఫూర్తి పొందిన కథలు మమ్మల్ని మరింతగా ఆకట్టుకుంటాయి. పెన్ స్టూడియోస్ సీఎండీ డాక్టర్ జయంతీలాల్ గడా మాట్లాడుతూ సినిమా కేవలం వినోదాన్ని అందించడమే కాదు.. సరైన ప్రశ్నలను కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురాగలదు. 'డాయ్‌ర్గా రెండో కోవకు చెందిన సినిమా. అందుకే ఈ కథ మాకు మరింత ప్రత్యేకం. మేఘనా గుల్జార్ ఎప్పటికప్పుడు ప్రేక్షకులను ఆలోచింప'జేసే సినిమాలను తెరకెక్కిస్తూ వస్తున్నారు.

## 'గుడ్ టైం' టీజర్ లాంచ్ ఈవెంట్



గుడ్ టైం సినిమాతో టీంకు గుడ్ టైం వస్తుందని పేర్కొన్నారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ... యాక్టర్ అవ్వాలి అనుకున్నప్పటి నుంచి ఎన్నో కలలు ఉండేవి, అది ఈ సినిమాతో ఫుల్ ఫిల్ అవుతున్నట్టు తెలిపారు. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేని, మధ్యతరగతి నుంచి వచ్చిన తనపై నమ్మకంతో ఇంత పెద్ద సినిమా బాధ్యతను తన భుజాలపై పెట్టిన డైరెక్టర్ చాణక్య, నిర్మాత రమేష్ ఇద్దరికీ ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలో తన ప్రయాణం ఆరు సంవత్సరాల క్రితమే మొదలైందని, కానీ ఇప్పుడు గుడ్ టైం వచ్చిందని తెలిపారు. సినిమాను చిన్న సినిమా అనడం ఇష్టం లేదని ఇదొక నిజాయితీగా తీసిన అద్భుతమైన సినిమా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన హీరో నందుకు ధన్యవాదములు తెలిపారు. ఆయన సైక్ సిద్దార్థ్ సినిమాను ఎలా ప్రమోట్ చేశారో దాని నుంచి చాలా నేర్చుకొని గుడ్ టైమ్ మూవీని ప్రమోట్ చేస్తానని తెలిపారు. అలాగే వంశీ నందిపాటి, శశికిరణ్ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.డైరెక్టర్ చాణక్య జిల్లా మాట్లాడుతూ.. మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్ కు విచ్చేసిన మీడియా మిత్రులకు, ముఖ్య అతిథులకు, చిత్ర యూనిట్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా తర్వాత అందరి టైం గుడ్ గా మారుతుంది అని పేర్కొన్నారు.ఈ సినిమాలో ఒక ప్రత్యేకమైన ఎమోషన్ ఉంటుందని దాన్ని అందరూ థియేటర్లో బాగా ఎంజాయ్ చేస్తారంటూ తెలిపారు.వంశీ నందిపాటి మాట్లాడుతూ.. సినిమాను సపోర్ట్ చేయడానికి వచ్చిన హీరో నందు డైరెక్టర్ శశికిరణ్ తిక్క ఇద్దరికీ స్పెషల్ థాంక్స్ చెప్పారు. సినిమాను నిజంగా ప్రేమించే వాళ్లే ఇలా సపోర్ట్ చేస్తారని వ్యాఖ్యానించారు. ఇక సినిమాలో యాక్ట్ చేసిన ప్రతి ఒక్కరికి గుడ్ టైం రావాలని తెలిపారు.

## ప్రొడక్షన్ నం.39 శ్రీ విష్ణు చిత్రం



యువ కథానాయకుడు శ్రీ విష్ణు, ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ప్రొడక్షన్ నం.39. నేటి యువత జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, భావోద్వేగాలు, కలలు, ఆశలు, ఆకాంక్షలు, సవాళ్లను ప్రతిబింబించే కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సన్నివేశాలు, అన్ని రకాల భావోద్వేగాలతో కూడిన ఓ సరికొత్త ప్రయాణాన్ని ఈ సినిమా ఆవిష్కరించ నుంది.ఈ సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ మేకర్స్ తాజాగా ఓ చిన్న గ్లింప్స్‌ను విడుదల చేశారు. యువత జీవితానికి దగ్గరగా ఉండే అంశాలతో రూపొందుతున్న ఈ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచడంతో పాటు, కథ ఎలా ఉండబోతుందనే విషయంపై మరింత క్యూరియాసిటీని కలిగిస్తోంది. సహజమైన భావోద్వేగాలతో కూడిన ఈ కథ ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఏదో ఒక సందర్భాన్ని గుర్తు చేసేలా ఉండబోతోంది.ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. హారికా సూర్యదేవర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్. నాగ వంశీ సమర్పిస్తున్నారు. సన్నీ సంజయ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.యువతకు కనెక్ట్ అయ్యే కథాంశం, సహజమైన భావోద్వేగాలు, ఆహ్లాదకరమైన కథనంతో తెరకెక్కుతున్న ప్రొడక్షన్ నం.39 ప్రతి ఒక్కరూ తమను తాము చూసుకునేలా'ఇది మన అందరి కథ" అనే భావనను అందించనుంది.

## 'సీక్రెట్ సోల్జర్' ట్రైలర్ లాంచ్



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్, అక్కి విశ్వనాథ్ రెడ్డి స్పై డ్రామా సీక్రెట్ సోల్జర్ ట్రైలర్ లాంచ్నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందు తున్న యూనిక్ స్పై డ్రామా సీక్రెట్ సోల్జర్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగ స్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. సూర్య శ్రీనివాస్ హిట్ 3 సినిమా సమయంలో ఈ సినిమా గురించి చెబుతూ ఉండేవారు. నాకు ఈ ట్రైలర్ చాలా నచ్చింది. ట్రైలర్‌లో కష్టం కనిపించింది. చాలా కష్టపడి సినిమాను తీశారు అనే ఫీలింగ్ ట్రైలర్ కలిగించింది. రైటర్, డైరెక్టర్ బీవీఎస్ రవి మాట్లాడుతూ.. సీక్రెట్ సోల్జర్ ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఈ సినిమా సెన్సార్‌లోనే 8 నెలల పాటు ఉందని విన్నాను. కచ్చితంగా అందరికీ నచ్చడం వల్లే సెన్సార్ నుంచి బయటకు వచ్చింది. శాన్వి మాట్లాడుతూ.. నిహాల్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్. సినిమా కథ నాకు తెలుసు. ఇందులో చాలా బలమైన ఎమోషన్ ఉంది. ఫ్రెండ్షిప్ ఉంది. అది నాకు చాలా నచ్చింది. హీరో నిహాల్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. శాన్వి మా ప్రాజెక్ట్‌ను చాలా సపోర్ట్ చేసింది. తన అదృష్టం మాకు కూడా కలిసొస్తుందని నమ్ముతున్నాను.బీవీఎస్ రవి గారు, శైలేష్ కొలను గారు వచ్చి సపోర్ట్ చేయడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. . చాలా అద్భుతమైన సినిమా తీశాం. సెప్టెంబర్ 18న రిలీజ్ అవుతుంది. ఈ కమల్ కామరాజు మాట్లాడుతూ.. డైరెక్టర్ కథ చెప్పినప్పుడు నాకు చాలా సర్‌ప్రైజ్‌గా అనిపించింది.

## 'కాగితం పడవలు' : సాంగ్ విడుదల



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ కాగితం పడవలు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి,.ఆర్ ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సాంగ్ లాంచ్ చేశారు.సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో వర్ధన్ మాట్లాడుతూ: కాగితం పడవలు.. ఒక కాలువలో ప్రయాణం చేయాలని అనుకున్నాం. తెలియకుండానే ఒక సముద్రంలోకి వచ్చేశాం. ఎన్నోసార్లు ఒడ్డుకు వద్దాం అనుకున్నాం. కానీ ఇంకా చాలా దూరం వెళ్లాల్సి వచ్చింది. ఈ ప్రయాణంలో మాకు ఎంతగానో సపోర్ట్ చేసిన మా నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని రిలీజ్ చేయడం చాలా కష్టం. డైరెక్టర్ తుకారాం గారు చాలా అద్భుతంగా తీశారు. ఈ సినిమా పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సెప్టెంబర్ 18న థియేటర్స్‌లో కలుద్దాం. దర్శకుడు తుకారాం మాట్లాడుతూ: మా సినిమాకి మా నిర్మాతలే హీరోలు. మా నిర్మాతలు లేకపోతే ఈ సినిమా ఇంత దూరం వచ్చేది కాదు. మన ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రేమకథ ఉంటుంది. ఈ సినిమా చూస్తే మీ ప్రేమకథ మీకు గుర్తుకొస్తుంది. మీరందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూడండి.

## 'రోమాంచకం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ



సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీబ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా రోమాంచకం. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొంది స్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూ గించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. యాక్టర్ కమల్ మాట్లాడుతూ నేను ఎప్పటి నుంచో ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. కానీ భద్రకాళీ పిక్చర్స్ ఆఫీస్ నుంచి ఈ సినిమా కోసం కాల్ వచ్చినప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యాను. యాక్టర్ సతీష్ మాట్లాడుతూ నేను యాక్టర్ గా మారి ఇలాంటి ఒక మంచి సినిమాలో నటిస్తానని ఊహించలేదు. యాక్టర్ సోహాన్ మాట్లాడుతూ అర్జున్ రెడ్డి సినిమా చూశాక థ్రిల్ ఫీలయ్యాను. ఇప్పుడు అదే సంస్థలో నేను నటుడిగా అరంగేట్రం చేస్తుండటం సంతోషంగా ఉంది. యాక్టర్ మణి మాట్లాడుతూ నేను సుమంత్, వెంకటేష్ మేమంతా ఫ్రెండ్స్. మేమంతా బయట ఎలా సరదాగా ఉంటామో సినిమా లోనూ అదే ఫన్ రిఫ్లెక్ట్ అవుతుంది. యాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ ఈ సినిమాతో మీకు మరో నాలుగు సినిమాలు వస్తే నాకు చాలా సంతోషం అని అనేవారు ప్రణయ్ అన్న. ఆయనకు మా మీద ఉన్న ప్రేమకు ఎంతో హ్యాపీగా ఫీలయ్యాం. డీవోపీ పవన్ పప్పుల మాట్లాడుతూ ఈ సినిమాకు డీవోపీ వర్క్ చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది.



# దులీప్ ట్రోఫీలో తిలక్ వర్మ శతకం

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ(225 బంతుల్లో 7 ఫోర్లతో 106 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్‌కు సారథ్యం వహిస్తున్న తిలక్ వర్మ నార్త్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో అజేయ సెంచరీతో సత్తా చాటాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై తిలక్ తన క్లాస్ బ్యాటింగ్‌తో ఆకట్టుకోవడంతో, సౌత్ జోన్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగుల ఆధిక్యం లభించింది. తిలక్ తో పాటు శ్రేయస్ గోపాల్(87) సత్తా చాటడంతో రెండో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ 94 ఓవర్లలో 9 వికెట్లకు 285 పరుగులు చేసింది. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్(4/70) నాలుగు వికెట్లు తీయగా, అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్ తలో రెండు వికెట్లు తీసారు. 0 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును తిలక్, శ్రేయస్ తో కలిసి ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సెంచరీ ముంగిట శ్రేయస్ గోపాల్ ఔటైనా, టెయిలెండర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకున్న తిలక్ అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నార్త్ జోన్ 59.1 ఓవర్లలో 195 పరుగులకు కుప్పకూలింది. ఖమ్రాన్ ఇక్బాల్(76) ఒక్కడే హాఫ్ సెంచరీతో సత్తా చాటగా, కన్హయ వధవాన్(35) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సౌత్ జోన్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప(4/64) 4 వికెట్లు తీయగా, నిదీష్(2/36), తనయ్ త్యాగరాజన్(2/31) రెండేసి వికెట్లు, కావురి సాయితేజ, శ్రేయాస్ గోపాల్‌కు చెరో వికెట్ దక్కింది.



## యుఎస్ ఓపెన్‌లో జొకోవిచ్
# సంచలన ఓటమి

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ 2026 లో నోవాక్ జొకోవిచ్ అనూహ్యంగా ఓటమితో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, అర్జెంటీనాకు చెందిన మరియానో నవోన్ తొలి రోజు అతిపెద్ద సంచలనాన్ని సృష్టించాడు. మరోవైపు, మాజీ ఛాంపియన్ డానియల్ మెద్వెదేవ్ స్ట్రెయిట్ సెట్స్ విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. నాలుగుసార్లు యూఎస్ ఓపెన్ ఛాంపియన్, 24 సార్లు గ్రాండ్ స్లామ్ విజేత అయిన నాలుగో సీడ్ జొకోవిచ్, ఆర్థర్ ఆషే స్టేడియంలో నాలుగు గంటల 36 నిమిషాల పాటు సాగిన సుదీర్ఘ పోరులో నవోన్ చేతిలో 7-6(5), 5-7, 4-6, 6-2, 6-1 తేడాతో ఓడిపోయాడు. 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత ఒక గ్రాండ్ స్లామ్‌లో తొలి రౌండ్‌లోనే జొకోవిచ్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. జొకోవిచ్ రెండు సెట్లకు ఒకటి ఆధిక్యంలో ఉండి, నాలుగో సెట్‌లో ఆరంభంలోనే ఒక బ్రేక్ సాధించినప్పటికీ, నవోన్ నిర్ణయాత్మకంగా పుంజుకున్నాడు. ఆ అర్జెంటీనా ఆటగాడు చివరి రెండు సెట్లలో ఆధిపత్యం చెలాయించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని దక్కించుకున్నాడు. కాగా 2021 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ అయిన మెద్వెదేవ్, ఫ్రెంచ్ క్వాలిఫయర్ హ్యూగో గాస్టన్‌ను రెండు గంటల 14 నిమిషాల పోరులో 6-4, 6-2, 6-4 తేడాతో ఓడించి ఫ్లషింగ్ మెడోస్‌కు మరింత సునాయాసంగా తిరిగి వచ్చాడు. ఈ విజయంతో అతను ఏటీపీ లైవ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ముందుకు వెళ్లి 6వ స్థానానికి చేరుకున్నాడు.

## అఫ్గాన్‌తో టి20 సిరీస్.. టీమిండియాలో
# ముగ్గురు స్టార్లు ఔట్!










**న్యూఢిల్లీ:** అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు టీమ్ఇండియా సిద్ధమవుతోంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ సెప్టెంబరు 13 నుంచి ప్రారంభం కానుంది. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలో జరగనుంది. దీనికి సంబంధించి సెప్టెంబరు 3న సెలెక్షన్ కమిటీ సమావేశమై భారత జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా యువ ఆటగాళ్లకు ఎక్కువగా అవకాశాలు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే అఫ్గాన్ సిరీస్‌కు ఎంపిక చేయాల్సిన జట్టులో ముగ్గురు కీలక స్టార్ ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఇప్పుడు సెలెక్టర్లకు సవాలుగా మారింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అతడు అందుబాటులో లేకపోతే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు మరోసారి అవకాశం దక్కే అవకాశం ఉంది. తక్కువ మ్యాచ్‌ల్లోనే ఆకట్టుకునే ప్రదర్శన చేయగా, ఆరు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు సాధించడం అతడి సామర్థ్యాన్ని చాటుతోంది. అలాగే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా ఫిట్‌నెస్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. హార్దిక్ అందుబాటులో లేకపోతే ఆల్‌రౌండర్ స్థానాన్ని భర్తీ చేయడం సెలెక్టర్లకు పెద్ద పరీక్షగా మారనుంది. హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా భావిస్తున్న నితీశ్ కుమార్ కూడా ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా లేడు. అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌లో గాయపడిన అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. మరోవైపు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఫిట్‌నెస్ పరీక్షలో సానుకూల ఫలితం సాధించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా ఉన్నందున అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు అతడిని ఎంపిక చేసే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. నితీశ్ ఫిట్‌గా లేకపోతే సూర్యాంశ్ షెడ్గేకు అవకాశం దక్కే అవకాశముంది. అయితే బ్యాట్, బంతితో అతడి ప్రదర్శన ఇంకా ఆశించిన స్థాయిలో లేదు. అదే సమయంలో శివమ్ దూబే జట్టులో ఉండే అవకాశం ఉన్నందున.. షెడ్గేను అదనపు ఆల్‌రౌండర్‌గా బ్యాకప్ ఆప్షన్‌గా ఎంపిక చేసే అవకాశముంది. పేసర్ హర్షిత్ రాణా ఎంపిక కూడా అనుమానంగానే ఉంది. అతడు అందుబాటులో లేకపోతే వేగంతో ఆకట్టుకున్న మయాంక్ యాదవ్‌కు మరోసారి జాతీయ జట్టులో చోటు దక్కొచ్చు.

ఆట



## ఆసియా కప్ క్వాలిఫైయర్స్‌లో
# భారత్ విజయం
### 1-0 తేడాతో సిరియా ఓటమి

**తాష్కెంట్:** ఎఎఫ్‌సి అండర్ 20, ఆసియా కప్ 2027 క్వాలిఫైయర్స్‌లో భారత్ సిరియాను ఓడించింది. సోమవారం తాష్కెంట్‌లోని దోస్లిక్ స్టేడియంలో సిరియాపై 1-0 తేడాతో స్వల్ప విజయంతో భారత్ తన ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్ 2027 క్వాలిఫయర్స్ ప్రచారాన్ని ప్రారంభించింది. 86వ నిమిషంలో సింగమయుమ్ షమీ కట్ బ్యాక్ నుండి బంతిని నెట్‌లోకి పంపి చివరి నిమిషంలో గోల్ సాధించాడు. కొద్ది నిమిషాల తర్వాత ఒమాంగ్ దోడుమ్ ఇచ్చిన క్రాస్‌ను గున్లీబా వాంగ్‌ఖీరక్‌పామ్ గోల్‌గా మలచడంతో, బ్లూ కోల్ట్స్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేశామని భావించారు. కానీ అది ఆఫ్ సైడ్ అని ప్రకటించబడింది. కాగా వచ్చే ఏడాది చైనాలో జరగనున్న ఖండాంతర టోర్నమెంట్‌లో స్థానం కోసం ఇరు జట్లు ఎదురుచూస్తున్నాయి. కేవలం ఎనిమిది గ్రూప్ టాపర్లు, ఏడు ఉత్తమ రన్నరప్‌లు మాత్రమే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. భారత్, సిరియాలు గ్రూప్ బి లో ఉన్నాయి, ఇందులో బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్ కూడా ఉన్నాయి. భారత జట్టు తొలిసారిగా అండర్20 ఆసియా కప్‌లో అడుగుపెట్టే ప్రయత్నంలో భాగంగా, తదుపరి మ్యాచ్ ఆతిథ్య ఉజ్బెకిస్తాన్‌తో తలపడనుంది.

## ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్:
# భారత్ మహిళల జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీలో ఎంపిక ట్రయల్స్ ముగిసిన అనంతరం, అమెరికాలో జరగనున్న అండర్23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌ల కోసం భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మహిళల జట్టును సోమవారం ఖరారు చేసింది. రోజంతా జరిగిన ఈ ట్రయల్స్‌లో, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి ప్రముఖ రెజ్లింగ్ రాష్ట్రాలకు చెందిన రెజ్లర్లు మొత్తం 10 వెయిట్ కేటగిరీలలో భారత బృందంలో స్థానాల కోసం పోటీపడ్డారు.

ఎంపిక ట్రయల్స్‌లో హర్యానా ఆధిపత్యం చెలాయించి, పలువురు రెజ్లర్లు అగ్రస్థానాలు సాధించగా, మహారాష్ట్ర కూడా పలు వెయిట్ కేటగిరీలలో బలమైన ప్రదర్శన కనబరిచింది. 50 కేజీల విభాగంలో పర్వీన్ అగ్రస్థానం సాధించగా, 53 కేజీల విభాగంలో స్వీటీ విజయం సాధించింది. 55 కేజీల విభాగంలో మహారాష్ట్రకు చెందిన అహల్యా షిండే అగ్రస్థానంలో నిలవగా, 57 కేజీల విభాగంలో నేహా శర్మ ప్రథమ స్థానంలో నిలిచింది. 59 కేజీల విభాగంలో కోమల్ అగ్రస్థానం సాధించగా, 62 కేజీల విభాగంలో నేహా విజయం సాధించింది.

65 కేజీల విభాగంలో వైష్ణవి పాటిల్ మొదటి స్థానం కైవసం చేసుకోగా, 68 కేజీల విభాగంలో మాన్సీ లాథర్ అగ్రస్థానంలో నిలిచింది. మహారాష్ట్రకు చెందిన అమృత పూజారి 72 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలవగా, దీక్షా మాలిక్ 76 కేజీల విభాగంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.



వాణిజ్యం

# మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధికి ఊపు


## 7.8 శాతం జిడిపి వృద్ధి



### అసాధారణ ఘనత: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో సమస్యలు, ప్రపంచవ్యాప్త అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం జిడిపి వృద్ధిని సాధించడం ఒక "అసాధారణ ఘనత" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు. తాజా జిడిపి గణాంకాలపై స్పందిస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య కూడా భారత్ బలమైన ఆర్థిక వృద్ధిని సాధించడంలో ప్రజల సమిష్టి శక్తి దోహదపడిందని ప్రధాని మోడీ అన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "ప్రపంచ అనిశ్చితి పరిస్థితుల నడుమ చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థ సమస్యలు ఉన్నప్పటికీ, మన ప్రజల సమిష్టి శక్తి భారత్ ఇటువంటి వృద్ధిని సాధించేలా చేసింది" అని ప్రధాన మంత్రి అన్నారు.

## సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌తో 50-60వేల ఉద్యోగాలు
### - కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** 'సెమికాన్ 2.0 పథకం'లోని ఆరు ప్రధాన విభాగాలకు సంబంధించిన నోటిఫికేషన్లను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ, భారతదేశ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు. 'ఇది భారతదేశ సెమీకండక్టర్ డిజైన్, తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు. మొదటి 'సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్' ద్వారా వచ్చిన ఊపును కొనసాగిస్తూ, ఈ పథకం చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ప్యాకేజింగ్ నుండి పరికరాలు, మెటీరియల్స్, పరిశోధన మరియు అభివృద్ధి, ప్రతిభ అభివృద్ధి వరకు సెమీకండక్టర్ విలువ గొలుసు అంతటా ఆర్థిక, మౌలిక సదుపాయాల మద్దతును అందిస్తుంది. కీలక రంగాలలో సాంకేతిక నాయకత్వాన్ని స్థాపించడం ద్వారా భారతదేశ ఆర్థిక వృద్ధిని, జాతీయ భద్రతను బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యం." అని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధితో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. ఈ వృద్ధి రేటుతో పోలికలో ఉన్న మిగతా అన్ని పెద్ద ఆర్థిక వ్యవస్థల కంటే ఇది ముందుంది. మలేషియా, సింగపూర్‌లు వరుసగా 6.0శాతం, 5.9శాతం వృద్ధిని సాధించగా, ఇండోనేషియా 5.29శాతం, చైనా 4.3శాతం వృద్ధిని నమోదు చేశాయి. అమెరికా 2.1శాతం వృద్ధిని సాధించింది. చాలా పెద్ద యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలలో వృద్ధి రేటు సుమారు 1శాతం లేదా అంతకంటే తక్కువగా ఉంది. అన్ని ఆదాయ వర్గాలలో డిమాండ్ పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతూనే ఉంది. జులై నెల వాహన విపణి ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అధికారిక గణాంకాల ప్రకారం, దేశీయ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 4.58 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 34.3శాతం అధికం. ఇప్పటివరకు నమోదైన జులై నెలల్లో ఇదే అత్యంత బలమైన అమ్మకాలు. ఇది కేవలం ఆటోమొబైల్ షోరూమ్‌లకే పరిమితం కాదు. ఒక కారు కొనుగోలు ఉక్కు, టైర్లు, గాజు, ఎలక్ట్రానిక్స్, ఫైనాన్స్, బీమా, డీలర్‌షిప్‌లు, మరమ్మతులు, ఇంధన రిటైల్ రంగాలకు మద్దతు ఇస్తుంది. అమ్మకాలు ఈ వేగంతో పెరిగినప్పుడు, ఆ ప్రయోజనం సుదీర్ఘ దేశీయ సరఫరా గొలుసు ద్వారా ప్రయాణించి, పెద్ద కర్మాగారాలు, చిన్న వ్యాపారాలు రెండింటిలోనూ కార్యకలాపాలకు మద్దతు ఇస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రిటైల్ ట్రాక్టర్ అమ్మకాలు 28.1శాతం పెరిగి 1.17 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి, ఇది జులైలో అత్యుత్తమ రికార్డు. ట్రాక్టర్ ఒక ఉత్పాదక ఆస్తి. రైతులు సాధారణంగా మెరుగైన పంట అవకాశాలు, బలమైన నగదు ప్రవాహం, పెట్టుబడి పెట్టడానికి తగినంత విశ్వాసం ఉన్నప్పుడు దానిని కొనుగోలు చేస్తారని ఆ అధికారి పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాల రిటైల్ విభాగంలో అమ్మకాలు 28.3శాతం పెరిగి 18.18 లక్షల యూనిట్లకు చేరుకోగా, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 16.2శాతం పెరిగి 1.34 లక్షలకు చేరుకున్నాయి. ఈ రికార్డులు ఆర్థిక వ్యవస్థలో బలమైన గ్రామీణ కొనుగోలు శక్తిని, సులభమైన రవాణాను, వ్యాపారులు, డెలివరీ కార్మికులు, చిన్న రవాణా నిర్వాహకులకు మరిన్ని ఆదాయ అవకాశాలను సూచిస్తున్నాయి. వాహనాల అమ్మకాల పెరుగుదల విస్తృతి ముఖ్యంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. మొత్తం రిటైల్ రిజిస్ట్రేషన్లు 25.9శాతం పెరిగి 25.91 లక్షలకు చేరాయి. ప్రతి ప్రధాన వాహన విభాగం ఈ ఏడాది జులైలో అత్యంత బలమైన పనితీరును నమోదు చేసింది. పన్ను, చెల్లింపు, పవర్, ఇంధన డేటా ఇది కేవలం డీలర్‌షిప్ కథ మాత్రమే కాదని నిర్ధారిస్తున్నాయి. జులైలో జిఎస్‌టి ఆదాయం 15.4 శాతం, డిజిటల్ చెల్లింపుల పరిమాణం 16.6శాతం, లావాదేవీల విలువ 18.2శాతం పెరిగాయి. విద్యుత్ డిమాండ్ 10.7శాతం పెరిగింది. పెట్రోల్ వినియోగం 9.2శాతం, డీజిల్ వినియోగం 10 శాతం పెరిగాయి. ఈ గణాంకాలు రోజువారీ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన వివిధ అంశాలను సూచిస్తున్నప్పటికీ, అన్నీ ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజలు, వ్యాపార సంస్థలు గత యేడాది కంటే ఎక్కువగా కొనుగోళ్లు, చెల్లింపులు, ప్రయాణాలు, ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలు సాగిస్తున్నాయని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

**బ్యాంకింగ్‌లోనూ పురోగతి:**

వేగంగా సాగుతున్న బ్యాంకింగ్ రుణ కార్యకలాపాలు ఈ డిమాండ్‌కు అండగా నిలుస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం బ్యాంక్ రుణాల వృద్ధి గత దశాబ్ద కాలంలోనే అత్యధిక స్థాయిని నమోదు చేసింది. బ్యాంకింగ్ రంగంలో మరో కీలక మైలురాయి కూడా నమోదైంది. గత 14 ఏళ్లలో తొలిసారిగా రుణ వృద్ధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రైవేట్ రంగ బ్యాంకులను అధిగమించాయి. ముఖ్యంగా, బ్యాంకుల ఆర్థిక స్థితి (బ్యాలెన్స్ షీట్లు) మెరుగుపడటం రుణాల పంపిణీకి దోహదపడుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.98 లక్షల కోట్ల వార్షిక నికర లాభాన్ని నమోదు చేశాయి, అలాగే వాటి స్థూల మొండి బకాయిల నిష్పత్తి చారిత్రాత్మక కనిష్ట స్థాయి అయిన 1.9శాతానికి తగ్గింది.

**పారిశ్రామిక ఉత్పత్తి 6.7శాతం పెరుగుదల:**

ఆర్డర్ల పెరుగుదలకు అనుగుణంగా భారతీయ పరిశ్రమలు స్పందిస్తున్నాయి. జూలైలో పారిశ్రామిక ఉత్పత్తి 6.7 శాతం, తయారీ రంగ ఉత్పత్తి 7.3 శాతం పెరిగాయి. మొత్తం 23 తయారీ విభాగాలలో 19 విభాగాలు వృద్ధిని నమోదు చేశాయి. పెరిగిన ఈ ఆర్థిక కార్యకలాపాలకు అనుగుణంగా ఇంధన, లాజిస్టిక్స్ రంగాలు కూడా పురోగమిస్తున్నాయి. జులైలో 'కోల్ ఇండియా' బొగ్గు సరఫరా (ఆఫ్‌టేక్) 18.4 శాతం పెరిగి 64.19 మిలియన్ టన్నులకు చేరింది, ఇది ఆ నెలలో నమోదైన అత్యధిక స్థాయి. జులైలో రైల్వే సరుకు రవాణా 8.9 శాతం, ఓడరేవుల ద్వారా జరిగే సరుకు రవాణా 8.8 శాతం, విద్యుత్ ఉత్పత్తి 7.3 శాతం పెరిగాయి. ఎగుమతుల రంగం కూడా ఇదే సానుకూల ధోరణిని ధ్రువీకరిస్తోంది. జులైలో వస్తువుల ఎగుమతులు 19.6 శాతం పెరిగి 44.24 బిలియన్ డార్లకు చేరాయి, ఇది ఆ నెలలో నమోదైన అత్యధిక ఎగుమతి విలువ. ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు 17.7 శాతం, ఎలక్ట్రానిక్స్ 57.4 శాతం, రసాయనాల ఎగుమతులు 14.4 శాతం పెరిగాయి. దీని అర్థం, భారతీయ ఉత్పత్తిదారులు బలపడుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడమే కాకుండా, అధిక విలువ కలిగిన తయారీ ఉత్పత్తులతో సహా ప్రపంచ మార్కెట్లలో కూడా ఆర్డర్లను గెలుచుకుంటున్నారు. విదేశీ పెట్టుబడిదారులు దీర్ఘకాలిక మూలధనానికి మరో వనరును జోడిస్తున్నారు. ఏప్రిల్-జూన్ 2026లో స్థూల అంతర్గత ఎఫ్‌డిఐ సుమారు 30.7 బిలియన్లకు చేరుకుంది, ఇది 14.8 శాతం పెరుగుదల. గత కనీసం 15 సంవత్సరాలలో అత్యంత బలమైన త్రైమాసిక పెట్టుబడుల ప్రవాహంగా నమోదైంది.

## ఐటీ, మెటల్, రియల్టీ స్టాక్స్ మార్కెట్‌పై ఒత్తిడి
# స్టాక్ మార్కెట్‌లో నష్టాలు
### సెన్సెక్స్ 307 పాయింట్లు, నిఫ్టీ 95 పాయింట్లు నష్టం



**ముంబై, ఆగస్టు 31:** బలహీనమైన ప్రపంచ సంకేతాల మధ్య, ఐటీ, మెటల్, రియల్టీ, మీడియా స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా భారత బెంచ్‌మార్క్ సూచీలు సోమవారం నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 307.24 పాయింట్లు లేదా 0.40 శాతం క్షీణించి 76,957.27 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 95.25 పాయింట్లు లేదా 0.39 శాతం పడిపోయి 24,080.40 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక దృక్పథంపై వ్యాఖ్యానిస్తూ, సమీప భవిష్యత్తులో ఈ సూచీ 24,180-24,200 స్థాయిల వైపు స్వల్పంగా వెనక్కి తగ్గే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. అయితే, 24,200 స్థాయికి పైన నిలకడగా కదలిక కొనసాగితే, అది సుమారు 100 పాయింట్ల అదనపు పెరుగుదలకు దారితీయవచ్చు. మరోవైపు, 23,990 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయి కంటే కిందకు నిలకడగా పడిపోతే, మార్కెట్‌లో దిద్దుబాటు మళ్లీ ప్రారంభం కావచ్చు అని మార్కెట్ విశ్లేషకుడు ఒకరు పేర్కొన్నారు. నిఫ్టీ సూచీలో ఐటిసి, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్ అతిపెద్ద నష్టాలుగా నిలిచి, బెంచ్‌మార్క్‌ను కిందకు లాగాయి. విశాల మార్కెట్‌లో పనితీరు మిశ్రమంగా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.74 శాతం క్షీణించింది. రంగాల వారీగా కూడా పనితీరు అస్థిరంగా ఉంది. నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ ఐటీ సూచీలు విశాల మార్కెట్ కంటే వెనుకబడ్డాయి. దీనికి విరుద్ధంగా, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కీలకమైన అత్యుత్తమ ప్రదర్శనకారులుగా నిలిచి, మార్కెట్‌కు కొంత మద్దతును అందించాయి. బలహీనమైన ప్రపంచ సంకేతాలు, రంగాల వారీగా అమ్మకాల ఒత్తిడిని పెట్టుబడిదారులు గమనిస్తున్నందున, మొత్తం మార్కెట్ సెంటిమెంట్ అప్రమత్తంగా ఉందని మార్కెట్ నిపుణులు తెలిపారు. "అమెరికా, ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను ఆందోళనలో ఉంచాయి. దౌత్యపరమైన పురోగతి అవకాశాలు సన్నగిల్లడంతో ముడి చమురు ధరలు, ప్రపంచ బాండ్ల రాబడులు పెరిగాయి" అని ఒక మార్కెట్ నిపుణుడు పేర్కొన్నారు. "పెరుగుతున్న ముడి చమురు ధరలు, బాండ్ల రాబడులు ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్ల వాతావరణంపై ఆందోళనలు మొదలయ్యాయి. ఇది ఆదాయాల చక్రంపై భారం మోపవచ్చు" అని పేర్కొన్నారు. జాక్సన్ హోల్ సదస్సులో ఫెడ్ చైర్ వార్ష్ చేసిన కఠిన వైఖరితో కూడిన వ్యాఖ్యల కారణంగా శుక్రవారం డాలర్ఇండెక్స్ పెరిగి రూపాయి విలువ ప్రారంభంలో తగ్గినప్పటికీ, ఆ తర్వాత భారత రూపాయి అద్భుతంగా పుంజుకుని ఆగస్టు 5 నాటి అత్యంత బలమైన స్థాయి వద్ద ముగిసింది. "సాంకేతిక కోణంలో చూస్తే, (డాలర్‌రూపాయి మారకం రేటు) ఒక నిర్దిష్ట పరిధిలోనే కదులుతూ, 95.50 వద్ద తక్షణ ప్రతిఘటనను, 94.90 వద్ద బలమైన మద్దతును ఎదుర్కొంటోంది" అని ఒక మార్కెట్ నిపుణుడు పేర్కొన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.